సంపుటి: 28
సంచిక: 2

ఫోన్ నం:
[illegible]43

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 45 రూపాయలు
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు.

మార్చి, 1979

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
ఏ. వీ. మోహన్రావ్
విద్వాన్ షీలాదేవి

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. ఈవ్‌లిన్—మల్లాది వెంకటకృష్ణమూర్తి.
19. ఒకే ఒక్క రాత్రి—వసుంధర.
38. తొలి పలకరింత—వి. ఎస్. చెన్నూరి.
64. ఎర్ర రంగు—కృష్ణచైతన్య!
93. పోటీ వ్యాపారం—ఎస్. క్రిష్ణవేణి.
108. క్లూ ఇచ్చిన ఉత్తరం—ప్రతాప రవిశంకర్.
120. నభై ఎనిమిది గంటలు—మోదుకూరి జతీంద్రశర్మ.
147. మంచుకొండలు—అంధవరపు మల్లిబాబు.
157. పసివాడి ప్రాణాలు—అజీజ్.
176. అతీంద్రియశక్తులు (సీరియల్)—రమణశ్రీ.

నవలలు (సప్లిమెంట్)

3. కరుణించని అరుణ—వసుంధర.
49. ప్రాణానికి ప్రాణం—టెంపోరావ్.
92. పెయింటింగ్‌కోసం పోరాటం—'సికిందర్'.
147. మృత్యులేఖ—అజీజ్.
195. అడుగుముందుకు వేస్తే చస్తావ్ (సీరియల్)—వసుంధర.

ఇవిగాక—క్రైమ్‌లో తమాషాలు, రచయితలతో ముఖా ముఖి, పాఠకుల ప్రశ్నలు, చెప్పుకోండి చూద్దాం, డిటెక్టివ్ ఫటాఫట్. ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, పాఠకుల పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

డిటెక్టివ్ ఘటాఘట్!

—న్యూటన్



ఈవ్లిన్

మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఈ

"మీరు భారతీయులా?"

ఆమెవంక చూసాను.

తలవూపాడు నా పక్కనేవున్న దాశరథి అవునన్నట్లుగ

"నేను ఢిల్లీలో కొంతకాలం వున్నాను."

దాశరథి నాలాగా కాదు. ఆడపిల్లలతో పరిచయం తనంతట తానే చేసుకునే తరహా వ్యక్తి. లండన్‌లో ఓ అందమయిన ఆంగ్ల యువతి స్వయంగా పలకరిస్తే ఆ పరిచయం చాలాదూరం వెళ్ళేలా చేసుకోగలడు.

నేను ఆసక్తిగా చూసాను ఆ అమ్మాయివంక.

ఇరవై రెండేళ్ళుండచ్చు. నీలంరంగు జీన్స్, గులాబి రంగు స్లేక్, పల్చటి ఆ స్లేక్‌లోంచి సన్నటి నడుము, తెల్లరంగు బిగుతు బ్రాసరీ స్పష్టంగా కనపడుతున్నాయి.

"నా పేరు దాశరథి. హైదరాబాద్‌లో రీసెర్చ్ స్కాలర్‌ని" అని ఆగి నన్ను పరిచయంచేసాడు.

భారతీయుల పద్ధతి ప్రకారం నమస్కారం చేసింది.

చాలా అందంగా నవ్వగలదు అనుకున్నాను.

"హైద్రాబాద్? అది ఎక్కడుంది?" అడిగింది.

"ఆంధ్రప్రదేశ్ రాజధాని. సౌత్ యిండియాలో వుంది."

నేను శ్రద్ధగా కీట్స్ మ్యూజియంలో కీట్స్ బ్రతికున్నప్పుడు వుపయోగించిన కలాలు, టేబిల్, వార్డ్‌రోబ్ చూడసాగాను. దాశరథి నెమ్మదిగా ఆమెతో మాట్లాడుతూ నావెంట నడుస్తున్నాడు.

పావుగంట తర్వాత లండన్‌లోని హేంప్‌స్టెడ్ ప్రాంత్రంలోవున్న కీట్స్ మ్యూజియంలోంచి బయటకి వచ్చాం.

"మీ పేరు?" అడిగాడు దాశరథి.

"ఈవ్‌లిన్" చెప్పింది.

"మీరు తిరిగి ఎప్పుడు వెళ్తున్నారు భారతదేశం?" అడిగింది.

"రేపు వుదయం ఆరున్నరకి మద్రాస్ వెళ్ళే ప్లేన్‌లో

వెళ్తున్నాం. స్టూడెంట్స్ గ్రూప్ కన్సెషన్ పథకంలో వచ్చాము" చెప్పాడు దారశథి.

మ్యూజియం బయటవున్న కియాస్క్ దగ్గరకి దారి తీసింది ఈవ్‌లిన్.

"కోకాకోలా తీసుకుంటారా?" అడిగాడు దాశరథి ఈవ్‌లిన్‌ని.

"తప్పకుండా."

ఎగ్ సేండ్ విచెస్, కోకాకోలాలు తీసుకున్నాడు దాశరథి. నేను జేబులోంచి పర్స్‌తీసాను. మాకు ఫారిన్ ఎక్చేంజ్ తక్కువ ఇచ్చారు. చాలా పొదుపుగా ఖర్చు పెడుతున్నాము. ఈ అనవసరపు ఖర్చుకి దాశరథిని మనసులోనే తిట్టుకున్నాను.

"నేనిస్తాను."

తన ఎడంచేత్తో నా కుడిచేతిని తాకి వారించింది ఈవ్‌లిన్, జీన్స్‌కుండే కుడి ముందు జేబులోంచి చిన్న పర్స్ తీస్తూ.

"ఫర్వాలేదు...."

నా మనసులోని ఆలోచన పసికట్టిందనుకున్నాను ఈవ్‌లిన్ మృదువుగా నవ్వగానే. తనే వాటి ఖరీదు చెల్లించింది.

"ఢిల్లీలో ఎక్కడున్నారు? ఏంచేసేవారు?" అడిగాడు దాశరథి.

"మీ స్నేహితుడు ముభావస్తుడనుకుంటాను?" అన్నది నన్నుచూపి మళ్లీ నవ్వి.

నేను నవ్వి చెప్పాను.

"మీరు చాలా అందంగా వున్నారు. ముఖ్యంగా మీ పేరు నాకు నచ్చింది."

దాశరథి మొహంలోని మార్పు కనుకొనలలోంచి గమనించి మనసులో నవ్వుకున్నాను.

"థాంక్ యూ" అన్నది సిగ్గుగా.

"మీరు ఏంచేస్తున్నారు ఇక్కడ?" అడిగాను.

"బి.బి.సి లో క్లర్క్‌గా పనిచేస్తున్నాను. ఇవాళ వీక్లీ ఆఫ్. అపార్ట్‌మెంట్ కెళితే విసుగు పుడుతుంది. కాబట్టి ఇటొచ్చాను. ఇవాళ రాత్రి ఏంచేస్తున్నారు?" అడిగింది.

"అంటే?"

ఇద్దరం ఒకేసారి ఆశ్చర్యంగా అడిగాం ఆమెని.

"నాతో భోజనం చేద్దురుగాని."

దాశరథి ఈవ్‌లిన్ వంక ప్రశ్నార్థకంగా చూసాడు.

"ఆల్కోవ్ అనే రెస్టారెంట్ కెన్సింగ్‌టన్‌లోని హైస్ట్రీట్‌లో వుంది. అక్కడ బావుంటుంది భోజనం."

"అలాగే" అన్నాడు దాశరథి నేను జవాబు చెప్పే లోగా.

"అయితే ఫోన్‌చేసి నేను టేబిల్ రిజర్వ్ చేయిస్తాను. సరాసరి అక్కడికి వచ్చేయండి....బిల్ నాది. మీరు తక్కువ ఫారిన్ ఎక్చేంజ్‌తో వచ్చివుంటారని తెలుసు నాకు."

"అబ్బే! మీకెందుకు శ్రమ" అన్నాను ఇబ్బందిగా. ముక్కు మొహం తెలియనివాళ్ళ ధర్మంమీద ఆధారపడటం నా కిష్టంలేదు.

"మీకు నా చిరునామా ఇస్తాను. ఇండియా వెళ్ళాక నే ఖర్చుపెట్టే డబ్బుకి బదులు నాకు పోస్టేజ్ స్టాంప్స్ పంపుదురుగాని....స్టాంప్స్ కలెక్ట్ చేస్తాను నేను" చెప్పింది.

ఆల్కోవ్ రెస్టారెంట్‌కి ట్యూబ్ (అండర్ గ్రౌండ్ ట్రైన్)లో ఎలా రావాలో ఎక్కడ దిగాలో చెప్పింది. పాకెట్ నోట్‌బుక్‌లో రాసుకున్నాను నేను.

"ఇప్పుడు ఎక్కడికి వెళ్తున్నారు?" అడిగింది.

"డికెన్స్ హౌస్‌కి వెళ్ళాలి" చెప్పాను నేను.

"కీట్స్ మ్యూజియంలాగా ఎడ్మిషన్ ఫ్రీ కాదు. 38 వ నంబర్ బస్ ఎక్కి వెళ్ళండి. రస్సెల్ స్క్వేర్‌లోని డౌటీ స్ట్రీట్‌లో వుంది" అని చెప్పింది.

"ఏమంటావ్?" అన్నాడు దాశరథి నాతో.

"ప్రయత్నించు, నష్టంలేదుగా" నవ్వాను.

"చాలా అందంగా వుంది కదూ?"

"చెప్పాగా ఆ సంగతి."

ఈవ్‌లిన్ 24 వ నంబర్ బస్ ఎక్కి ట్రిఫాల్గర్ స్క్వేర్ వెళ్ళిపోయింది. 38 వ నంబర్ బస్ రాగానే ఎక్కాము మేము.

౬

భోజనంచేస్తూ చెప్పింది ఈవ్‌లిన్,

"స్టాంప్స్ సేకరించడమంటే నాకు ప్రాణం. ముఖ్యంగా భారతీయ స్టాంప్స్ అంటే ఇంకా ఇష్టం."

ఓ కవరు దాశరథికి అందించి చెప్పింది.

"దీంట్లో నా చిరునామా, నాకు కావలసిన స్టాంప్స్ వివరాలున్నాయి. బొంబేలో చాలామంది స్టాంప్స్ డీలర్స్ వుంటారు. దయచేసి వాటిని కొని పంపించాలి మీరు. ఉపయోగించని స్టాంప్స్ కావాలి. పంపుతారు కదూ?"

"తప్పకుండా" అన్నాడు దాశరథి.

"కేవలం అందుకోసమే మీకు ఖర్చుపెడుతున్నాననుకోవద్దు."

ఈవ్‌లిన్ మమ్మల్ని స్టాంప్స్‌కోసం పరిచయం చేసుకుందని నిర్ధారణ అయింది నాకు. దాశరథి ఆ అమ్మాయితో చాలా విషయాలు మాట్లాడుతున్నాడు.



భోజనం అయాక బయటకి వచ్చాం.

ఆ రెస్టారెంట్ పక్కనేవున్న చెప్పుల దుకాణం ముందు ఆగింది ఈవ్‌లిన్. ఏదో ఆలోచిస్తూ నిల్చుంది కొన్నిక్షణాలు. తర్వాత మమ్మల్ని లోపలికి రమ్మని తను లోపలకి వెళ్ళింది.

దాశరథి ప్రశ్నార్థకంగా చూసాడు నావంక.

"పద" అన్నాను.

"వీళ్ల సైజు బూట్లు చూపించండి" చెప్పింది.

"ఎందుకు?" అన్నాము ఆశ్చర్యంగా.

"చెప్పులు తొడుక్కున్నారు మీరు. బూట్లు తొడుక్కుని ఇన్‌షర్ట్ చేసుకుంటే బావుంటారు" చెప్పింది దాశరథితో.

దాశరథి ఆనందంగా నవ్వుతూ చూసాడు నావంక. లండన్‌లో ఓ అందమయిన అమ్మాయి బూట్లు బహుమతి ఇస్తోంది. ఆ సంగతి మునిమనమలకి కూడా చెప్పుకుంటాడు దాశరథి.

"ఊరికేకాదు. నాకు కావల్సిన స్టాంప్స్ కొని పంపాలి మీరు. వాటి ఖరీదుకి సరిపడ ముందరే వస్తువుల

రూపంలో ఇస్తున్నానన్నమాట."

"నాకువద్దు" అన్నాను.

"థాంక్స్" అన్నాడు దాశరథి ఈవ్‌లిన్‌తో.

"తర్వాత మోసం చేయరుకదా స్టాంప్స్ పంపకుండా?"

బిల్ చెల్లించి అనుమానంగా అడిగింది బయటకి వచ్చాక.

నేను నవ్వి చెప్పాను.

"ఉహూ. మీలాంటి అందమయిన అమ్మాయిని మోసం చేద్దామనుకున్నా చేయలేడు."

"థాంక్స్ ఫర్‌ది కాంప్లిమెంట్"

"మీ ఫోటో తీసుకుంటాను" కోరాను.

"అలాగే. ఫ్లాష్ వుందా?"

తల వూపాను. చెప్పుల దుకాణం అద్దాల షో విండో ముందు నించుంది. రెండు ఫోటోలు తీసాక చెప్పింది.

"మీ ఫోటోకూడా తీస్తాను. ఎక్కడ డెవలప్ చేయిస్తున్నారు?"

"ఇండియాలో."

"గుడ్. తర్వాత నేను క్లిక్ చేసిన ఫోటో నాకు పంపాలి మీ గుర్తుగా."

మే మిద్దరం పక్కపక్కనే నించున్నాం. దాశరథి నా భుజంమీద చెయ్యివేసి నవ్వుతూ చూసాడు కెమెరావంక.

ఫోటో తీసింది.

"మీరు వుండేది ఎక్కడ?" అడిగింది.

"వై.ఎమ్.సి.ఏ హాస్టల్‌లో"

"గుడ్. మనం ఒకే బస్‌లో వెళ్లాలి అయితే."

వై. ఎమ్. సి. ఏ స్టాప్ రాగానే దిగాము మేము ఈవ్‌లిన్‌కి గుడ్‌బై చెప్పి.

"ఈ రాత్రి నిద్రపట్టదు వెంటనే. ఎప్పుడో తెల్లారి పడుతుంది. రేపు వుదయం నువ్వే లేపాలి" అన్నాడు దాశరథి గదికి చేరుకున్నాక.

౨

మర్నాడు వుదయం లండన్‌లోని హీత్‌రో ఏర్‌పోర్ట్‌కి ఎయిర్‌పోర్ట్ బస్‌లో చేరుకున్నాము. అరగంటలో కస్టమ్స్ క్లియరెన్స్ జరిగింది.

సరిగ్గా ఆరున్నరకి ఏర్ ఇండియా బోయింగ్ గాలిలోకి లేచింది. 'నోస్మోకింగ్' అనే సైన్‌బోర్డ్ కనబడే గాజుపలక మీద లైట్ ఆరిపోయింది. వెంటనే అక్షరాలు మాయ మయాయి.

"తప్పకుండా ఇంకోసారి లండన్ వస్తాను నా డబ్బుతో. ఈవ్‌లిన్‌తో ఈలోగా వుత్తరాలద్వారా స్టాంపులు పంపుతూ స్నేహం పెంచుకుంటాను" అన్నాడు దాశరథి సిగరెట్ వెలిగించి.

"నేను ఇండియాకే రప్పించుకుంటాను" అన్నాను నవ్వి.

దాశరథి ఆలోచనలలో మునిగిపోయాడు.

నేను 'ఉమెన్ అండ్ హోమ్' పత్రిక తీసి తిరగేయ సాగాను.

నాలుగ్గంటల తర్వాత విమానం మద్రాస్ మీనంబాకం ఏర్‌పోర్ట్‌లో దిగింది.

చేతిలో సఫారీ బ్రీఫ్‌కేస్‌లతో దిగాము మేము. కస్టమ్స్ క్లియరెన్స్‌కి రెండుగంటలు తక్కువ కాదు. దాశరథిని రిసీవ్ చేసుకోవటానికి దాశరథి అమ్మా, నాన్నా వచ్చారు.

పావుగంట తర్వాత, "దాశరథి ఎవరు?" అడిగాడు ఓ కస్టమ్స్ అధికారి, విమానంలోంచి దిగిన పేసెంజర్స్

అంతా కూర్చున్న హాల్‌లోకి వచ్చి.

"నేను" లేచి నిలబడ్డాడు.

కొద్దిగా తీక్షణంగా చూసాడు అతని వంక. తర్వాత "నాతో రండి" అన్నాడు కరకుగా.

దాశరథి నా వంక కొద్దిగా తెల్లబోతూ చూసాడు. ఆ కస్టమ్స్ ఆఫీసర్ వెంట ప్రయాణీకులని తణిఖీచేసే గదిలోకి వెళ్లాడు.

ఐయిదు నిముషాలుకూడా కాలేదు. దాశరథి సామాను ఆ గదిలోకి తీసుకెళ్లారు. తర్వాత ఒక్కొక్కళ్ళనే లోపలకి పిలచి రెండు, మూడు నిముషాల్లో బయటకి పంపసాగారు తణిఖీచేసి. దాశరథి మాత్రం బయటకి రాలేదు. నా వంతు రాగానే లోపలకి వెళ్లాను.

దాశరథి జాలిగా చూసాడు నా వంక. ఓ కుర్చీలో కూర్చుని వున్నాడు. పక్కనే ఇద్దరు కస్టమ్స్ అధికారులు నిల్చుని వున్నారు కాపలాగా. దాశరథి సామాను జాగ్రత్తగా తణిఖీచేస్తున్నారు. సూట్‌కేస్‌లోని బట్టలు కుట్లు విప్పేసారు. పేస్ట్ బయటికి పూర్తిగా నొక్కి తణిఖీ చేస్తున్నారు అరంగుళంకూడా వదలకుండా.

నా జేబులోని పర్స్, రుమాల మొదలయినవి చూసి వెళ్ళమన్నట్లుగా సైగచేసాడు కస్టమ్స్ అధికారి కొద్దిగా చిరాకుగా.

నేను బయటకి వచ్చాను. దాశరథి నాన్నగారి దగ్గరకి వెళ్లాను.

ఆయన మొహంలోని ఆదుర్దా గమనించి అడిగాను.

"ఏమయిందిట?"

"దాశరథిని పట్టుకున్నారు" చెప్పాడాయన బాధగా.

"దేనికి?"



"ఓ ఖరీదయిన వజ్రం స్మగుల్ చేస్తున్న నేరం మీద."

"వజ్రం స్మగుల్ చేసాడా?"

"అవును. కుడికాలి బూటు మడమలో రహస్యంగా ఓ సొరుగు వుందిట. అందులో వుందిట వజ్రం." ఆయన కంఠం బాధతో వణికింది.

నా గుండె ఝల్లుమంది వెంటనే.

"దాశరథి నేరస్థుడు కాదు....అయితే ఆ అమ్మాయి స్టాంప్స్‌కోసం కాదు ఆ బూట్స్ కొనిచ్చింది" బిగ్గరగా మాట్లాడాను నా ఆలోచనలని.

"ఏమిటి?" అడిగాడు ఆయన.

ఈవ్‌లిన్ గురించి పూర్తిగా చెప్పాను.

ఆయన పెద్దగా నిట్టూర్చి చెప్పాడు.

"అవును. దాశరథికూడా చెప్పాడు ఇదే సంగతి. ఆ సంగతంతా స్టేట్‌మెంటు రాయించుకుంటున్నారు. ఆ చెప్పులషాపు చిరునామా, ఆ అమ్మాయి ఇచ్చిన కవరు అన్నీ తీసుకున్నారు."

"అయితే ఇంకో అరగంటలో వచ్చేస్తాడా?" అడిగాను.

"ఊహూ. రెండు మూడు రోజుల తర్వాత బెయిల్ మీద విడిపించుకోవాలిట" అన్నాడాయన బాధగా.

"ఎంత మోసం" అన్నాను సానుభూతిగా.

"ఇంకా నయం. నువ్వూ ఆ అమ్మాయి అడగ్గానే బూట్స్ కొనుక్కుని వుంటే నీ గతీ ఇంతే అయేది" అన్నాడు ఆయన.

దాశరథి దొరక్కపోతే స్మగ్లింగ్ గ్రూప్‌కి చెందినవాళ్లు అతన్ని దారిలో కొట్టి ఆ వజ్రంగల బూట్‌ని అపహరించి వుండేవారు బహుశ. వాళ్ళకి వర్తమానం అంది వుంటుంది దాశరథి బూట్‌లో వజ్రం వుందని.

నేనిక్కడ వుండి చేసేది ఏం లేదని ఆయన దగ్గర శెలవు తీసుకుని బయటకి వచ్చాను. ఆటో ఒకటి సిద్ధంగా వుంది. అదెక్కి చెప్పాను అలసటగా.

"మాంబళమ్."

౨

గంట తర్వాత స్నానంచేసి హోటల్ గదిలోంచి బయటకి వెళ్ళబోతూండగా వచ్చాడు ఆ ముసలాయన. చక్కటి సెంట్ వాసనవేసింది.

"మీరు దాశరథి స్నేహితుడుకదూ?" అడిగాడు నా వంక పరిశీలనగా చూస్తూ.

ఆయనకి అరవైపైనే వుంటాయి. ఐశ్వర్యవంతుడని తెలిసిపోతుంది.

"అవును" చెప్పాను.

ఓసారి ఆయన కళ్లు గదిలో పరిశీలనగా చూసాయి. నా ట్రాన్సిస్టర్ మీద పడింది ఆయన దృష్టి. చొరవగా దాని దగ్గరకి నడిచి అందుకున్నాడు దాన్ని.

"ఎవరు మీరు?" అడిగాను కొద్దిగా కోపంగా.

మాట్లాడకుండా జేబులోంచి స్క్రూడ్రయివర్ తీసి క్షణాల్లో ట్రాన్సిష్టర్‌కుండే బేటరీలని బయటకి లాగాడు. అవి బయటకి వచ్చాక అందులో చెయ్యిపెట్టి లోపలనుంచి ఓ చిన్న ఎర్రరంగు ప్లాస్టిక్ కాగితం చుట్టిన పేకెట్ బైటకి తీసాడు.

"ఏమిటీ దౌర్జన్యం?" అడిగాను ఆశ్చర్యంగా, కొద్దిగా భయంగా.

"దౌర్జన్యం కాదు. స్నేహితం"

నవ్వి ఓ కవరు జేబులోంచి తీసి ట్రాన్సిష్టర్‌మీద వుంచి అన్నాడు.

"ఇది మీకు ప్రతిఫలం"

"దేనికి? ఏమిటి?"

"నాకు సహాయం చేసినందుకు"

"ఏం సహాయం?"

ఆయన ఆ ఎర్రటి ప్లాస్టిక్ కాగితం విప్పి అందులోంచి ధగధగ మెరిసే సీమబాదం కాయంత డైమండ్ తీసి చూపించి చెప్పాడు.

"దీన్ని లండన్‌నుంచి తెచ్చినందుకు"

"అంటే లండన్‌లో నేను ఈ ట్రాన్సిష్టర్ కొన్నప్పుడే ఇది ఇందులో వుందా? మీకెలా తెలుసు ఇది నేనే కొంటానని?" అడిగాను ఆశ్చర్యంగా. దాశరథి బూట్ గుర్తు కొచ్చింది.

"వై.ఎమ్.సి.ఏ లో మీరు లేనప్పుడు ఆ ట్రాన్సిష్టర్‌లో ఇది రహస్యంగా అమర్చబడింది .... చాలా ఖరీదైన వజ్రం ...."

"నేనిక్కడ వుంటానని ఎలా తెలుసు?"

"తెలుసు. అంతేకాదు. దాశరథి బూటు వెదికితే వజ్రం దొరుకుతుందని, అతను స్మగ్లర్ అని కస్టమ్స్ అధికారులకి నేనే ఫోన్‌చేసి చెప్పాను. లండన్‌లో ఆ అమ్మాయి మిమ్మల్ని పరిచయం చేసుకోవడం మొదలయినవన్నీ నా ఆదేశం ప్రకారమే జరిగాయి...." నవ్వాడు.

"అంటే మీరు...."

"ఉహూ. వృత్తిరీత్యా స్మగ్లర్‌ని కాను. కాని ఈ వజ్రం...." దానివంక ఆరాధనగా చూసాడు పసిపాపను చూసినట్లుగా, "....ఈ వజ్రం అంటే నాకు ప్రాణం. ముచ్చటపడి బ్రిటన్‌నుంచి నేను విజయివంతంగా ఈ పథకంద్వారా తెప్పించుకున్నాను."

"దాశరథిని దేనికి యిరికించినట్లు?" అసహనంగా అడిగాను.

"ఎవరన్నారు ఇరికించానని?"

"పట్టుకున్నారు. ఇప్పుడు కస్టమ్స్‌వాళ్ళ కస్టడీలో వున్నాడు."

పకపకా నవ్వాడు.

"ఉహూ, విడిచిపెట్టేస్తారు యింకో గంటలో. ఇప్పుడే ఫోన్‌చేసి నిజం చెప్పి వస్తున్నాను."

"ఏం నిజం? నా సంగతి చెప్పారా?" అడిగాను భయంగా.

"దాశరథి తొడుక్కున్న బూటులోవున్న వజ్రం నకిలీది. నిజమయినదికాదు. ఇమిటేషన్ జూవెల్ తెస్తే నేరం కాదు. దాని ఖరీదు వందరూపాయలలోపే."

"అది యిమిటేషన్ వజ్రం అయితే అంత రహస్యంగా...."

"క్లుప్తంగా నా ప్లాన్ యిది. మీ యిద్దరిలో ఒకరు పటు

బడితే ఆ విమానంలో ప్రయాణం చేసిన మిగతావాళ్ళని సరిగా చెక్ చెయ్యరు. అప్పుడు వజ్రం వాళ్ళ కళ్ళబడకుండా వచ్చే అవకాశం వుంది. అంటే ఒకరిమీదకి అనుమానం వెళ్ళాలి. దాశరథిని ఎన్నుకున్నాను. అయితే అతని జీవితం నాశనం కాకూడదని, నకిలీవజ్రం ఏర్పాటుచేసాను. అది నిపుణులు పరీక్షిస్తే తెలిసిపోతుంది క్షణంలో. సామాన్యులకి తెలియదు తేడా. అసలుది నీకే తెలియకుండా నీ ద్వారా వచ్చేసింది. కాబట్టి నువ్వు దొంగతనం చేసే అవకాశం లేదు."

"ఒకవేళ నేను కూడా పట్టుబడి వుంటే?" కోపంగా అడిగానాయన్ని.

"ఇది నాకు దక్కేది కాదు" అన్నాడు నవ్వి.

"రాస్కేల్. నాకు తెలియకుండానే నన్ను స్మగ్లర్ని చేసావన్నమాట" పళ్ళు పటపటా కొరికాను.

"అందుకే ఆ కవరు. చక్కటి ప్రతిఫలం. నిజానికి ఈ డబ్బు యివ్వకపోయినా నువ్వేం చేయలేవు. ఇంకో సంగతి. ఈ సంగతి కస్టమ్స్ అధికారులకి చెప్తే ముందర నిన్ను అరెస్ట్ చేస్తారు. తెలిసిచేసినా తెలియకచేసినా నేరం నేరమే చట్టం దృష్టిలో. కాబట్టి మౌనం వుత్తమం అని నా సలహా. ఇక ఈవ్లిన్ సంగతి మర్చిపో. అందులో ఇంకో కవరుంటుంది అది మీ స్నేహితుడికి జరిగిన అసౌకర్యానికి బదులుగా యిచ్చే చిన్న మొత్తం వుంది."

"ఈవ్లిన్? ఆ అమ్మాయిని గుర్తుంచుకోవాల్సిన అవసరం నాకేముంది?" అన్నాను.

లీలగా నవ్వాడు.

"ఈవ్లిన్? ఆ అమ్మాయి పేరుగాదు...."

"మరి?"

"ఈ వజ్రం పేరు అది. కోహినూర్ అంత ప్రఖ్యాతి చెందకపోయినా యిది ఆ కోవకి చెందిన ఖరీదయిన వజ్రం. లండన్ మ్యూజియంలోంచి సంవత్సరంన్నర క్రితం దొంగలు ఎత్తుకుపోయారు."

నేను కొద్దిగా కదిలాను ఆయనవైపు చిన్నగా నవ్వి చేత్తో వారిస్తూ అన్నాడు నా అభిప్రాయం గ్రహించి.

"ఆగు. బయట కారులో నలుగురు వస్తాదులు కత్తులతో సిద్ధంగా వున్నారు. చూడు.... పిలవనా?"

కిటికీలోంచి చూసాను. ఆయన చెప్పింది నిజమే.

"నన్నెప్పుడయినా చూసినా గుర్తుపట్టకు అది నీకు మేలు చేయదు, హాని తప్ప! గుడ్‌బై అండ్ గుడ్‌లక్."

ఈవ్‌లిన్‌ని ప్లాస్టిక్ కాగితంలో చుట్టి దాన్ని కోటు జేబులో వుంచుకుని బయటికి నడిచాడు ఆయన తాపీగా. □

"ప్రాణం పోతుంది"

ఒక రైల్వే స్టేషనులో ఒక ప్రయాణీకుడు మరో ప్రయాణీకుణ్ని ఇలా అడిగాడు. "ఇప్పుడు వచ్చేది వెంకటాద్రి కదూ?"

"ఔను. మీరెక్కడికి వెళ్ళాలి?"

"శ్రీరామ్ నగర్‌కు. అక్కడ నేను దిగవచ్చునా, దీనికి వెళితే?"

"దిగవచ్చు. కానీ ప్రాణం పోతుంది!"

"ఏం? ఎందుకు?

"వెంకటాద్రి అక్కడ ఆగదు."

—చాగాపురం నాగేశ్వరరావు, మల్దకల్.

ఒకే ఒక్క రాత్రి

వసుంధర

"అలా ఎవర్నిపడితే వాళ్ళను ప్రేమించేయకూడదు! ఒకో సారి అనవసరంగా దేవదాసువై పోవాల్సొస్తుంది!" అన్నాడు జయరాజ్.

వరప్రసాదరావు, జయరాజ్ వంక చిరాగ్గా చూసి—

"నాకూ దేవదాసుకీ పోలికేమిటి? వాడు బాధల్ని మరిచి

పోవడంకోసం తాగుడు మొదలెట్టాడు. తర్వాత దానికి బానిస అయ్యాడు. నేను సరదాలకోసం తాగుతున్నాను. చాలామందిని తాగుడు కారణంగా నాకు బానిసల్ని చేసుకున్నాను. ఇలాంటివాడు ప్రేమలో పడ్డానికి షరతులుండవు. ఎవరినైనా సాధించగలను—" అన్నాడు.

"అయితే హేమప్రదను కూడా సాధించగలనంటావ్" అన్నాడు జయరాజ్.

"ఆహా—నిక్షేపంలా—" అన్నాడు వరప్రసాదరావు.

హేమప్రద అసలుపేరు అదికాదు. హిందీలో హేమమాలినికంటే తెలుగులో జయప్రదకంటే ఆమె అందంగా ఉంటుందని అభిమానపడ్డ అభిమానులు పెట్టిన ఆ పేరు వెనుక ఆమె అసలుపేరు మరుగున పడిపోయింది. తనకిటువంటి పేరొకటున్నదని తెలిసినా ఆమె అందుకు గర్వపడుతోంది తప్పితే బాధపడడం లేదు. ఫలితంగా ఆమె స్నేహితురాళ్ళేకాక యింట్లోకూడా అప్పుడప్పుడా పేరు అమల్లోకి వస్తోంది.

హేమప్రదను ప్రేమించిన వరప్రసాదరావుకు తన పేరుమీద బ్యాంకులో పధ్నాలుగు లక్షలున్నాయి. అతని తండ్రి యింకా వ్యాపారంలో వున్నాడు. కొడుకంటే ఆయనకు వల్లమాలిన అనురాగం.

అయితే వరప్రసాదరావు ఆయన అనురాగన్ని దుర్వినియోగం చేయలేదు. గొప్పవాళ్ళు తాగడమూ, అప్పుడప్పుడు ఆడపిల్లల్ని యేకాంతానికి తీసుకుపోవడమూ తప్పు అనిపించుకోదు కాబట్టి అతనెప్పుడూ తప్పుచేయలేదు. సెకండ్ క్లాసులోనే అయినా బియస్సీ పాసయ్యాడు కాబట్టి చాలా బుద్ధిగా చదువుకుంటున్నట్లు లెక్క. సీటురాక ఎమ్మెస్సీలో జేరకపోయినా ఎమ్మే ఫిలాసఫీ చదువుతున్నాడు కాబట్టి



విద్యార్థికుడికింద లెక్క.

అదృష్టమంటే వరప్రసాదరావుదనీ, అతనిలాంటి జీవిత మంటే యింకేమీ అక్కర్లేదనీ అతడి మిత్రవర్గం భావి స్తూంటారు. హేమప్రదను చూసినప్పట్నించీ—ఆమె లేని జీవితం వృథా అనీ—ఆమెను పొందినప్పుడే తన స్నేహి తులు భావించే అదృష్టం తనకున్నట్లు అనుకోవచ్చుననీ వర ప్రసాదరావు భావిస్తాడు.

వరప్రసాదరావు ప్రేమ గురించి జయరాజ్‌కు బాగా తెలుసు. అతడు లక్ష్మిని ప్రేమించాడు. ఒక్కరాత్రి అను భవించి వదిలేసాడు. గౌరిని ప్రేమించాడు. రెండురాత్రులు అనుభవించాడు. అతడు యింతవరకూ చాలా ఎక్కువగా ప్రేమించిన లలితాంబను మొత్తం అయిదుసార్లు అనుభ వించాడు. అదే రికార్డు.

హేమప్రదకు వరప్రసాదరావు వుత్తరం రాసాడు. మరో ఆడపిల్లకైతే అది నిజంగా వరమే అయ్యేదేమో— ఎందుకంటే అతని ప్రేమకు గురైన ఆడపిల్లకు రాత్రికి కనీసం వెయ్యిరూపాయలు ముడతాయి. హేమప్రదకు

డబ్బు బాగా అవసరం. ఆమె ఉద్యోగంచేసి తలిదండ్రు లనూ, తమ్ముణ్ణీ పోషిస్తోంది. ఆమె వయసు పద్దెనిమిది సంవత్సరాలుంటుంది. ఆమె యేదో కంపెనీలో టైపిస్టుగా పని చేస్తోంది.

ఒకరోజు వరప్రసాదరావు ఆమెను బజార్లో చూసి ఆశ్చర్యపడి తన స్నేహితుడి నడిగాడు—"ఆమె తెలియదూ? హేమప్రద—" అంటూ ఆశ్చర్యపోయాడు జయరాజ్.

"నీకు తెలిసి నాకు తెలియని ఈ బ్యూటీ ఈ ఊళ్ళో యెంతకాలం నుంచి వుంటోంది?" అన్నాడు వరప్రసాదరావు నొచ్చుకుంటూ.

"నీకు ఫలించే ప్రేమ అంటే యిష్టంగా—అందుకే ఆమె ఇంతకాలమూ నీ కళ్ళబడలేదు. ప్రేమ ఫలించడం కోసమే కాదనుకునే నాబోటివాళ్లు గత నాలుగుసంవత్సరాల నుంచి ఆమెను ఆరాధిస్తున్నారు—" అన్నాడు జయరాజ్. హేమప్రదకా పేరెలా వచ్చిందో కూడా వివరించాడు జయరాజ్.

"నేనామెను ప్రేమిస్తున్నాను—" అన్నాడు వరప్రసాదరావు.

"అలా యెవర్నిపడితే వాళ్ళను ప్రేమించేయకూడదు! ఒకోసారి అనవసరంగా దేవదాసువై పోవాల్సొస్తుంది" అన్నాడు జయరాజ్.

అతనీ మాటలు అనడానికి ఉన్న చాలా కారణాలలో ముఖ్యమైనది హేమప్రద వ్యక్తిత్వం.

హేమప్రదకు అందం ఉంది కాబట్టి యెంతోమందిని ఆకర్షించిందికానీ ఆమెలో ఉన్న మిగతా ఏ గుణాలూ అట్టే ఆకర్షణీయమైనవికావు. అందంగా ఉంటానని ఆమెకు

తెలుసు కాబట్టి తగినంత గర్వముంది ఆమెకు. అలాగని జీవితంమీద పెద్ద ఆశలు లేవు. సామాన్యమైన గుమస్తాను వివాహం చేసుకుని సాఫీగా జీవితం గడిపేయాలనుకుంటోందామె. ప్రేమమీద ఆమెకు నమ్మకంలేదు. పెళ్ళికి తలిదండ్రుల యిష్టమే ప్రధానం. పొగడ్తలెన్ని విన్నా ఇష్టమే కానీ యెదుటివాళ్ళను పొగడదు. తనచుట్టూ తిరిగే మగవాళ్ళంటే తూష్ణీభావం. డబ్బుకు లొంగదు. నీతికి ప్రాముఖ్యత నిస్తుంది. ఆమెకోసం ప్రయత్నించిన వారందరూ భంగపడ్డారు

జయరాజ్ వివరాలకు వరప్రసాదరావు భయపడలేదు. అందరూ ప్రయత్నించడం వేరు, నేను ప్రయత్నించడం వేరు—అనుకున్నాడతను.

నిర్ణయం తీసుకున్న మరుసటిరోజున అతను హేమప్రదకో ఉత్తరం రాసాడు. ఆమె అతనంటే యిష్టపడిన పక్షంలో అలంకార్‌టాకీస్ దగ్గరకు రావాలి. ప్రతిఫలం అయిదువేలు.

ఉత్తరం రాశాడు కానీ తన మాట మన్నించి ఆమె అక్కడకు వస్తుందని అతడనుకోలేదు. అందుకే ఆమె అక్కడకు వచ్చినప్పుడు అతను నిజంగానే ఆశ్చర్యపోయాడు.

"హలో హేమా!" అంటూ పలకరించాడతను.

"ఎవర్నువ్వు?" అందామె.

"నీకు త్తరం రాసినవాణ్ని" అన్నాడు వరప్రసాదరావు.

హేమప్రద తన జాకెట్లోంచి ఒక కవరు తీసి అతనికి అందించి గబగబా అక్కడ్నించి వెళ్ళిపోయింది. వరప్రసాదరావు ఆత్రుతగా కవరు చింపాడు. అందులో హేమ తనకు త్తరం రాసింది. ఏమని రాసిందో!

"నా కోసం ఆయిదు వేలిస్తానన్నావు. కానీ నారేటు అది కాదు. మీ అమ్మకు నువ్వు పుట్టడానికి కారణమైన మగాడు ఆమెకు ఎంతిచ్చాడో ఆమెనోట స్వయంగా నాకు చెప్పిస్తే అదే నా రేటు అవుతుంది."

ఉత్తరంలో సంబోధన లేదు. సంతకం లేదు.

వరప్రసాదరావు ఆవేశపడలేదు. నిరుత్సాహపడలేదు.

అతను తన తల్లిని నమ్ముతాడు. ఏ కొడుకయినా తన తల్లి పవిత్రతను విశ్వసిస్తాడు. తన జన్మకు కారకుడు తండ్రి అనే అతని నమ్మకం హేమప్రద ఉత్తరానికి అర్థం తన్ను పెళ్ళి చేసుకోమని. ఉత్తరం చాలా తెలివిగా రాసిందామె.

2

వరప్రసాదరావు మర్నాడు హేమప్రద ఆఫీసునుంచి వస్తున్న సమయంలో కాసి "నన్ను వరప్రసాదరావు అంటారు. కోటీశ్వరుడి కొడుకుని. బ్యాంకులో నా పేరున పధ్నాలుగు లక్షలున్నాయి" అన్నాడు.

"సో వాట్?" అంది హేమప్రద మామూలుగా.

"నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను" అన్నాడతను.

హేమప్రద ఆశ్చర్యంగా చూడలేదు.— "సారీ" అందామె.

"ఏం తక్కువ నాకు?" అన్నాడతను కోపంగా.

"నువ్వు నాకు రేటు కట్టావు. అలాంటి ఆలోచన లున్నవాళ్ళంటే నాకు అసహ్యం."

"అది రేటు కట్టడం కాదు. నీకు పరీక్ష."

"నన్ను పరీక్షించడ మెందుకు? పెళ్ళికి ముందే నన్ను పరీక్షించాలనుకునే అనుమాన పిశాచిని కట్టుకుని నేనేం

సుఖపడతాను?" అంది హేమప్రద.

"నేను కాదు-నా డబ్బు నిన్ను సుఖపెడుతుంది" అన్నాడు వరప్రసాదరావు.

"బ్యాంకులో పధ్నాలుగు లక్షలున్నాయంటున్నావు. నేనెందుకు కావాల్సొచ్చాను?"

వరప్రసాదరావుకు జవాబు తోచలేదు.

హేమప్రద నవ్వి—"డబ్బు సుఖమివ్వదు. ఒకవేళ ఇచ్చినా ఆ సుఖం నాకక్కర్లేదు" అంది.

"నీకు తెలియదు. డబ్బుంటే కష్టాలుండవు...." అన్నాడు వరప్రసాదరావు.

"కష్టాలు నాకు బాగా అలవాటు. అవంటే నాకిష్టం కూడా."

ఏమనాలో తెలియక—"హేమా, నిన్ను ప్రేమిస్తున్నాను...." అన్నాడతను.

"ప్రేమకు అర్థం తెలిసినవాడు నీకులా ప్రవర్తించడు" అంది హేమప్రద. ఆ తర్వాత అతని జవాబుకు ఎదురు

చూడకుండా అక్కణ్నుంచి వెళ్ళిపోయిందామె.

ప్రేమికుడెలా ప్రవర్తించాలీ అని ఆలోచించాడతను. నలుగురు కిరాయి రౌడీలను బేరమాడాడు. మర్నాడు హేమప్రద ఒక ఇరుకుసందులోంచి వెడుతూండగా వాళ్లామెను ఎదుర్కొన్నారు. హేమప్రద పులులమధ్య లేడిలా అయిపోయింది. ఆ సమయంలో వరప్రసాదరావు అక్కడ ప్రవేశించి వాళ్ళను చిత్తుగా తన్ని తరిమేశాడు.

"వాళ్ళు పిడుగుల్లా వున్నారు. నువ్వొక్కడివీ వాళ్ళు నలుగుర్నీ...." అంది ఆశ్చర్యంగా హేమప్రద. మాటను పూర్తిచేయకపోయినా ఆమె అనదల్చుకున్నది వరప్రసాదరావుకు తెలిసింది.

"ప్రేమ....అదే నాకు బలాన్నిచ్చింది...." అన్నాడతను.

హేమప్రద నవ్వి—"ప్రేమకాదు. డబ్బు నీకు బలాన్నిచ్చింది...." అంది.

"అది డబ్బు గొప్పతనం...."

"డబ్బుతో వచ్చిన బలం డబ్బుతోనే పోతుంది. ఆ బలం నాకు నచ్చదు."

"కానీ ఆ బలమే నిన్ను రక్షించింది...." అన్నాడతను.

"రక్షించబడవలసిన అవసరం నాకు లేదు. ఎన్నడూ లేనిది ఇక్కడికి రౌడీలెలా వచ్చారు? వాళ్ళను నువ్వొక్కడివీ ఎలా ఎదిరించగలిగావు? ఈ మాత్రం ఊహించగలను. డబ్బుకున్న పిచ్చి ఇదే! లేని సమస్యలనుసృష్టించి మళ్ళీ వాటిని పరిష్కరిస్తూంటుంది. డబ్బు లేకపోతే అసలు సమస్యే వుండదు."

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను హేమా! అందుకోసమే

నిన్ను వెన్నంటి తిరుగుతున్నాను. రౌడీలు నిన్ను చుట్టు ముట్టడం చూశాను. బలా బలాల అంచనా కూడా వేసుకో కుండా వాళ్ళమీద పడ్డాను. ప్రేమ బలం చాలా గొప్పది కాబట్టి వాళ్ళను లొంగదీయగలిగాను. నా ప్రేమను గుర్తించి నన్ను పెళ్లాడక తప్పదు....” అన్నాడు వర ప్రసాదరావు.

“అయితే నీ ప్రేమ బలాన్ని ఋజువు చేసుకునే అవ కాశముంది. హనుమంతరావుని ఓడించు” అని అక్క ణ్నించి వెళ్ళిపోయింది హేమప్రద.

3

హనుమంతరావెవ్వరో వరప్రసాదరావుకు తెలియలేదు. కానీ జయరాజ్‌కు తెలుసు. అందువల్ల అతనికి హనుమంత రావు వివరాలు సులభంగానే తెలిశాయి.

హనుమంతరావుకు తలిదండ్రులు సంపాదించిన ఆస్తి వుంది. బియ్యేదాకా చదువుకున్నాడు. మంచి వస్తాదు. అతను హేమప్రదను ప్రేమించాడు. ఆమె తండ్రి నిరాకరించాడు. స్వయంగా హేమప్రదను బ్రతిమిలాడాడు. తనకు హను మంతరావంటే సోదరప్రేమ అని చెప్పిందామె. హను మంతరావు బ్రహ్మచారిగా వుండిపోవడానికి నిర్ణయించు కున్నాడు. ఎవరైనా హేమప్రదకు అపకారం తలపెడితే అతను సహించలేడు. అతనిప్పటికీ ఆమెను ప్రేమిస్తూ, అభిమానిస్తూ వున్నాడు.

“నువ్వు హనుమంతరావును ఓడించడం అసాధ్యం” అన్నాడు జయరాజ్.

“నాకు డబ్బుంది” అన్నాడు వరప్రసాదరావు.

“అయితే ప్రయత్నించు” అన్నాడు జయరాజ్.

వరప్రసాదరావు హనుమంతరావును కలుసుకున్నాడు.

తన ప్రేమ గురించి వివరించాడు. ఆమె తనకు పెట్టిన పరీక్ష గురించి చెప్పాడు.

"హేమప్రదకు పెళ్ళికాకపోతే సంతోషించేవాళ్ళలో ప్రథముడ్ని నేను కాబట్టి నేను నీకేవిధంగా సహకరించ లేను" అన్నాడు హనుమంతరావు.

"నువ్వు ఓడపోతే పదివేలిస్తాను...." అన్నాడు వర ప్రసాదరావు.

"ఇంతవరకూ పోటీల్లో నెగ్గి డబ్బు సంపాదించాను. ఓడిపోతే డబ్బు వస్తుందని ఇప్పుడే తెలిసింది. దురదృష్ట వశాత్తూ నాకు డబ్బు అవసరం లేదు" అన్నాడు హను మంతరావు.

వరప్రసాదరావు బేరాన్ని పాతికవేలవరకూ పెంచాడు.

"నువ్విక్కణ్నుంచి వెళ్ళిపోకపోతే నేనే గాలిలోకి ఎత్తి విసిరేస్తాను...." అంటూ హనుమంతరావు భుజాలు ఎగరేసి గాలి పీల్చాడు. అతని ఛాతీ ఉబ్బింది.

"నేను నిజంగా చెబుతున్నాను. నీకెంత కావాలంటే అంత డబ్బిస్తాను. హేమప్రద లేకపోతే నేను బ్రతకలేను. నాకీ సాయం చేసిపెట్టి ఆమెను నాకు దక్కించు" అన్నాడు వరప్రసాదరావు.

"నీలాంటి అర్భకుడి చేతిలో ఓడిపోవడం నాకు అవ మానం. నన్ను గెలిచి నువ్వు హేమప్రదను వివాహం చేసుకుంటే అదింకా నాకు అవమానం" అన్నాడు హను మంతరావు.

"అయితే ఇక తప్పేదిలేదు. ఒక పర్యాయం మన మిద్దరం బలా బలాలు చూసుకుందాం—" అన్నాడు వరప్రసాదరావు.

"ఇందులో చూసుకోవడానికేముంది?" అంటూ హను

మంతరావు అతన్ని పైకెత్తి అవతలకు విసిరేశాడు. అతను సరిగ్గా అక్కడున్న పరుపుల మంచంమీద పడ్డాడు. హనుమంతరావు రొమ్ము విరుచుకుంటూ అక్కడకు వెళ్ళి—"నా బలం, గురికూడా సాటిలేనివి. నువ్వు అర్భకుడివికదా అని జాలిపడి పరుపుమీదకు విసిరేశాను. ఇంకోసారి ప్రయత్నిస్తేమటుక్కు నీకు ఎముకలు విరగడం తథ్యం—" అన్నాడు.

వరప్రసాదరావు మంచంమీంచి లేచి వళ్ళు దులుపుకుని మరి మాట్లాడకుండా అక్కణ్నించి కదిలాడు. తన డబ్బు తన కుపయోగపడకపోవడం హేమప్రదకు సంబంధించిన విషయాల్లోనే జరగడం అతనికి చాలా అవమానంగా వుండి పట్టుదలను పెంచుతోంది.

ఈసారి జయరాజ్ సలహా అడక్కూడ దనుకున్నాడతను. రసికుడిగా పేరుపొందిన రామకృష్ణ అనే ఇంకో స్నేహితుణ్ని—"ఎంత ప్రయత్నించినా లొంగకుండా వున్న అమ్మాయిని లొంగదీసుకోవాలి. ఏదైనా వుపాయం చెప్పు—" అన్నాడు.

"పిట్ట అందంగా వుంటుందా?" అన్నాడు రామకృష్ణ.

"మాటల్లో వర్ణించలేనంత అందంగా వుంటుంది—"

"అయితే నాకో ఛాన్సు వదిలేయ్. తర్వాత నీకు అప్పగించేస్తాను...."

"ఫూల్—ఆ అమ్మాయి నాక్కాబోయే భార్యరా—" అన్నాడు వరప్రసాదరావు.

"సారీ గురూ-నాలాంటివాడితో మాట్లాడేటప్పుడు కాస్త ముందుగానే అన్నీ చెప్పాలి. నోరు మంచిది కాదు కదా" అని—"ఎలాగో అలా కాస్త బ్రాందీ పట్టించి చూడు-" అన్నాడు రామకృష్ణ.

నిజమే! తాగుడు శరీరాన్ని మరిచిపోయేలా చేస్తుంది. మనిషి ప్రవర్తనను మార్చేస్తుంది. మహా మహా వాళ్ళే తాగుడుకు లొంగిపోయి తమ ప్రవర్తనలు మార్చేసుకున్నారు. ఈ ఉపాయం తనకు మొదట్లోనే తడితే ఎంత బాగుండేది!

ఉపాయం బాగానేవుంది కానీ పిల్లి మెడలో గంట కట్టడమెలా? హేమప్రదచేత పెద్ద డోసులో తాగించడమెలా?

వరప్రసాదరావు వసంతను కలుసుకున్నాడు, వసంతకూ అతనికీ పూర్వ పరిచయముంది. అతను ఆమెకు తన ఇబ్బంది చెప్పుకుని—"నేను నీ గదిలో రహస్యంగా వుంటాను. ఆమెతో స్నేహం చేసుకుని ఎలాగో నీగదికి తీసుకునిరా. మాటల్లో మభ్యపెట్టి ఏమిటో చెప్పకుండా బ్రాందీ ఇచ్చి మత్తెక్కించు. నీ ఋణం పలువిధాలుగా తీర్చుకుంటాను" అన్నాడు.

ప్రతిఫలం దిట్టంగా ఉంటుందని తెలుసుకాబట్టి వసంత అంగీకరించింది. వెంటనే ఆమె ప్రయత్నించి హేమప్రదతో పరిచయం చేసుకుంది. వారం పదిరోజుల్లో ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. తన అందాన్ని తరచుగా పొగిడే మనిషి అందులోనూ అమ్మాయి అయితే స్నేహం కలపడానికి బలపడడానికీ ఎంతో సమయం పట్టదు మరి.

4

"నాకో చిన్న కోరిక వుంది. కానీ నీవల్లనౌతుందా అని చూస్తున్నాను...." అంది వసంత.

"ఏమిటది?"

"మగవాళ్ళు బార్లలోకి పోయి అదేపనిగా తాగుతూం

టారు. మనమా పనిని చేయలేము. సరదాగా నీలాంటి వాళ్ళ కంపెనీలో కూర్చుని తాగి అనుభవం ఎలాగుంటుందో చూడాలనుంది" అంది వసంత.

"ఛీ-ఆడవాళ్ళు తాగకూడదు. తప్పు" అంది హేమ ప్రద.

"మగవాళ్ళు తాగినప్పుడు లేని తప్పు మనం తాగితే వస్తుందా?" అంది వసంత.

"తప్పుకాదని ఎవరన్నారు? తాగే మగవాళ్ళంటే నాకు చాలా అసహ్యం" అంది హేమప్రద. ఆ తర్వాత ఆమె వసంతను తాగుడు గురించి హెచ్చరిస్తూ చాలా మాటలు చెప్పి—"బలహీనత మనిషికి వుండకూడదు. నీతిని నమ్ముకుని ఆచరించినవాడు ఏం లేకపోయినా ఆ బలంతో బతికేయగలడు...." అంటూ వసంతకు నీతిబోధలు కూడా చేసింది.

"పోనీ ఒకపర్యాయం నా గదికిరా—సరదాగా కబుర్లు చెప్పుకుందాం" అంది వసంత.

"దానికేముంది-అలాగే" అంది హేమప్రద. వచ్చే గురువారం రాత్రి ఏడుగంటలకు హేమప్రద వసంత గదిలో భోజనం చేసేఏర్పాటు జరిగింది. రాత్రితొమ్మిదిన్నర వరకూ అక్కడ గడిపి వెనక్కి వెళ్ళిపోతుందామె.

ఈ ఏర్పాటు గురించి వసంత ముందే వరప్రసాద రావుకు చెప్పింది. అతను ముందే ఆమె గదికి వెళ్ళి అనువైన చోటు చూసుకుని దాక్కున్నాడు.

అనుకున్న ప్రకారం రాత్రి ఏడు గంటలకు హేమప్రద, వసంత గదిలోకి వచ్చారు. వసంత తలుపు గడియ పెట్టి—"భోజనం హెవీగా వుండదు, బిస్కట్లు, పళ్ళు అంతే!" అంది.

"ఈరోజు గురువారంకదా-రాత్రి భోజనం చేయను" అంది హేమప్రద.

ఇద్దరూ కాసేపు అవీ యివీ కబుర్లు చెప్పుకున్నారు. వసంత ఎక్కువగా మగవాళ్ళ గురించి మాట్లాడింది. హేమప్రద ఏమాత్రమూ ఆసక్తి చూపకుండా-"పెళ్ళయ్యాక వాళ్ళ బాధ ఎలాగూ తప్పదు. ఇప్పుడింకేమయినా కబుర్లు చెప్పుకుందాం" అంది.

"పెళ్ళి కావాల్సిన ఆడపిల్లలకు మగాళ్ళ కబుర్లు తప్ప యింకేముంటాయి?" అంది వసంత.

"నువ్వూ ఉద్యోగం చేస్తున్నావు. నేనూ చేస్తున్నాను. నీకూ సమస్యలున్నాయి. నాకూ వున్నాయి. వాటి గురించి మాట్లాడుకోవచ్చు."

"మన సమస్యల్లోకల్లా ముఖ్యమైనది పెళ్ళి. అది మగవాడితో ముడిపడి వుంది" అంది వసంత.

హేమప్రద అయిష్టంగా తలూపి—"నువ్వు త్వరగా పెళ్ళిచేసుకోవడం మంచిది" అంది.

"ఆ అదృష్టం నాకింకా లేదు. ఈ సమస్య నన్ను దొలిచేస్తూ వుంటుంది. అది మరిచిపోవడంకోసం తాగుడు అలవాటు చేసుకుందామనిపిస్తూంటుంది. కానీ అందుకూ కంపెనీ కావాలిగదా!"

"నేను తాగను...." అంది హేమప్రద కోపంగా ముఖంపెట్టి.

"అలా అంటే కుదరదు"అంటూ వరప్రసాదరావు వారి మధ్యకు వచ్చాడు. అతనిచేతిలో రెండు బాటిల్సున్నాయి. అతన్ని చూస్తూనే హేమప్రద ఆశ్చర్యపడింది. మనసులో ఏదో అనుమానం చోటు జేసుకుంది. వసంతవంక అదోలా చూసింది. ఆమె ముఖం చూడలేక వసంత తలదించుకుంది.

"ఈ రోజు మనం ముగ్గురం కలిసి తాగుదాం. ఎవరి కైనా ఇష్టం లేకపోతే బలవంతంగా తాగిస్తాం", అన్నాడు వరప్రసాదరావు బాటిల్సు పక్కనున్న బల్లమీద పెట్టి.

హేమప్రద తొట్రుపడలేదు. ఆ సమయంలో అరిచి గోలచేసినా బాగుండదు. అనవసరంగా అల్లరి అవుతుంది. బాటిల్సు.... ఒక పురుషుడు, ఇద్దరుస్త్రీలు. ఇందులో ఎవరినీ అమాయకులనుకునేందుకు బయటవాళ్ళకు ఆస్కారం కనిపించదు.

"వసంతకు తాగుడుమీద మోజుందనీ అందుకే తన గదికి తీసుకువెడుతోందనీ నాకు తెలుసు. తాగడానికి నాకూ అభ్యంతరంలేదు. కానీ కాస్త బెట్టుచేశాను...." అంది హేమప్రద.

వరప్రసాదరావు ముఖం వెలిగింది. అతను బాటిల్స్ ఓపెన్ చేశాడు. వసంత గ్లాసులు తీసుకువచ్చింది. హేమ ప్రద అక్కడి వాతావరణాన్ని పరిశీలిస్తోంది.

వరప్రసాదరావుకు హేమప్రదను బలవంతంగా అనుభ వించడం యిష్టంలేదు. ఆమె వ్యక్తిత్వాన్ని తాగుడు మైకంలో నాశనంచేసి తృప్తిగా అనుభవించి అప్పుడామెకు ఏ దారీ ఉండదు కాబట్టి—లొంగివస్తే పెళ్ళి చేసుకోవాలను కుంటున్నాడతను. అందుకే యిప్పుడీ యేర్పాటు చేశాడు.

"నేను యింతవరకు ఒక్కసారికూడా తాగలేదు.అందు వల్ల నాకు కాస్త వ్యవధి కావాలి. మగవాళ్ళు తాగుడు గురించి ప్రగల్భాలు పలుకుతూంటారు. మా ఆఫీసులో ఒకాయన—ఆడది స్వయంగా అందిస్తే వద్దనకుండా రాత్రి తెల్లవార్లూ తాగుతూ వుండిపోతానన్నాడు. అది

సాధ్యంకాదని అన్నాను నేను. పందెం కట్టమన్నాడు. నేను కట్టలేదు కానీ యిప్పుడా అవకాశం వచ్చింది—" అంటూ బాటిల్లోంచి గ్లాసులోకి వంపి వరప్రసాదరావుకు అందించింది హేమప్రద.

తన అదృష్టానికి పొంగిపోయిన వరప్రసాదరావుకు హేమప్రద ఆలోచన స్ఫురించలేదు ఆమె అందిస్తుంటే అతను గ్లాసుమీద గ్లాసు పుచ్చుకుంటూనే ఉన్నాడు. మధ్యలో చాలనుకుంటే అతన్ని మాటలతో రెచ్చగొట్టింది హేమప్రద. తాగుడు మైకంలో కలిగిన పంతంలో అతను అదే పనిగా తాగి తూలి పడిపోయాడు.

"నేను వస్తాను...." అని వసంతకు చెప్పి అక్కణ్ణించి వెళ్ళిపోయింది హేమప్రద. అటువంటి అమ్మాయిని తన గదికి తీసుకువచ్చినందుకు వసంత మనసులో నొచ్చుకుని—"నన్ను క్షమించమని అడగడానికి నోరు రావడం లేదు. మళ్ళీ నీకు నా ముఖం చూపించనని మాట యిస్తున్నాను...." అంది హేమప్రదతో.

ఆ రాత్రి అంతా ఒక మగవాణ్ణి తనగదిలో ఉంచుకున్నందుకు వసంతకు చాలా యిబ్బందులు కలుగుతాయి. అతడి ఉనికిని రహస్యంగా ఉంచడానికి ఆమె చాలా కష్టపడింది. మర్నాడు లేచి—జరిగినది తెలుసుకున్నాక—"నువ్వు పక్కనున్నది యెందుకు? నన్ను హెచ్చరించవద్దూ" అంటూ విసుక్కున్నాడు వరప్రసాదరావు.

"బాగుంది. అవసరం నీది. ఆ వివేకం నీకుండాలి. మీ యిద్దరికీ మధ్య అడ్డురాకుండా ఉన్నాను నేను. చేయదలుచుకున్నదీ, చేయగలిగినదీ అంతే కదా మరి...." అంది వసంత.

ఎలాగో అక్కణ్ణించి బయటపడ్డాడు వరప్రసాదరావు.

హేమప్రదకు తనపైన అసహ్యం కలిగి ఉండవచ్చు. ఇప్పు డింకే దారీ లేదు. అతను రెండురోజులాగి హేమప్రద యింటికి వెళ్ళి ఆమె తండ్రితో మాట్లాడాడు.

అతని హోదా గురించి విని ముందాయన కంగారు పడ్డాడు. తర్వాత లోపలకు వెళ్ళి కూతురితో మాట్లాడి వచ్చి—"ఈ పెళ్ళి జరగదు—" అని చెప్పేశాడు.

వరప్రసాదరావు నిరుత్సాహపడకుండా మర్నాడామెను ఆఫీసువద్ద కలుసుకుని—"నేను స్వయంగా మీ నాన్నగారిని కూడా అడిగాను. నా ప్రేమకు యింతకంటె ఋజువే ముంది? నన్నెందుకు పెళ్ళి చేసుకోవు....?" అని అడి గాడు.

"నువ్వొ తాగుబోతువి. వ్యభిచారివి. నీతో నాకు వివాహ మేమిటి?" అంది హేమప్రద.

వరప్రసాదరావుకు హేమప్రదతో తన కింక పొసగదని అర్థమైపోయింది. ఇంక వేరే దారిలేదు. మర్యాదగా మస లడంవల్ల పని జరగదు. బలవంతంగానైనా ఆమెను అను భవించాలి. అప్పుడే అది సాధ్యపడుతుంది.

5

హేమప్రదను చాలా సులభంగా తన గదికి రప్పించుకో గలిగాడు వరప్రసాదరావు. ఆమె తండ్రి హాస్పిటల్లో ఉన్నాడన్న తప్పువార్త, టాక్సీ యెక్కడం, అతని గదికి చేరడం చాలా సులభంగా అయిపోయాయి.

"ఈరోజు నిన్ను వదలను...." అన్నాడు వరప్రసాద రావు.

"అరుస్తాను....అల్లరి చేస్తాను...."అంది హేమప్రద.

"అరిచి గీపెట్టినా యిక్కడికెవ్వరూ రారు...." అన్నాడతను.

అది నిజమేనని చాలా తొందరగా ఋజువయింది.

తను పశుబలానికి లొంగిపోతున్నానని గ్రహించిన హేమప్రద అతన్ని బ్రతిమలాడింది. వేడుకుంది. కాళ్లు పట్టుకుంది. ఆఖరికి పెళ్ళి చేసుకుంటానని ఒప్పుకుంది.

"అయితే యిప్పుడు మనిద్దరికీ గాంధర్వ వివాహం" అన్నాడు వరప్రసాదరావు.

హేమప్రద బలం, తెలివితేటలు, సమయస్ఫూర్తి— ఏదీ పనికిరాలేదు. ఆమె వరప్రసాదరావు చేతిలో నలిగి పోయింది.

"ఏడవకు. నిన్ను పెళ్ళి చేసుకుంటాను—" అన్నాడు వరప్రసాదరావు.

ఇది ఆ రోజు సంగతి.

ఇప్పుడు హేమప్రద ప్రతిరోజూ వరప్రసాదరావును "మన పెళ్ళెప్పుడు?" అని అడుగుతోంది. అతను నిర్లక్ష్యంగా నవ్వి వెళ్ళిపోతే ప్రాధేయపడుతోంది. తనకు అన్యాయం తలపెట్టవద్దని వేడుకుంటోంది.

నిజం చెప్పాలంటే వరప్రసాదరావుకు ఇప్పుడు హేమప్రదపై మోజు లేదు. ఆమె అందం అతన్ని ఆకర్షించడంలేదు.

తనంటే మోజుపడి తన్ను ప్రాధేయపడి తనచుట్టూ తిరుగుతూండే వరప్రసాదరావు ఒకేఒక్క రాత్రి అనుభవంతో అలా యెందుకు మారిపోయాడో తల బద్దలు కొట్టుకున్నా అర్థంకాని హేమప్రదకు లోపం తనలోనే ఉన్నదని అర్థంకాలేదు.

తను నమ్మిన నీతి తనను నిర్వీర్యురాలిని చేసింది. ఒక్కసారి అతనికి లొంగిపోవడంతో నత సర్వస్వం అతనికి ధారపోసినట్లు భావించింది. నువ్వు తాగుబోతువి, వ్యభి

చారివి అని నిందించిన నోటితో పెళ్ళి చేసుకోమని బ్రతి మాలుతోంది. ఒకేఒక్క రాత్రితో మారిపోయింది తను. ఆ మార్పు ఆమెపట్ల వరప్రసాదరావుకు గల ఆకర్షణ పోగొట్టింది.

ఆ రాత్రితో తను అన్నీ పోగొట్టుకున్నాననే భావాన్ని వదలిపెట్టి పాత పొగరునే కొనసాగించి మనగలిగితే వర ప్రసాదరావు హేమప్రదను పెళ్ళి చేసుకోవడంకోసం తపించి ఉండేవాడు.

ఒకే ఒక్క రాత్రితో ఏ ఆడదీ పనికిరానిదై పోదు. అర్ధంలేని ఆ నీతిని వదిలిపెట్టేవరకూ హేమప్రదకే కాదు, ఏ ఆడదానికీ మోక్షముండదు. □

లక్షమంది బిక్షగాళ్ళు!!

అసెంబ్లీలో ఒకసారి-'తమ తమ నియోజక వర్గాలలో ఎంతెంతమంది బిచ్చగాళ్ళున్నారో చెప్ప'మని స్పీకర్ ప్రశ్నించాడు.

ఒక మంత్రిగారు లేచి "ఐదువందలు" అన్నారు. ఇంకో ఆయన "నూటముప్పై" అన్నారు. ఇలా ఒక్కొక్కళ్ళు చెబుతూ వస్తున్నారు. నిద్రపోతున్న ఓ ఎమ్మెల్యేగారు తన వంతు వచ్చేసరికి, అవేవో గ్రాంటులు కాబోలు ననుకొని "లక్ష" అన్నాడు.

స్పీకరుకు అనుమానం వచ్చింది. "మీ నియోజక వర్గ జనాభా ఎంత?" అడిగాడు.

"నాతో కలిపి లక్షమంది" అన్నాడు ఆ ఎమ్మెల్యే.

—ఎమ్. మన్మోహన్, విజయవాడ-4.

తొలి పలకరింత

వి.ఎస్.చెన్నూరి



నా గదిలో టేబుల్ ముందు రివాల్వింగ్ ఛేర్ లో కూర్చుని క్రైం జర్నల్ తిరగేస్తున్నాను.

టేబుల్ మీది టెలిఫోన్ మెల్లగా మూలిగింది. రిసీవర్ని చేతిలోకి తీసుకుని "ఎస్!" అన్నాను.

"మీకోసం యెవరో వచ్చారు బాస్. మిమ్మల్ని అర్జం

టుగా కలుసుకోవాలంటున్నారు" అంది ఫోన్‌లో తియ్యటి గొంతుక.

"వెంటనే లోపలికి పంపించు!" రిసీవర్‌ని రెస్ట్‌మీద వుంచుతూ, ఎదురుగావున్న స్వింగ్‌డోర్ క్రిందుగా అవతలి గదిలోకి దృష్టి సారించాను.

తెల్లని షార్క్‌-స్కిన్ బెల్‌బాటం క్రింద నల్లని పాయింటెడ్ షూ, మిల మిల మెరుస్తోంది. స్వింగ్‌డోర్‌కి అవతలివైపు గదిలో నా కెదురుగానే ఉంటాయి విజిటర్స్ కూర్చునే కుర్చీలు. నేను మళ్ళీ క్రైం జర్నల్‌లో తల దూర్చాను.

అతడు స్వింగ్‌డోర్ తెరుచుకుని లోపలికి వచ్చాడు. తల పైకెత్తకుండానే "ప్లీజ్! టేక్ యువర్ సీట్!" అన్నాను.

నా కెదురుగా టేబుల్‌కి అవతలివేపు వున్న కుర్చీలో కూలబడ్డాడు. ఓ రకమైన 'మదపు వాసన' గుప్పుమంది. వాడిన 'క్లాస్ సెంటు'ని సైతం జయించి తన ప్రత్యేకతను నిలుపుకునే 'మత్తు' వాసన! కొందరి దేహ తత్వం అలాంటిది!

బుర్రలో కలుక్కుమంది. తక్షణం తల యెత్తి చూచాను.

అందమైన ముఖం, చిన్నచిన్న కళ్ళు, కొనతేలిన ముక్కు, లేత పెదాలు. పట్టుమని పాతికేళ్ళు గూడా వుండవు.

ఆ ముఖమూ, వాసనా యింతక్రితం పరిచయమైనవే. కాని యెక్కడో గుర్తుకి రావడంలేదు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం కనిపించడంలేదు. ఈ మధ్య బుర్ర చురుగ్గా పనిచెయ్యడంలేదు. వయసుమళ్ళే కొద్దీ చురుకు

తగ్గుతుంది కాబోలు.

నవ్వుని పెదాల కంటించుకుని "ఎస్ మై బోయ్. హౌ కెన్ ఐ హెల్ప్ యూ?" అన్నాను, చేతనున్న క్రైం జర్నల్ని టేబుల్ మీదికి విసురుతూ.

"నా పేరు అనిల్ కుమార్ బెనర్జీ! నేను కలకత్తాలోని నేషనల్ షిప్పింగ్ కార్పొరేషన్లో స్టెనోగా పని చేస్తున్నాను" అతడు గొంతు సవరించుకున్నాడు.

ప్రొద్దున చదివిన న్యూస్‌పేపర్లో చదివిన వార్త వెంటనే గుర్తుకొచ్చింది.

"ఇంద్రకుమార్ బెనర్జీ మీకేమవుతాడు....?" ప్రశ్నించాను.

కమ్చీతో కొట్టినట్టు వులిక్కిపడ్డాడు అనిల్‌కుమార్. వెంటనే జవాబు చెప్పలేదు.

నాకు నవ్వాగలేదు. బలవంతాన ఆపుకుంటూ "అతడు హత్య చెయ్యబడి యింకా యిరవై నాలుగ్గంటలు కాలేదు- మీ కీ వార్త యెప్పుడందింది? మీరెప్పుడొచ్చారిక్కడికి?" అని ప్రశ్నించాను.

"నే నిక్కడ యీ వుదయమే దిగాను. నే నిక్కడ చేరుకున్న తరువాతే నాకు చిన్నాన్న హత్య చెయ్యబడ్డారని తెలిసింది," అన్నాడు అనిల్‌కుమార్, అతి ప్రయత్నం మీద.

"అయితే హత్య చెయ్యబడ్డ ఇంద్రకుమార్ బెనర్జీ మీకు చిన్నాన్న అవుతాడన్నమాట" తమాషాగా నవ్వుతూ అతని ముఖంలోకి చూశాను.

అతడు అవునన్నట్టు తలూపాడు.

"పోలీసులు సరితా బెనర్జీని అనుమానించి అరెస్టుచేశారని విన్నాను. ఆమె మీ చెల్లెలా?"

"అవును. ఇప్పుడే జామీనుమీద విడిపించి ఇక్కడికి వచ్చాను. ఆమె ఏ పాపం ఎరుగదు. మీరే ఆమెను రక్షించాలి. మీరు ఆమె తరపున పనిచెయ్యాలి. ఫీజు ఎంతయినా సరే చెల్లించడానికి సిద్ధంగా వున్నాము" అన్నాడు అనిల్ కుమార్.

"నే నీ కేసు విషయమై స్టడీ చెయ్యందే ఏమీ చెప్ప లేను. రేపోసారి కలుసుకోండి। ఏ విషయం చెబుతాను" అన్నాను.

"పోలీసులు ఆమెను అనవసరంగా యిబ్బంది పెడుతున్నారు. డాక్టర్ రిపోర్టు ప్రకారం హత్య నిన్నటిరాత్రి 8-9 గం॥ల మధ్య జరిగివుండాలని నిర్ణయింపబడింది. ఆ సమయంలో సరిత మరోచోట వున్నట్టు బలమైన 'ఎలిబీ' వుంది. అందుకు సాక్షులు సామాన్య వ్యక్తులు కారు."

"ఎవరు వారు....?" ప్రశ్నార్థకంగా అతనికేసి చూశాను.

అనిల్‌కుమార్ గొంతుక సవరించుకున్నాడు. "వారిలో మీరు కూడా వున్నారు. రాత్రి 7-30 గం॥ల నుండి 9-30 గం॥ల వరకు ఆమె మీ పక్కనే వుంది. మీ పరిసరాల్లోనే మసలుతూ వుంది."

ఒక్కక్షణం నివ్వెరపోయి తెల్లముఖం పెట్టాను.

నా తెలివితేటల్ని వుపయోగించి అవతలి వ్యక్తిని తికమక పెట్టాలని ప్రయత్నించే నేనే తికమక పడాలిసి వచ్చింది.

"ఆమెతో మీకు పరిచయంలేదు. ఆమె పేరేమిటో మీకు తెలీదు. అందుచేత ఆమె నా సిస్టరేనన్న విషయం మీరు గుర్తించి వుండకపోవచ్చు" అంటూ అతడు తన ప్యాంటు జేబులోంచి ఓ కవరు తీసి అందులోంచి ఓ కార్డు

సైజు ఫోటో తీసి నా కందించాడు.

ఫొటో అందుకుని పరిశీలనగా చూశాను తక్షణం బుర్రలో ఫ్లాష్‌బల్బు వెలిగింది. రాత్రి విందులో పక్కనే డ్రెస్ గ్యాలరీలో అప్సరసలాంటి అమ్మాయిబొమ్మ కళ్ళ ముందు ప్రత్యక్షమైంది. మరుక్షణం ముక్కుపుటాల్ని ఎగరగొట్టే మదపు వాసనకూడా!—

నా ముఖం ట్యూబులైట్‌లా వెలిగింది. పెదవులమీంచి చిరునవ్వు తొంగిచూసింది.

మెల్లగా తల పంకిస్తూ "డోన్‌టువర్రీ మై బోయ్! మీ చెల్లాయికి అంత బలమైన ఎలిబీ వున్నప్పుడు పోలీసులు కాదు, వాళ్ళని పుట్టించిన బ్రహ్మదేవుడు సైతం ఆమెను యేమీ చెయ్యలేడు. నే నో మాటు మీ చెల్లాయిని కలుసుకోవాలి! ఆమె అడ్రసు యిచ్చి వెళ్ళండి!" అన్నాను.

అనిల్‌కుమార్ ఆమె అడ్రసు రాసిచ్చి, నా దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపొయ్యాడు.

అతడు వెళ్ళిన అయిదు నిమిషాలదాకా ఆలోచిస్తూ కూచుండిపొయ్యాను.

2

నా 'టొయాటో' కారు తిన్నగావెళ్ళి క్రైంబ్రాంచ్ ఆఫీసుముందు ఆగింది. నేను 'టొయాటో' లోంచి క్రిందికి దిగగానే ఎదురొచ్చాడు క్రైంబ్రాంచి ఇన్‌స్పెక్టర్ వీరేంద్రనాథ్, "హలో సార్! రండి. రండి!" అని ఆహ్వానిస్తూ.

ఇద్దరం ఆఫీసు గదిలోకి చేరుకున్నాం.

"బహుకాల దర్శనం! ఏదేనా పనిమీద వచ్చారా?" నాకు కుర్చీ చూపుతూ ప్రశ్నించాడు.

నేను కుర్చీలో కూలబడి అతనికేసి చూచి చిన్నగా నవ్వాను.

"కొంపదీసి మీరు సరితాబెనర్జీ తరఫున పనిచెయ్యడం లేదుగదా!" మళ్ళీ అతడే ప్రశ్నించాడు.

లేదన్నట్టు తల అడ్డంగా వూపి, "ఆమె అన్నయ్య అనిల్‌కుమార్ బెనర్జీ నన్ను కలుసుకున్నాడు. నేనీ కేసు విషయమై స్టడీ చెయ్యందే ఏమీ చెప్పలేనన్నాను" అంటూ అతనికేసి చూశాను.

"మంచిపని చేశారు. లేకుంటే అనవసరంగా ఇరుకున పడిపొయ్యేవారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ వీరేంద్రనాధ్.

"అయితే ఇంద్రకుమార్ బెనర్జీని హత్యచేసింది సరితా బెనర్జీయేనని మీకు సరియైన ఋజువులున్నాయా?"

"ఉన్నాయి."

"ఏమిటవి?"

"చెబుతా వినండి!" వీరేంద్రనాధ్ కుర్చీకి జారగిలబడి, పాకెట్‌లోంచి సిగరెట్టు తీసుకుని నాకొకటి ఆఫర్‌చేసి లైటర్‌తో సిగరెట్టు వెలిగించుకుని, దమ్ముపీల్చి గాల్లోకి వదలి చెప్పడం ప్రారంభించాడు:—

"నిన్నటిరాత్రి తొమ్మిదిగంటల ఇరవై నిమిషాలకి ఇంద్రకుమార్ బెనర్జీ వంటమనిషి నాయర్, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కి ఫోన్‌చేసి బెనర్జీ హత్యచెయ్యబడ్డాడన్న వార్తని తెలియపరిచాడు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మదనగోపాల్ వెంటనే తన మందీ మార్బలాన్ని వెంటబెట్టుకుని హత్యాప్రదేశానికి బయలుదేరుతూ, నాకు ఫోన్ చేసి నన్ను ఇంద్రకుమార్ బెనర్జీ ఇంటివద్ద కలుసుకోమని ఇంటి అడ్రసు యిచ్చాడు. నేను మరో ముఖ్యమైన కేసు తాలూకు రిపోర్టు తయారుచేస్తూ వుండడం మూలాన వెంటనే బయలుదేరి వెళ్ళలేకపోయాను.

"నేను హత్యాప్రదేశం చేరుకునేసరికి పదిన్నర

దాటింది. మదనగోపాల్ అప్పటికే తన తతంగమంతా పూర్తిచేసుకుని నాయర్‌వద్ద స్టేట్‌మెంటు తీసుకుంటున్నాడు.

"నాయర్ స్టేట్‌మెంటు ప్రకారం జరిగిందిది" వీరేంద్రనాథ్ చేతనున్న సిగరెట్టు పీకని అష్‌ట్రేలో నొక్కుతూ మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు.

"నిన్నటిరాత్రి ఏడున్నరకల్లా తన యజమానికి భోజనం వడ్డించి, ఆయన భోజనంచేశాక వంటగదిలో సామాన్లూ అవీ సర్ది, మరునటిరోజు వంటకాలకు తక్కువబడిన వస్తువులు కొనుక్కుని రావడానికి బజారుకి బయలుదేరాడు నాయర్. అతడు బజారునుండి తిరిగిరావడానికి కాస్త ఆలస్యమైంది.

"అతడు తిరిగి ఇల్లు చేరుకునేదాకా గుమ్మం ముందు దీపం వెలిగించి లాన్‌లో పచార్లుచేస్తూ గడపడం ఇంద్రకుమార్‌బెనర్జీకి అలవాటు. ఆరోజు ఇంటిముందు దీపం వెలగడంలేదు. రోడ్డు మలుపు తిరగ్గానే ఆ విషయం గమనించిన నాయర్ కంగారుగా పురుకులతో, పరుగులతో ఇల్లు చేరుకున్నాడు.

"అతడు గుమ్మం ముందుకి చేరుకోగానే ఎవరో గేటు తలుపు తెరుచుకుని కంగారు కంగారుగా బైటికిరావడం కనిపించింది. వెంటనే నాయర్ ముందుకివెళ్ళి "ఎవరువారు?" అని ప్రశ్నించాడు.

అవతలివ్యక్తి ఖంగుతిన్నా వెంటనే సర్దుకుని, "నేను నాయర్, సరితను!" అంది తన కంగారుని బైటపడనీకుండా.

"సరితమ్మగారా?" నాయర్ తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు. "అప్పుడే వెళ్ళిపోతున్నారా?" అని ప్రశ్నించాడు.

నాకు నవ్వాగలేదు. బలవంతాన ఆపుకుని "మిస్టర్ వీరేంద్రనాథ్ మనం చేస్తున్నది నేరపరిశోధన! ఊహాగానం కాదు! దర్యాప్తు మీద నిజానిజాలు తెలుసుకోవాలి. కేసుకి సంబంధించిన వివరాలన్నీ సేకరించందే ఏ నిర్ణయానికీ రాలేం" అన్నాను.

"అలాగేసార్, నేను వెంటనేవెళ్ళి బెనర్జీగారి ఇంట పనిచేసే నౌకర్లందర్నీ కలుసుకుంటాను. నాయర్‌గాడి రహస్యమేమిటో పైటికి లాగుతాను" అన్నాడు వీరేంద్రనాథ్.

"దట్సాల్‌రైట్! నేను మళ్ళీ కలుస్తాను" అంటూ కుర్చీలోంచి లేచాను.

క్రైంబ్రాంచి ఇన్‌స్పెక్టర్ నన్ను నా కారుదాకా సాగనంపి, నా కారు కదిలిందాకా అక్కడే నిల్చున్నాడు.

'టొయోటో' ముందుకి కదిలింది.

3

టేబుల్‌మీద కాలింగ్ బజ్జర్ నొక్కాను. స్వింగ్‌డోర్ తెరుచుకుని ప్యూన్ లోపలికి వచ్చాడు.

"సెక్రెటరీ ఏంచేస్తోంది?" ప్రశ్నించాను.

"ఖాళీగానే వున్నారుసార్. ఏదో పత్రిక తిరగేస్తూన్నారు" అన్నాడు.

"అయితే, నేనోమాటు రమ్మన్నానని చెప్పు!"

"అలాగేసార్" ప్యూను వెళ్ళిపొయ్యాడు.

మరునిమిషం సుందరి లోపలికి ప్రవేశించింది "ఎస్ బాస్" అంటూ, ఎడంచేతిలో నోట్‌బుక్కూ కుడిచేతిలో పెన్సిలుతో.

"నిన్న మనం కలకత్తా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కి

ఫోన్ చేశాం గుర్తుందా?"

"అవును బాస్"

"వాళ్ళ దగ్గర్నుండి యింకా జవాబు రాలేదు కదూ?"

"లేదు బాస్."

"డిప్టీ కమీషనర్ దివాకర్ భాత్రే స్వయంగా దర్యాప్తు చేసి, మనమడిగిన భోగట్టా సర్వస్వం యీ సాయింత్రం లోగా తెలియపరుస్తానన్నాడు. నేను అర్జంటుగా బైటికి వెళుతున్నాను. నేనొచ్చేలోగా అక్కడ్నించి ఫోనొస్తే వివరాలన్నీ క్షుణ్ణంగా నోట్ చేసుకుని, రెండు కాపీలు టైప్ చేసి వుంచు."

"ఓకే బాస్" సుందరి వెళ్ళిపోయింది.

నేను ఆఫీసు గదిలోంచి బైటపడి తిన్నగా కారు గ్యారేజ్ వద్దకి చేరుకున్నాను.

ఆలివ్ గ్రీన్ 'టొయాటో' అందమైన ఆడపిల్లలా శుభ్రంగా తయారై, రోడ్డుమీది కురకడానికి సిద్ధంగా వుంది. నన్ను చూడగానే డ్రైవర్ బాక్ సీటు తలుపు తెరిచి పట్టుకున్నాడు.

"రాయపేట వుడ్ లాండ్స్ కేసి పోనీ" అంటూ లోపలికి వెళ్ళి కూచున్నాను.

ప్రియుడికోసం వురకలుతీసే కొత్త పెళ్ళికూతుర్లా మద్రాసు తారురోడ్డుమీద వురుకుతోంది మా 'టొయాటో'. పావుగంటలో రాయపేట చేరుకుని వుడ్ లాండ్స్ లోని పదహారో నంబర్ కాటేజ్ ముందు ఆగింది.

నేను కారుదిగి కాటేజ్ మెట్లెక్కి గుమ్మంముందు ఆగాను. తలుపుని మెల్లగా ముందుకి తోశాను. లోపల గడియపెట్టి వుండడం మూలాన తలుపు తెరుచుకోలేదు. వెంటనే గుమ్మం పక్కనేవున్న 'కాలింగ్ బజ్జర్' బటన్

నొక్కాను.

అరనిమిషం తరువాత తలుపు తెరుచుకుంది.

కమ్మని ఈవినింగ్ ఇన్‌పారిస్ సెంటువాసన! వైలెట్ కలర్ బట్టల్లో బంగారు ప్రతిమలా మెరిసే కమనీయ రూపం. సరితాబెనర్జీ బిక్కమొహం పెట్టి నాకేసేచూస్తూ ఎవరికోసం అన్నట్టు ఎదురుగా ప్రత్యక్షమైంది!—

నా పెదాలమీద చిరుహాసం లాస్యం చేసింది.

ఆమె ఏదో అడగబోయింది.

"హల్లో! కృష్ణమూర్తిగారూ! ఇప్పుడేనారాక?" అనిల్ కుమార్ బెనర్జీ నా వెనకనుండి గుమ్మంవద్దకి చేరుకున్నాడు. "అదేమిటి సరితా? వార్ని గుర్తుపట్టలేదా? లాయర్ కృష్ణమూర్తిగారు. నిన్న విందులో...."

"అవునవును. పరిచయమైన ముఖం! అదే ఎక్కడ చూచానో వెంటనే గుర్తుకి రాలేదు" సరితాబెనర్జీ నవ్వింది.

"పదండిసార్! లోపలికి నడవండి!" నన్ను దాటకుని ముందుకి అడుగువేశాడు అనిల్‌కుమార్.

'గుప్పు'మని ముక్కుపుటాల్ని ఎగరగొట్టింది మదపు వాసన!

ఊపిరి బిగబట్టి అడుగు ముందుకివేశాను.

"కూచోండి సార్" అనిల్‌కుమార్ కుర్చీ చూపాడు. నేను కూర్చున్న తరువాత సోఫాలో నాకెదురుగా కూచున్నాడు.

సరితాబెనర్జీ తిన్నగావచ్చి తన అన్నయ్య ప్రక్కన కూలబడింది.

ఒక్కసారి తలెత్తి ఆ యిద్దరికేసే తదేకంగా చూశాను. ఇద్దరిదీ ఒక్కటే పోలిక. అచ్చుగుద్దినట్టున్నారు. ఇద్దరూ ఆడపిల్లలే అయితే ఎవరు ఎవరో తెలుసుకోవడం చాలా

కష్టం!—

"మిస్ సరితాబెనర్జీ! హత్యజరిగిన రాత్రి మిమ్మల్ని హత్యాప్రదేశంలో చూచినట్టు నాయర్ అబద్ధమాడు తున్నాడు. అతడలా అబద్ధమాడడానికి కారణమేమిటో మీరు వూహించగలరా?" ఆమె ముఖంలోకి చూస్తూ ప్రశ్నించాను.

"హత్యచేసినవాడెవడూ తాను హత్యచేసినట్టు వొప్పు కోడు. తననేరాన్ని ఎవరి నెత్తినో రుద్దడానికి ప్రయత్ని స్తాడు. చిన్నాన్న మరణానంతరం అతని ఆస్తికి హక్కు దారులం మేమే గనక హత్యానేరం మా యిద్దరిలో ఒకరి నెత్తిన రుద్దితే నిజమేనని అందరూ నమ్ముతారు. అన్నయ్య ఎలాగూ ఇక్కడలేడు గనక ఆ నేరాన్ని నా నెత్తిన రుద్దాడు" అంది సరితాబెనర్జీ.

"అయితే హంతకుడు నాయరే నంటారా?"

"అతను కాకపోతే నేరం నామీదకు రుద్దవలసిన అవసరం అతనికేమిటి?"

"మీ చిన్నాన్నను హత్యచెయ్యడంవల్ల అతనికి ఒరిగే దేమిటి?"

"చిన్నాన్న హత్యవల్ల అతనికి లాభం లేకపోవచ్చు. కాని కక్ష తీరుతుంది."

"ఏమిటా కక్ష?"

"నెలరోజుల క్రితంవరకూ నాయర్ భార్య కల్యాణి కూడా ఆ ఇంట్లోనేవుండేది. కల్యాణి వన్నెల విసనకర్ర. ఆ యింటికి తనే యజమాని అయినట్టు నౌకర్లందరి మీదా పెత్తనం చెలాయించేది. చిన్నాన్నకూడా చూస్తూ వూరుకునే వాడు. పిన్నమ్మ పోయింతరువాత చిన్నాన్నకూ దానికీ అక్రమ సంబంధం వుండేమోనని అందరూ అనుకునేవాళ్ళు.



"నెలరోజులక్రితం ఓనాడు అదీ చిన్నాన్నా ఒక గదిలో వుండడం నాయర్ స్వయంగా చూశాడట. ఎంతయినా మగాడు. తన భార్య మరో పురుషుడితో కులుకుతోందంటే చూస్తూ వూరుకోగలడా? వెంటనే దాన్ని తన్ని ఇంట్లోంచి తరుమగొట్టాడు. తన భార్యను లోబరచుకున్నాడన్న కసి కొద్దీ నాయర్ చిన్నాన్నమీద కక్ష పెంచుకుని వుండొచ్చుగా!" అంది సరితాబెనర్జీ.

నేను సాలోచనగా తల పంకించాను. ఈ కేసు విషయమై మరికొన్ని విషయాలు తెలిసినందుకు తృప్తిగా వుంది. వెంటనే పక్కకి తిరిగి అనిల్‌కుమార్ కేసి చూస్తూ "మీరు హత్యజరిగిన రాత్రి ఎక్కడున్నారు?" అని ప్రశ్నించాను.

"రైల్లో ప్రయాణంచేస్తున్నాను" అన్నాడు అనిల్ కుమార్.

"దట్సాల్‌రైట్! మనం మళ్ళీ కలుసుకుందాం"

అంటూ కుర్చీలోంచి లేచి పైటకి నడిచాను.

4

సుందరి అందించిన టైప్డ్ షీటర్ ఒక్కసారి తిరగే శాను. డిప్టీకమీషనర్ దివాకర్ ఖాత్రే శద్ధతీసుకుని స్వయంగా దర్యాప్తుచేసి పంపించిన భోగట్టా చాలా అమూల్యమైంది.

అంతలో బయట బూట్లచప్పుడు వినిపించింది.

ఇనుపలాడాలు కొట్టిన బూట్ల మెటాలిక్ సౌండ్—అడుగుల 'రిథమ్' నాకు పరిచయమైనదే. అంటే క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరేంద్రనాథ్ తనే వస్తున్నాడన్న మాట! అనుకుంటుండగనే వీరేంద్రనాథ్ డోర్ తెరుచుకుని లోపల అడుగుపెట్టాడు.

"హల్లో మిస్టర్ వీరేంద్రనాథ్! రండి! కూచోండి!"

ఇన్‌స్పెక్టర్ కుర్చీలో కూచున్న తరువాత ప్రశ్నించాను. "ఎంతవరకు వచ్చింది మీ పరిశోధన?" అని.

"మా పరిశోధన పూర్తయినట్టే. బెనర్జీగారి ఇంట పని చేసే నౌకర్లని కలుసుకుని దర్యాప్తు చేశాను. మీ రూహిం చింది కరెక్టే అయింది. నాయర్ భార్య కల్యాణికీ బెనర్జీ గారికీ అక్రమ సంబంధం వుండేదనీ, ఓరోజు ఆ యిద్దరూ నాయర్‌కంట బడ్డారనీ, నాయర్ తన భార్యని తరుమగొట్టి బెనర్జీగారిమీద కక్షకట్టాడనీ తేలింది" అన్నాడు.

"అయితే నాయరే ఇంద్రకుమార్ బెనర్జీని హత్యచేసి తనే నేరాన్ని సరితాబెనర్జీమీదికి తోశాడంటారు-అంతేనా?"

"అవును, సందేహంలేదు. నాయర్‌ని బొక్కలో తోసి మరీ వస్తున్నాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్, సగర్వంగా.

ఇన్‌స్పెక్టర్ వీరేంద్రనాథ్‌కి కార్యదీక్ష; దక్షతా వున్నయ్. కాని తొందరపాటెక్కువ.

"మిస్టర్ వీరేంద్రనాథ్! నాయర్ తన భార్య కల్యాణిని

ఇంట్లోంచి తరుమగొట్టి ఎంతకాలమైంది?"

"దాదాపు నెలరోజులైంది."

"రాత్రిళ్ళు బెనర్జీగారితోబాటు ఆ యింట్లో నాయరుతప్ప మరెవరైనా వుండేవారా?"

"లేదు. నాయరొక్కడే బెనర్జీగారికి తోడుండేవాడు."

"నాయరు తనమీదకక్షకట్టాడని బెనర్జీగారికి తెలీదా?"

"ఎందుకు తెలీదూ? తెలిసే వుంటుంది."

"నాయరు తనమీద కక్షకట్టాడని తెలిసికూడా బెనర్జీగారు మరొకరిసాయం ఎందుకు తీసుకోలేదంటారు?—ఇందులో ఏదో రహస్యం దాగివుంది!—ఏమంటారు?" అన్నాను ఇన్‌స్పెక్టర్ ముఖంలోకి చూస్తూ.

ఇన్‌స్పెక్టర్ వీరేంద్రనాథ్ మాట్లాడలేదు. ఇబ్బందిగా ముఖంపెట్టాడు.

అంతలో టేబుల్‌మీది టెలిఫోన్ కిర్రుమంది. రిసీవర్‌ని చేతిలోకి తీసుకుని "ఎస్" అన్నాను.

"ఎవరో మీకోసం వొచ్చారు బాస్. అర్జంటుగా కలుసుకోవాలట" అంది సెక్రెటరీ.

"వెంటనే లోపలికి పంపించు!" రిసీవర్‌ని రెస్టుమీద వుంచి తలెత్తి స్వింగ్‌డోర్‌కేసి చూశాను.

ఎవరో స్త్రీ స్వింగ్‌డోర్ తెరుచుకుని లోపలికి వచ్చింది. ముప్ఫయ్-ముప్ఫయ్ అయిదేళ్ళ మధ్య వుంటుంది. అంత పొట్టీకాదు పొడవూకాదు. కోలముఖం, లావుపాటి పెదాలు, ఎత్తయిన వక్షోజాలు, పచ్చగా నున్నగా మెరుస్తోన్న శరీరం, తలస్నానంచేసి ఆరడానికని చివర్న రిబ్బన్‌తో ముడి వేసిన వెంట్రుకలు, మూర్తీభవించిన కేరళ సౌందర్యం!—

ఆమెను చూడగానే అర్థమైంది.

"మీ పేరు కల్యాణికదూ?" అన్నాను.

ఆమె ఆశ్చర్యానికి అంతులేదు "నన్ను....మీరిది వరకు...."

"కలుసుకోలేదు. కాని వూహించాను. కూచోండి!" అన్నాను చిన్నగా నవ్వుతూ.

ఆమె నా కెదురుగా ఓ కుర్చీలో కూలబడింది.

"చెప్పండి కల్యాణిగారూ! నాయర్ మీకేమవుతాడు?" అని ప్రశ్నించాను.

"నాయర్ నాకేమీకాడు. దూరపు బంధువు మాత్రమే. అసలు నాకు పెళ్ళేకాలేదు" అంది కల్యాణి.

"కాని అందరూ మిమ్మల్ని నాయర్ భార్య అనే అనుకుంటున్నారు"

"అవును. ఆ విషయం తెలియపరచడానికే నేనిక్కడికొచ్చాను. నా మూలకంగా నాయర్ బెనర్జీగారిని హత్యచేసి వుంటాడని అనుకోవడం పొరబాటు."

"విపులంగా చెబుతారా?" అని ప్రశ్నించాను కుర్చీలో సర్దుకుంటూ.

ఆమె చెప్పడం ప్రారంభించింది:

"నేను నా పదహారో ఏట స్కూలు ఫైనల్ చదువుతుండగా మా నాన్నగారు పొయ్యారు. ఆయన పోవడంతో మా బ్రతుకులు బైటపడ్డాయి. పూటగడవడమే కష్టమై పోయింది. స్కూలు మానేసి ఇంట్లోనే వుండవలసి వచ్చింది. మా అమ్మ ఆ యింటా ఈ ఇంటా వూడిగం చేస్తేనే మా డొక్కలు పూడేవి. అమ్మకు సాయంగా వుంటుందన్న వుద్దేశంతో నేనో బట్టలషాపులో సేల్స్ గరల్‌గా చేరాను.

"మా షాపు ప్రొప్రైటర్ దగ్గరికో యువకుడు వచ్చే

వాడు. విలువయిన బట్టలు తొడిగి ఎప్పుడూ హుషారుగా కనిపించేవాడు. నామీద జోకులు విసిరేవాడు. మెల్లగా నన్ను లోబరుచుకున్నాడు. తన కిక్కడ పెద్ద బిజినెస్ వుందనీ, తనతోపాటు వచ్చేస్తే నన్ను పెళ్ళిచేసుకుంటా ననీ, అష్టయిశ్వర్య భోగభాగ్యాలు అనుభవించొచ్చనీ మభ్య పెట్టి నన్ను తనతో యిక్కడికి తీసుకొచ్చాడు. ఆరు మాసాలపాటు అరిచేతిలో స్వర్గంచూపి అయిపులేకుండా మాయమయ్యాడు.

"కన్నుగానని దేశంలో, పొట్టగడిచేమార్గం తోచక ఓ తాయారమ్మ పంచన చేరవలసి వచ్చింది. తాయారమ్మవద్ద నాలాంటి యువతులే మరి ముగ్గురున్నారు. ఆమెమా అందరి మీదా వ్యాపారం సాగించేది. నాకా జీవితం కంటకప్రా యంగా వుండేది. కాని గత్యంతరం లేదు. రోజులు గడు స్తున్నయ్. రోజుకో కొత్త ప్రియుడు! రోజుకో సరికొత్త అనుభవం?

"ఒకనాడు ఓ నాయుడిగారితో గడపవలసి వచ్చింది. నాయుడిగారి వయసు నలభై దాటింది. కాని రసికత్వంలో నవయువకుడికి ఏమాత్రం తీసిపోడు. వేషంచూస్తే బాగా వున్నవాడిలా కనిపించాడు. వాలకంచూస్తే సహృదయుడిలా కనిపించాడు. అతడ్ని చూడగానే ఎందుకో నా హృదయం విప్పి చెప్పాలనిపించింది. నాయుడుగారు నా గోడంతా విని చిన్నగా నవ్వారు. 'నాతో వచ్చేస్తావా? నిన్ను పోషిస్తాను' అని అడిగారు. వరదలో కొట్టుకుపోయే మనిషికి గడ్డిపోచ వూతగా దొరికినట్టనిపించింది. 'అలాగే' అన్నాను. నాయుడుగారు తన మాట నిలబెట్టుకున్నారు.

"నాయుడిగారికి జార్జిటౌన్‌లో నాలుగిళ్ళున్నయ్. నన్ను ఓ యింట్లో రెండు గదుల పోర్షన్‌లో దింపి ఓ దాసీదాన్ని

సాయమిచ్చారు. నా పోషణ భారమంతా వారే భరించారు. నాకే లోటూ రాకుండా చూచుకునేవారు. దాదాపు పదేళ్ళ పాటు ఆయన పోషణలో హాయిగా గడిపేశాను.

"నాయుడిగారికి నలుగురు మగపిల్లలు. పెద్దవాళ్ళిద్దరికీ పెళ్ళిళ్లయిపోయినయ్. చిన్నవాళ్ళిద్దరూ చదువుకుంటూ వుండేవారు. భార్య చాలాకాలం క్రితమే చనిపోయిందట. నాయుడుగారు వారానికి రెండురోజులయినా నాతో గడిపేవారు. ఆయన చాలా సరదామనిషి. సినిమాలకీ షికార్లకీ వెంట తీసుకువెళ్ళేవారు. ఆయన పోషణలో వున్న పదేళ్ళూ పది నిమిషాల్లా గడిచిపోయినయ్.

"రెండేళ్ళక్రితం మళ్ళీ నాకు గడ్డురోజులు దాపురించాయి. నాయుడుగారు అకస్మాత్తుగా గుండెజబ్బొచ్చి చనిపొయ్యారు. కొడుకులు యావదాస్తినీ స్వాధీనం చేసుకుని నా పోర్షన్‌నికూడా ఖాళీచెయ్యమని వొత్తిడి చెయ్యసాగారు. నాయుడుగారు నా పేర బ్యాంకులో దాచిన పదివేలూ, ఆయన బ్రతికుండగా చేయించిపెట్టిన చిల్లరమల్లర నగలూ తప్ప నా పేర ఆస్తిపాస్తులంటూ ఏమీ లేవు.

"ఆ పరిస్థితిలో నాయరు నాకు తటస్తపడ్డాడు. నాయరు నాకు దూరపు బంధువే కాదు, మా వూరివాడుకూడా.

"నా స్థితిగతులన్నీ తెలుసుకున్న నాయరు ఒకనాడు బెనర్జీగారిని మా యింటికి తీసుకొచ్చాడు. నన్ను పరిచయం చేశాడు. బెనర్జీగారు నన్ను చూడగానే నన్ను తన పోషణలో వుంచుకోవడానికి యిష్టపడ్డారు. వెంటనే నేనాయిల్లు ఖాళీచేసి బెనర్జీగారిల్లు చేరాను.

"బెనర్జీగారి భార్యపోయి అప్పటికి పదేళ్లు దాటాయట. అతని అన్నకొడుకు అనిల్‌కుమార్, అన్నకూతురు సరితా అప్పుడప్పుడే రాకపోకలు సాగించడం మొదలుపెట్టారుట.

బెనర్జీగారు ఆ వయసులో నన్ను తన వుంపుడుగత్తెగా చెప్పుకోలేక పోయ్యారు. అందుచేత నేను నాయర్ భార్యగా చెలామణి కావలసివచ్చింది. ఈ రహస్యం నాకూ, బెనర్జీ గారికీ, నాయరుకీ తప్ప మరెవ్వరికీ తెలీదు

"ఎంత జాగ్రత్తపడ్డా యిలాంటి రహస్యాలు దాగవు. ఆ మధ్య బెనర్జీగారి ఇంట్లో పనిచేసే మిగతా నౌకర్లూ, ఇరుగుపొరుగు అమ్మలక్కలూ మమ్మల్నిచూచి గుసగుస లాడుకోవడం మొదలెట్టారు. ఈ గుసగుసలు భరించలేక బెనర్జీగారు మింట్‌స్ట్రీట్‌లోవున్న తన మిత్రుడి తాలూకు ఓ ఇంట్లో రెండు గదులు అద్దెకు తీసుకుని నన్నందులోకి మార్పించారు. ఇది జరిగి ఈ నాటికి సరిగా నెలరోజు లైంది."

కల్యాణి చెప్పడం ఆపి వ్యానిటీ బాగ్‌లోంచి కర్చీఫ్ తీసి ముఖంమీద ఏర్పడిన స్వేదబిందువుల్ని నాజూగ్గా అద్దు కుంది. "ఇప్పుడు మీకు బాగా అర్థమై వుంటుంది నాయరు నాకేమీ కాడనీ కేవలం ఓ దూరపు బంధువుమాత్రమే ననీను" అంది.

"అయితే నాయరుకి బెనర్జీగారిమీద కక్షపెంచుకోవ డానికిగానీ, వారిని హత్యచెయ్యడానికిగానీ ఆస్కారం లేదనేగా మీ వుద్దేశ్యం?" అన్నాను.

ఆమె అవునన్నట్టు తలూపింది.

నేను పక్కకి తిరిగి క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరేంద్ర నాథ్‌కేసి చూశాను.

పాపం, అతని ముఖం పాలిపోయింది. అతని అంచనా యిలా తారుమారవుతుందని అతడు వూహించలేక పోయ్యాడు.

నేను చిన్నగా నవ్వుతూ, "మిస్టర్ వీరేంద్రనాథ్,

మీరు యీ కేసుకి సంబంధించిన వ్యక్తులందర్నీ కలుసుకోండి. రేపు సాయంత్రం ఐదింటికి అందరూ మీ ఆఫీసు హాల్లో హాజరయ్యేలా చూడండి! నేనూ వస్తాను. ఈ కేసు అంతేమిటో తేల్చేసుకుందాం" అన్నాను.

"అలాగే సార్! తప్పకుండా!" అన్నాడు కొండంత ధైర్యంతో.

నేను పక్కకి తిరిగి "మీరుకూడా రేపు క్రైంబ్రాంచ్ ఆఫీసులో సరిగ్గా ఐదింటికి హాజరుకావాలి!" అన్నాను కల్యాణిని వుద్దేశించి.

ఆమె అంగీకార సూచకంగా తలూపింది.

5

నా టొయాటో కారు క్రైంబ్రాంచ్ ఆఫీసుముందు ఆగేసరికి గం. 5-15 లయింది. నేను కావాలనే పదిహేను నిమిషాలు ఆలస్యంగా వెళ్ళాను.

నాకోసం అందరూ ఎదురు చూస్తున్నారు. నేను టొయాటో లోంచి బైటపడి, నాతోపాటు వచ్చిన నా మేనకోడలు సునీతను వెంటపెట్టుకుని, హాల్లోకి ప్రవేశించాను.

సునీత హాల్లోకి అడుగుపెట్టగానే సరితా బెనర్జీ "హల్లో సునీతా! ఎప్పుడొచ్చావ్ అమెరికానుండి?" అంటూ ఆత్రంగా ఎదురొచ్చి, ఆమె చేతుల్ని అందిపుచ్చుకుంది. సునీత నవ్వుతూ నావైపుకి తిరిగి నాకేసి చూసింది.

"సునీత అమెరికానుండి వచ్చింతరువాత మీరామెను కలుసుకోవడం యిదేనా మొదటిసారి?" అని ప్రశ్నించాను సరితా బెనర్జీని.

ఆమె అవునన్నట్టు తలూపింది.

"అయితే నేషనల్ న్యూస్ ప్రొప్రైటర్ హరిప్రసాద్

గోయంకాగారిచ్చిన విందులో మీరుకూడా పాల్గొన్నట్టు ఎందుకు అబద్ధమాడారు?" అని ప్రశ్నించాను.

నా ప్రశ్న ఆమెకు అర్ధంకాలేదేమో బిక్కమొహంవేసి నిల్చుంది. వెంటనే అనిల్‌కుమార్ అక్కడికి చేరుకున్నాడు ఆమెకు సాయం చెయ్యాలన్న వుద్దేశ్యంతో.

వెంటనే నేను కల్పించుని "లాభంలేదు మిస్టర్ అనిల్ కుమార్! నిజం బైటపడి పోయింతరువాత మీరెంత కప్పి పుచ్చాలన్నా ప్రయోజనముండదు" అన్నాను. అనిల్ కుమార్ ఆగిపొయ్యాడు.

"సునీత తన భర్తతోబాటు అమెరికానుండి తిరిగివచ్చి దాదాపు వారం రోజులైంది. ఆమె ఇల్లు చేరుకున్న మరునాడే గోయంకాగారిచ్చిన విందుకి హాజరైంది. మీ అన్నయ్య అనిల్‌కుమార్‌కి, మీకూ సునీతకూ వున్న స్నేహం సంగతి తెలీదు. అందుచేత మీ వేషంలో వున్న మీ అన్నయ్య ఆమె పలకరించినా పలకలేదు" అన్నాను.

"ఏమిటి?—అయితే గోయంకాగారిచ్చిన విందులో పాల్గొన్నది సరితాబెనర్జీ కాదన్నమాట?" ఇన్‌స్పెక్టర్ వీరేంద్రనాథ్ ప్రశ్నించాడు ఆశ్చర్యంగా.

"అవును! సరితాబెనర్జీకి "ఎలిబీ" సృష్టించడానికి ఆమె వేషంలో అనిల్‌కుమార్ విందులో పాల్గొన్నాడు. విందు జరిగే సమయంలో సరితాబెనర్జీ హత్యా ప్రదేశంలోనే వుంది!"

"అబద్ధం! ఆ సమయంలో నేనిక్కడ లేను! ట్రెయిన్‌లో ప్రయాణం చేస్తున్నాను!" కంగారుగా అరిచాడు అనిల్‌కుమార్.

"మిస్టర్ అనిల్‌కుమార్! మీరా సమయంలో రైలు ప్రయాణంలో వున్నట్టు ఋజువుపరచగలరా!"

"ఎలా? నేను ప్రయాణం చేసింది రిజర్వుడు కంపార్టు మెంటులోకూడా కాదు. నాకు సాక్ష్యమెవరు చెబుతారు?"

"హత్య జరగడానికి వారంరోజుల ముందే మీరు కలకత్తానుండి టూ టైర్ స్లీపర్ కోచ్‌లో ప్రయాణం చేసినట్టు కలకత్తా రైల్వేస్టేషన్‌లోని బెర్తు రిజర్వేషన్ చార్టు సాక్ష్యం చెబుతోంది. దీనికేమంటారు?" అని ప్రశ్నించాను.

పాపం, అనిల్‌కుమార్ మారుమాట్లాడకుండా బిక్క మొహం వేసి నిల్చున్నాడు.

"అన్నాచెల్లెళ్ళిద్దరూ తమ చిన్నాన్నను హత్యచేసి, ఆ ఆస్తిని కబళించడానికి పథకం వేశారు. బెనర్జీగారితోబాటు రాత్రిళ్లు ఇంట్లో నాయరుతప్ప మరెవ్వరూ వుండరుగనక, బెనర్జీగారిని సులభంగా హత్యచేసి ఆ నేరాన్ని నాయర్ మీదికి తొయ్యవచ్చనీ, నాయర్‌కి కారణంకూడా వుంది గనక తమ్మెవరూ అనుమానించరనీ అనుకున్నారు. హత్య చేసిన వ్యక్తికి బలమైన ఎలిబీకూడా సృష్టించగలిగితే తమ మీద ఈగకూడా వాలదనుకున్నారు.

"సరితాబెనర్జీ స్థానికంగా వున్న వ్యక్తిగనుక బెనర్జీని హత్యచెయ్యడం ఆమెకు చాలా సులభం. అందుచేత ఆ కార్యాన్ని సరితాబెనర్జీకి అప్పజెప్పి, ఆమెకు బలమైన ఎలిబీని సృష్టించే కార్యాన్ని అనిల్‌కుమార్ చేపట్టాడు. అన్నాచెల్లెళ్ళిద్దరూ కవలపిల్లలు కావడం మూలాన యీ పథకం జయప్రదమవుతుందని వీరి నమ్మకం!

"అనిల్‌కుమార్ నన్ను మొట్టమొదటిసారిగా కలుసుకున్నప్పుడు కొట్టిన దర్వాసనే, మినీ థియేటర్లో మాముందు కూర్చున్న సరితాబెనర్జీ నుండికూడా వెలువడేది. కాని నేను సరితాబెనర్జీని వుడ్‌లాండ్స్ హోటల్లో కలుసుకున్నప్పుడు ఆమెనుండి ఎలాంటి దుర్వాసన కొట్టలేదు. అందు

చేత విందులో పాల్గొన్న సరితాబెనర్జీ—అనిల్‌కుమార్ ఒక్కరే అయివుంటారన్న అనుమానం కలిగింది. అన్నా చెల్లెళ్ళిద్దర్నీ పరిశీలించి చూడగా రూపురేఖలు తేడా కనిపించ లేదు. దాంతో నా అనుమానం దృఢపడింది.

"వెంటనే కలకత్తాకి ట్రంక్‌కాల్ బుక్‌చేసి డిప్టీ కమీష నర్ ఆఫ్ పోలీస్‌ద్వారా అనిల్‌కుమార్ తాలూకు భోగట్టా సంపాయించాను. నా అనుమానం నిజమైంది!" అన్నాను.

సరితాబెనర్జీ, అనిల్‌కుమార్ ఇద్దరూ తలలు వంచారు. ఇన్‌స్పెక్టర్‌వీరేంద్రనాథ్ ఆ యిద్దరికీ బేడీలు తొడిగాడు. □

క్షవరం ?

త్రాగుడుతో పూర్తిగా ఆరోగ్యం చెడగొట్టుకున్న ఓ యువకునికి ఆపరేషన్ చేయాల్సి వచ్చింది.

డాక్టరు ఆ యువకునికి మత్తుమందు యిచ్చి, ఆప రేషనుకు సిద్ధమవుతుండగా, "డాక్టారూ, ఇక్కడ మంగలి ఎవడైనా దొరుకుతాడా," అని అడిగాడు యువకుని తండ్రి.

"ఎందుకు?" అర్థంకాక అడిగాడు డాక్టరు.

"వెధవ. అ హిప్పీ జుట్టూ వాడూను! చిరాకేస్తోంది. మత్తుమందు ప్రభావం నుంచి తేరుకునేలోగా క్షవరంకూడా చేయించేద్దామని....!!"

—పి. వి. ఎస్. ఎన్. రాజు, మోగల్లు.

ఎర్రరంగు

క్రిష్ణచైతన్య

ఆ రోజు ఆదివారం.

'లాల్‌బహద్దూర్ స్టేడియం' ప్రేక్షకులతో కిటకిటలాడి పోతుంది. వెస్టిండీస్‌కు, సౌత్ జోన్‌కు మధ్య జరుగుతున్న క్రికెట్ టెస్టు మ్యాచ్ ఆఖరు రోజు కావడంవలనా, అందునా, ఆదివారం కావడంవల్ల స్టేడియం కిటకిటలాడి పోతుంది.

భగవాన్ సిగరెట్ వెలిగించి, ఒక మూలగా నిలబడి

స్టేడియం అంతా కలయచూచాడు. దూరంగా ఎవరో కుర్రాడు ఆనందంతో పెద్దగా అరుస్తూ చేతులు వూపుతున్నాడు. పాతికేళ్ళుంటాయి అతనికి. ఎర్రగా సన్నగా వున్నాడు. కోల మొహం....అందంగానే వున్నాడు.

సిగరెట్ క్రిందపడేసి బూటుతో నలిపి చకచక ఆ కుర్రాడి వైపు కదిలాడు భగవాన్. భగవాన్ ఆ కుర్రాడి పక్కకు చేరగానే స్టేడియం అంతా పెద్దగా అరుపులతో, చప్పట్లతో మారుమ్రోగిపోయింది. భగవాన్ అదిరిపడి చూశాడు. 'పటేల్' సిక్సర్ కొట్టాడు. అదీ కలకలం. చిన్నగా నిట్టూర్చి, "స్కోరెంత?" అడిగాడు ఆ కుర్రాడ్ని.

ఆ కుర్రాడు తల తిప్పలేదు. "టూ ట్వంటీ ఫర్ టు" అన్నాడు వుత్సాహంగా.

భగవాన్ తల వూపి "మీ పేరు?" అడిగాడు.

"నవీన్" అంటూ భగవాన్ వైపు చూచి "మీ పేరు?" అడిగాడు.

"భగవాన్?" అని, "పటేల్ అదరగొట్టేస్తున్నాడు కదూ?" అడిగాడు.

అతను వుత్సాహంగా తల వూపి, "అవును. ఇప్పటికి ఆరు సిక్సర్స్ కొట్టాడు" అని క్షణం ఆగి, "ఐ లైక్ హిం వెరీమచ్!" అన్నాడు ఆనందంగా.

భగవాన్ నవ్వి వూరుకున్నాడు. నిజానికి అతనికి క్రికెట్ గురించి, పటేల్ గురించి పెద్దగా తెలియదు. అతనికి క్రికెట్ మ్యాచ్ అంటే అంత ఇష్టం కూడ లేదు. అయినా అతను అక్కడకు రావడానికి వేరే కారణం వుంది.

సాయంత్రం అయిదు గంటలయింది. టెస్టు డ్రా

అయింది. అందరూ ఉస్సూరుమంటూ బయలుదేరారు. భగవాన్ ఆ కుర్రాడి పక్కన నడుస్తూ అడిగాడు, "మీ రెక్కడికి వెళ్ళాలి?"

"మలక్ పేట. అక్కడ రూంలో వుంటున్నాను" చెప్పాడు నవీన్.

"అలాగా! నేనూ అటే వెళుతున్నాను. రండి, నా కారులో డ్రాప్ చేస్తాను" ఆహ్వానించాడు.

నవీన్ కాదనలేదు. కారు నెమ్మదిగా పోతోంది. "మీరేం చేస్తున్నారు?" అడిగాడు భగవాన్.

"బి. ఏ. ఫైనలియర్."

"మీవాళ్ళెవ్వరూ ఇక్కడ లేరా?"

"లేరు. మాది గోనుపల్లి. నేనొక్కడ్నే ఇక్కడ వుండి చదువుకుంటున్నాను" చెప్పాడు నవీన్.

భగవాన్ మాట్లాడలేదు. ఆలోచిస్తుండిపోయాడు.

కారు ఒకచోట ఆగింది. "రండి! ఇది కూడ మా ఇల్లే. కొద్దిగా కాఫీ తీసుకొని వెళదాం" ఆహ్వానించాడు భగవాన్.

"అబ్బే! ఇప్పుడెందుకండి!" మొహమాటపడ్డాడు నవీన్.

"ఫర్వాలేదు. కాఫీయేగా!" నవీన్ దిగి భగవాన్‌ను అనుసరించాడు.

చిన్న భవంతి. చుట్టూ అందమైన పూలతోట- కొత్తగా కట్టిందేమో, చాల ఆకర్షణీయంగా అందంగా వుంది.

ఇద్దరూ లోపలికి నడిచారు. నిశ్శబ్దంగా వుంది. ఎవరూ వున్నట్లు లేదు.

"ఇంట్లో ఎవ్వరూ లేరా?" అడిగాడు నవీన్ కుర్చీలో కూర్చుంటూ.

"మా అమ్మ వుంది" అని, "అమ్మా" అని కేక వేసాడు.

ముసలావిడ వచ్చింది బయటకు. డెభ్భై ఏళ్లుండవచ్చు. కళ్ళు సరిగ్గా కన్పించవేమో, చెయ్యి కళ్ళకెత్తిపట్టుకొని, "ఆ అబ్బాయి ఎవర్రా!" అడిగింది.

"నా స్నేహితుడులే. వెళ్ళి కాఫీ పట్రా!" అన్నాడు.

ఆవిడ తల వూపి లోపలి కెళ్ళింది.

"ఇప్పుడే వాస్తాను" అంటూ పక్క గదిలోకి వెళ్ళి రెండు నిముషాల్లో బట్టలు మార్చుకొని వచ్చాడు.

"రండి! మేడమీద నా గదిలోకి వెళదాం" అన్నాడు మేడపైకి దారితీస్తూ. గధిలోకి వెళ్ళాక ఇద్దరూ కబుర్లలో పడ్డారు. పది నిముషాలయినా కాఫీ రాలేదు.

"నే వెళ్తాను!" నవీన్ లేచాడు.

"ఉండండి ఇప్పుడే వస్తాను" అంటూ క్రిందకు వెళ్ళి రెండు కప్పుల్తో కాఫీ తెచ్చి ఒకటి నవీన్‌కు అందించి, మరొకటి తను తీసుకున్నాడు.

నవీన్ కాఫీ త్రాగి, కప్పు టేబిలుమీద పెట్టాడు. తలంతా తిరుగుతున్నట్లనిపించింది. ఏదో అనుమానం వచ్చింది. ఏదో అనబోయాడు. నోరు పెగల్లేదు. అలాగే కుప్పలా కూలిపోయాడు.

భగవాన్ చటుక్కున లేచివెళ్ళి తలుపులు మూసి గడియ పెట్టి సిగరెట్ వెల్గించి ఒక్కసారి పరీక్షగా చూచాడు నవీన్ వైపు.

అమాయకంగా వుంది నవీన్ మొహం. భగవాన్ చక చక నవీన్ దగ్గరకువెళ్ళి, బట్టలన్నీ విప్పేసాడు. పూర్తిగా దిగంబరంగా చేశాడు. లేచి నిలబడి ఒక్కసారి అతని వైపు పరీక్షగా చూచి, టేబులు సొరుగులోవున్న కత్తెర

అందుకొని, రెండు నిముషాల్లో తలంతా కత్తిరించాడు.

తృప్తిగా తలాడించి లేచి నిలబడి, తలుపు తెరిచి చూచాడు. క్రింద ఎవ్వరూ లేరు. నవీన్‌ను భుజం మీద వేసుకొని. బయటకు వచ్చి దూరంగా వున్న అవుట్‌హౌస్ లోకి వెళ్ళాడు. నవీన్ శరీరాన్ని అందులో పెట్టి తలుపు తాళం వేసాడు.

ఇప్పుడతని మొహంలో అదో రకమైన తృప్తి కన్పిస్తుంది.

2

"నా పేరు కాంతారావు. మీతో కాస్త పనుండి వచ్చాను."

డిటెక్టివ్ కిరీటి తల వూపి, "కూర్చోండి!" అని కుర్చీ చూపించి, కాంతారావు కూర్చున్నాక అడిగాడు. "విషయ మేమిటో విపులంగా చెప్పండి."

"మా అబ్బాయి నవీన్ ఇక్కడే యూనివర్సిటీకాలేజిలో బి. ఏ. చదువుతున్నాడు. అసలు మా స్వగ్రామం గోను పల్లి. కేవలం వాడి చదువు కోసమే వాడ్నిక్కడ వుంచాను...." అని క్షణం ఆగి, "వారం రోజులనుంచి మా అబ్బాయి కన్పించడం లేదు" అన్నాడు.

"పోలీస్ రిపోర్టు ఇవ్వకపోయారా?" అడిగాడు కిరీటి.

"అదీ అయింది. పోలీస్ రిపోర్టు ఇచ్చి మూడు రోజులయింది. ఇంతవరకు ఎలాంటి సమాచారమూ తెలియ లేదు. ఒక్కగా నొక్క కొడుకు. ఏమైపోయాడోనని బెంగగా వుంది."

"స్నేహితులందరితో కలిసి ఏదయినా ఊరు వెళ్ళాడేమో కనుక్కున్నారా?" అడిగాడు కిరీటి సిగరెట్ వెలిగిస్తూ.

"ఆ! అవన్నీ అయాయి. వారం రోజుల క్రిందట....

అంటే ఆదివారం సాయంత్రం నేను ఊరినుంచి వచ్చాను. గదికి వెళ్ళి చూస్తే లేడు. పక్కింటివాళ్ళను అడిగితే తెల్పింది.... క్రికెట్ మాచ్ చూడడానికి వెళ్ళాడని. సరే వస్తాడని, రాత్రి ఎనిమిది గంటలదాకా ఎదురు చూచాను. రాలేదు. ఇంటిగలవాళ్ల అబ్బాయిని తోడుతీసుకొని, అతని స్నేహితుల ఇళ్లకు వెళ్లాను. వాళ్లకు తెలియదన్నారు. అందర్నీ ఎంక్వయిరీచేసి, ఎక్కడికయేనా వెళ్ళాడేమోనని రెండు రోజులు చూచాను. అయినా రాలేదు. ఎందుకయినా మంచిదని పోలీస్‌రిపోర్టు కూడా ఇచ్చాను. అదీ ఫలితం లేకపోయింది. ఇప్పటికి వారం గడిచింది. అందుకే మీ దగ్గరకు వచ్చాను" చెప్పాడు కాంతారావు.

కిరీటి తల వూపి "మీ అబ్బాయి ఫోటో వుంటే ఇవ్వండి" అని, "పోనీ పేపర్లో వేయించకపోయారా?" అడిగాడు.

"వద్దు! మావూర్లో మాది సంపన్న కుటుంబం. పేరు

ప్రతిష్టలున్న కుటుంబం మాది. పేపర్లో ఇలాంటివి పడితే నన్ను హేళన చేసేవాళ్లు వుండవచ్చు. అదీగాక, వాడే దయినా అత్యవసరమైన పనిమీద ఎక్కడికయినా వెళ్ళి వుంటే ఇలాంటి ప్రకటన చూస్తే అగ్గిబుగ్గయిపోతాడు" చెప్పాడు కాంతారావు.

"ఆల్ రైట్! మీ అడ్రసు ఇచ్చి వెళ్ళండి. నేను దర్యాప్తు చేస్తాను."

కాంతారావు అడ్రసు వ్రాసిచ్చి, "మా అబ్బాయి గది లోనే వుంటున్నాను. ఏవయినా వివరాలు తెలిస్తే నాకు వెంటనే తెలియపర్చండి" అన్నాడు లేచి నిలబడుతూ.

కాంతారావు వెళ్ళిపోయాక ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసాడు కిరీటి.

3

ఇద్దరూ జీప్‌దిగి లోపలికి నడిచారు. అప్పటికే పార్కులో జనం గుమిగూడి వున్నారు. శవం దగ్గర నిల బడి కానిస్టేబుల్ అందర్నీ దూరంగా తరిమేస్తున్నాడు.

ఇద్దరూ శవం దగ్గరకు వెళ్ళారు. కానిస్టేబుల్ సెల్యూట్ చేసి పక్కకు తొలగి నిలబడ్డాడు.

కిరీటి మోకాళ్ళమీదకూర్చుని శవాన్ని పరీక్షగా చూచాడు. శవం నేలమీద వెల్లకిలా పడుంది. ఎక్కడా గాయం వున్నట్లు లేదు. బట్టలు తెల్లగానే వున్నాయి. తలంతా కత్తి రించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. హతుడి మొహంలో మాత్రం భయం, బాధ కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నాయి.

కిరీటి లేచి నిలబడి సార్జెంట్‌ను పిలిచి, కాంతారావు అడ్రసు ఇచ్చి పిలుచుకురమ్మని చెప్పాడు.

ఫోటోగ్రాఫర్లు, వేలిముద్రల నిపుణులు, పోలీస్ డాక్టరు వాళ్ళ పనులు చూసుకోసాగారు.

"శవాన్ని మొదటగా చూపిందెవరు?" కిరీటి అడిగాడు.

"కానిస్టేబుల్ చూచాడు. రాత్రి బీట్‌కు వెళ్లి తిరిగి వస్తూ పార్కులోపల గేటు దగ్గర ఎవరో పడివుండటం చూచాడట. ఎవరైనా తప్పతాగి పడుకున్నారేమో అనుకున్నాడట ముందు. కాని, రాత్రిపూట పార్కులో ఎవ్వర్నీ వుండనివ్వరనే విషయం గుర్తుకొచ్చి పరీక్షగా చూస్తే ప్రాణం ఉన్న సూచనలు కన్పించకపోవడంతో, వాచ్ మెన్ పిలిపించి తాళాలు తెరిచి నాకు ఫోన్ చేసాడు" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

పోలీస్ డాక్టర్ వచ్చాడు. "చాలా విచిత్రంగా వుంది. శరీరంలో ఎక్కడా గాయం లేదు. కనీసం విషప్రయోగం చేసినట్లుగాని, బలవంతం చేసినట్లుగాని లేదు. అతను చనిపోవడానికి కారణం ఇప్పుడేమీ చెప్పలేను. పోస్టుమార్టంలో గాని ఏ విషయం తెలియదు" అన్నాడు.

"పోసీ ఎప్పుడు చనిపోయి వుంటాడో చెప్పగలరా!" అడిగాడు కిరీటి.

డాక్టర్ తల వూపి, "రెండు రోజులయి వుండవచ్చు. రిగర్ మార్టిస్ బాగా ప్రబలింది" అన్నాడు.

కాంతారావు వచ్చాడు. వచ్చి శవాన్ని చూస్తూనే పెద్దగా అరిచి క్రింద కూలబడి పెద్దగా ఏడవసాగాడు. కిరీటి వారించలేదు. పుత్రశోకం తీర్చలేనిది. కాంతారావు ఏడ్చి ఏడ్చి బాగా అలసి అక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు.

నవీన్ శవాన్ని పోస్టుమార్టంకు తీసుకెళ్లారు. కాంతారావును జీపులో వేసుకొని, తనగదికి తీసుకు వచ్చాడు కిరీటి.

అర్ధగంట తర్వాత కళ్లు తెరిచాడు కాంతారావు. కళ్ళు తెరుస్తూనే మళ్ళీ పెద్దగా ఏడవసాగాడు.

కిరీటి మాట్లాడకుండా కాంతారావు వైపే చూస్తూండి పోయాడు.

చాలా సేపటి తర్వాత అడిగాడు కాంతారావు "కిరీటి గారూ! ఎలా జరిగిందీ ఘోరం? నా బిడ్డను ఎవరు చంపారు?"

"అదే ఇప్పుడు తెలుసుకోవలసింది. ఏదిఏమైనా మీ పుత్రశోకం తీర్చలేనిది. కాని ఆ హంతకుడ్ని మాత్రం తప్పకుండా పట్టి మీకప్పగిస్తాను" అన్నాడు కిరీటి.

కాంతారావు లేచి నిలబడ్డాడు ఉదాసీనంగా. "శవాన్ని ఎప్పుడు ఇస్తారు?" అడిగాడు ఎంతో నెమ్మదిగా.

"రెండు రోజులు పట్టవచ్చు. పోస్టుమార్టం కాగానే ఇస్తారు."

కాంతారావు మాట్లాడలేదు. కలలో నడిచేవాడిలా నెమ్మదిగా లేచి వెళ్లిపోయాడు.

కిరీటి నిట్టూర్చి కుర్చీలో కూర్చున్నాడు. నవీన్ హత్య విచిత్రంగానూ, వింతగానూ వుంది. అసలిది హత్యా? ఆత్మహత్యా? ఆత్మహత్య అయినా విషంతిన్న గుర్తో, ఉరివేసుకున్న గుర్తో ఏదో ఒకటి తెలిసేది డాక్టరుపరీక్షలో. కాని అలాంటిదేమీ లేదు. హత్య అయినా, ఎలాంటి గుర్తు లేకుండా ఎలా చంపగలిగారు? అతని జుట్టెందుకు కత్తిరించారు? కేసు చాలా మిస్టరీగా వుందనిపించింది కిరీటికి.

4

ముప్పై ఏళ్లుంటాయి శారదకు. చామనచాయ రంగులో పుష్టిగా ఏపుగా పెరిగిన శరీరం. గుండ్రటి మొహం. పెద్ద పెద్ద కళ్లు. రింగులు తిరిగి, పిరుదులు దాటే జడ.... అమోఘమైన అందం శారదది.

శారదకు పిల్లల్లేరు. భర్తపోయి ఆరేళ్ళయింది. వెనకా

ముందూ ఎవ్వరూ లేరు. భర్తద్వారా సంక్రమించిన ఒక ఇల్లు, కొద్దిపాటి డబ్బుతప్ప ఇతరత్రా ఆస్తి ఏమీలేదు. శారద పతివ్రత కాదు. అడపా దడపా ఎరవేసి, తన కోరిక తీర్చుకోవడం శారదకు అలవాటే.

ప్రస్తుతం ఒక సినిమాహాలు ఆవరణలో నిలబడి వుంది. ఆమె కళ్లు, తన వల్లోపడే వ్యక్తికోసం చూస్తున్నాయి. ఆమెకు తెలీదు....వెనకగా క్యాంటీన్ దగ్గర నిలబడి, భగవాన్ అనే వ్యక్తి తనవైపే చూస్తున్నాడని.

అర్ధగంట గడిచింది. సినిమా మొదలుపెట్టే వేళయింది. శారద నిట్టూర్చి రెండడుగులు ముందుకు వేసింది.

"టిక్కెట్ కావాలా?" భగవాన్ అడిగాడు.

శారద తలవూపి, "ఒకటి కాదు రెండు" అడిగింది.

"ఎవరయినా వచ్చారా?" అడిగాడు.

"రాలేదు. వస్తారేమో అని?" అంటూ పరీక్షగా చూసింది భగవాన్ వైపు. భగవాన్‌కు అర్థం అయ్యింది.

"రండి మా ఇంటికి వెళదాం" అన్నాడు బైటకు దారి తీస్తూ. శారద అనుసరించింది.

"మీ ఇంట్లోవాళ్లు లేరా?" అడిగింది దారిలో.

"నాకింకా పెళ్ళి కాలేదు. నేనూ మాఅమ్మ వుంటున్నాం. ఆవిడకు కళ్లు కన్పించవు. చెవులు విన్పించవు" చెప్పాడు.

శారదను మేడమీద గదిలో కూర్చోబెట్టి 'ఇప్పుడే వస్తాను' అంటూ క్రిందకు వెళ్లి రెండు కప్పుల్లో కాఫీ తెచ్చాడు.

"నేను త్వరగా వెళ్లాలి" అంది కాఫీ అందుకుంటూ.

"అలాగే! వీలయినంత త్వరలో పంపిస్తాగా!"

కాఫీ త్రాగాక, ఏదో మాట్లాడుతూనే మంచంమీద వాలిపోయింది.

భగవాన్ తలుపులు వేసి, చకచక శారద బట్టలన్నీ విప్పేశాడు. నగ్నంగా వున్న శారద శరీరం చూస్తుంటే ఎవ్వరికయినా వికారం పుడుతుంది. కాని, భగవాన్‌లో ఎలాంటి భావమూ కన్పించలేదు. కత్తెరతో జుట్టంతా కత్తిరించి, శారదను భుజంమీద వేసుకుని, ఔట్‌హౌస్ వైపు నడిచాడు.

5

"పోస్టుమార్టం రిపోర్టు ఇదిగో" కిరీటికి అందించాడు ఇన్‌స్పెక్టర్.

కిరీటి అంతా చదివి ఆశ్చర్యపోయాడు. "చాలా విచిత్రంగా వుందికదూ?" అడిగాడు.

"అవును. శరీరంలో ఎలాంటి గాయమూ లేదు. కేవలం భయంకరమైన మానసిక వ్యధవల్ల మెదడులో నరాలు చిట్లి మరణం సంభవించింది. అంటే హత్యవెనుక భయంకరమైన దృశ్యమో, వార్తో వుండి వుండాలి. అందువల్లే తీవ్రమైన మానసిక వ్యధకు గురై మరణించి వుంటాడు" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

కిరీటి తల అడ్డంగా వూపాడు. "ఒకవేళ అలా జరిగి వుంటే అస్తవ్యస్తంగా కత్తిరించబడిన అతని జుట్టు సంగతేమటి? అదెవరు కత్తిరించారు? ఎందుకు? ఈ విషయం తెల్సుకోవాలి మనం. అది తెల్సుకుంటేగానీ, ఈ కేసులో మిస్టరీ తేలదు"

ఇన్‌స్పెక్టర్ అవునన్నట్లు తలాడించాడు.

"ఆల్‌రైట్. నవీన్ గురించి ఏమైనా ఎంక్వయిరీ చేసారా?" అడిగాడు కిరీటి.

ఇన్‌స్పెక్టర్ తల వూపి, "నవీన్ ఆదివారం వుదయం లాల్‌బహదూర్‌స్టేడియంలోకి వెళ్ళడంవరకు తెల్సింది.

ఆ తర్వాత అతను ఎక్కడకు వెళ్ళిందీ, ఎవరితో వెళ్ళిందీ తెలియలేదు. స్టేడియంలో అతన్ని చూచినవాళ్లు అంటే తెల్సినవాళ్లు కూడా ఎవ్వరూ లేరు'' చెప్పాడు.

కిరీటి, ఇన్‌స్పెక్టర్‌తో కాస్సేపు మాట్లాడి గదికి వచ్చేశాడు. అతనికీ కేసులో ఎలా ప్రోసీడ్ కావాలో అర్థం కావటం లేదు. అప్పటికీ నవీన్ వుంటున్న గది దగ్గిరకు వెళ్లి వాకబు చేసాడు. పనికివచ్చే వివరాలేమీ లభించలేదు. అ రోజు సాయింత్రమే కాంతారావు ఊరికి వెళ్లిపోయాడు. వివరాలేమీ దొరకలేదు. కేసు ముందుకు నడవలేదు.

రెండు రోజులు గడిచిపోయాయి.

ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో సిగరెట్ వెల్గించి, పుస్తకం చదువుతూ కూర్చున్నాడు కిరీటి.

టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ అందుకున్నాడు.

ఇన్‌స్పెక్టర్ గొంతు విన్పించింది. ఇన్‌స్పెక్టర్ చెప్పిందంతా విని, టెలిఫోన్ పెట్టేసి, చకచక డ్రస్ చేసుకొని బయిటకు నడిచాడు.

టాంక్‌బండ్ దగ్గర కారాపి క్రిందకు దిగాడు. ఇన్‌స్పెక్టర్ ఎదురొచ్చాడు.

"రండి, శవాన్ని చూద్దురుగాని. నవీన్ హత్యలాంటిది గానే తోస్తుంది'' చెప్పాడు.

ఇద్దరూ శవం దగ్గరకు వెళ్ళారు. అప్పటికే వేలిముద్రల నిపుణులు, డాక్టరు వాళ్ల పనులు పూర్తి చేసుకొని లేచారు.

శవం దగ్గరగా కూర్చుని పరీక్షగా చూశాడు కిరీటి. వెల్లకిలా పడి వుంది స్త్రీ శవం. చీర అస్తవ్యస్తంగా వుంది జాకెట్టు లేదు. మనిషి అందమైనదే అయినా జుట్టు కత్తిరించడంవల్ల అసహ్యంగా వుంది.

"డాక్టర్! మానభంగం జరిగిన గుర్తులేమయినా ఉన్నాయా!" అడిగాడు కిరీటి.

డాక్టర్ తల వూపి, "అలాంటిదేమీ కన్పించడంలేదు. కాని నిశ్చయంగా చెప్పలేను" అన్నాడు.

"ఇన్‌స్పెక్టర్! ఈమె మానభంగం చెయ్యబడ్డ తర్వాతే హత్య చేయబడి ఉంటుందని నా అనుమానం. నా అనుమానానికి కారణం కేవలం జాకెట్టు లేకపోవటమే కాదు. చీర కట్టిన విధానం. ఈమెకు చీర పూర్తిగా విప్పేసి మళ్ళీ కట్టారు."

ఆశ్చర్యపోయాడు ఇన్‌సెక్టర్.

"అవును! అలా చూడండి. ఆమె కట్టుకున్న చీర ఎంబ్రాయిడరీ చేయబడింది. సాధారణంగా ఎంబ్రాయిడరీ చేసేటప్పుడు, కుచ్చెళ్ళ ప్రాంతంలో ఎంబ్రాయిడరీ చెయ్యరు. కాబట్టి ఆ ప్రాంతం ప్లెయిన్‌గానే మిగిలిపోయింది. శవానికి కట్టివున్న చీరను చూస్తే యెవరో పూర్తిగా విప్పి కట్టారని తెలుస్తుంది. ఎందుకంటే ఎంబ్రాయిడరీ చేసిన భాగం కుచ్చెళ్ళకు పోయింది. కుచ్చెళ్ళకు రావలసిన భాగం అంచులో మిగిలింది. కాబట్టి, యెవరో చీర విప్పేసి, త్వరగా మళ్ళీ కట్టి ఉండాలి.

అంతేకాదు, ఇంకో ముఖ్యవిషయంకూడా వుంది. ఈమెకు మళ్ళీ చీర కట్టింది స్త్రీ అయివుండదు. పురుషుడే అయివుండాలని నా అనుమానం. ఎందుకంటే, ఏ స్త్రీ కయినా ఎంబ్రాయిడరీచీర ఎలా కట్టుకోవాలో తెలిసి ఉంటుంది. కాబట్టి, ఈమెకు చీర కట్టింది స్త్రీకాదు. పురుషుడని చెప్పవచ్చు. అతనే హంతకుడుకూడా అయివుంటాడు" అన్నాడు కిరీటి.

ఇన్‌స్పెక్టర్ ఉత్సాహంగా తల ఊపి, "కరెక్ట్"



అన్నాడు.

"ముందు ఈమె పేరు, వివరాలు తెల్సుకొని, ఈమెను తెల్సినవాళ్ళెవరైనా ఉన్నారేమో వాకబు చెయ్యండి," అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ కానిస్టేబుల్స్‌కు పని పురమాయించి, "ఇదేదో పెద్ద మిస్టరీలా ఉంది!" అన్నాడు కిరీటితో.

"ఏమిటి?"

"జుట్టు కత్తిరించడం. మనకు దొరికిన రెండు శవాలకు యిలాగే వుంది. హత్యలుకూడా ఒకలాగే చెయ్యబడ్డట్లున్నాయి. ఈ జుట్టులో ఏం మిస్టరీ ఉందంటారు?" అని అడిగాడు.

కిరీటి మాట్లాడలేదు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఉన్నట్లుండి ఒక ఆలోచన వచ్చింది. "ఇన్‌స్పెక్టర్! నవీన్‌కు.... ఈమెకు ఏదైనా పరిచయం ఉందేమో తెల్సుకోండి!" అన్నాడు కారువైపు చూస్తూ.

6

మరుసటిరోజు సాయంత్రం కిరీటి వెళ్ళేసరికి ఇన్ స్పెక్టర్ కునికిపాట్లు పడుతున్నాడు.

"వివరాలేమైనా తెలిసాయా?" అడిగాడు కుర్చీలో కూర్చుంటూ.

"ఏం వివరాలో ఏమో? తలాతోకా లేకుండా ఉంది కేసు. రాత్రంతా నిద్రలేదు" అన్నాడు ఇన్ స్పెక్టర్ నీరసంగా.

"విషయం చెప్పండి!" అడిగాడు కిరీటి.

"అదే చెబుతున్నా! ఆవిడ పేరు శారద. వెనకా ముందూ ఎవ్వరూ లేరు. మలక్ పేటలో ఉంటుంది. అడపా దడపా వ్యభిచారం చేసినట్లు తెల్సింది. కాని, మా పరిశోధనలో, నవీన్ కు, శారదకు ఎలాంటి సంబంధంగాని, పరిచయంగాని ఉన్నట్లు తెలియలేదు. అయిదురోజుల క్రిందట సినిమాకని పక్కింటివాళ్ళతో చెప్పి వెళ్ళిందట. అంతే. మళ్ళీ రాలేదట. అవే వివరాలు....!" చెప్పాడు ఇన్ స్పెక్టర్.

"డాక్టర్ రిపోర్టు వచ్చిందా?" అడిగాడు కిరీటి.

టేబుల్ సొరుగులోంచి రిపోర్టుతీసి అందించాడు. "మీరన్నట్లు మానభంగం ఏమీ జరగలేదు. అయితే మరణం మాత్రం నవీన్ కు సంభవించినట్లే జరిగింది" చెప్పాడు.

కిరీటి రిపోర్టంతా చదివి తలూపాడు.

"ఈ హత్యలకు కారణం ఏమై వుంటుందంటారు?" అడిగాడు ఇనస్పెక్టర్.

కిరీటి నవ్వి, "ఏమో? వీళ్ళద్దరిమీద, హంతకుడికి ద్వేషం వుండివుండవచ్చు. లేదా హంతకుడు సరదాగా ఈ హత్యలుచేసి వుండవచ్చు. అన్నిటిని మించి హంతకుడు

పిచ్చివాడయి వుండవచ్చు. వీటిల్లో ఏదైనా కావచ్చు. ఏదైనా క్లూ దొరికితేగాని మనమొక అభిప్రాయానికి రాలేం!" అన్నాడు.

"అవునవును!" తలూపాడు ఇనస్పెక్టర్.

"ఇన్స్పెక్టర్! ఏది ఏమైనా, ఈ హత్యల్నిగురించి ఒక ప్రకటన విడుదలచేస్తే మంచిది. పురజనులను హెచ్చరిస్తూ, నగరంలో హంతకుడు తిరుగుతున్నాడనీ, తెలిసినవాళ్ళతో, బాగా పరిచయస్తులతో తప్ప, అపరిచితులతో ఎక్కడికి వంటరిగా వెళ్ళవద్దని ప్రకటించండి. అందువల్ల కొంతైనా ఫలితం కన్పించవచ్చు" అన్నాడు కిరీటి.

7

భగవాన్ పేపరు చదివి, చిన్నగా నవ్వి లేచి నిలబడ్డాడు. డ్రస్ మార్చుకొని బయటకునచ్చి, కారు రోడ్డుమీదకు ఎక్కించాడు.

సిగరెట్ వెల్గించి, చుట్టూ పరీక్షగా చూస్తూ నెమ్మదిగా కారు నడుపుతున్నాడు. పెద్దగా తెల్సినవాళ్ళెవ్వరూ కన్పించ లేదు.

కోఠీ దగ్గరకొచ్చి, కారాపి ఒక పక్కగా నిలబడ్డాడు. పది నిముషాలు గడిచాయి. దూరంగా నీరజ వస్తూ కన్పించింది.

"మామయ్యా! ఇక్కడున్నావేం?" నీరజే పలకరించింది.

భగవాన్ నవ్వి, 'ఊరికే!' అని "నువ్వెక్కడికి బయులుదేరావ్!" అడిగాడు.

"కాలేజికి వెళ్లాలి! మర్చిపోయాను! నువ్వు కారు తెచ్చావా?" అడిగింది.

"నీ కారేమయింది?" అడిగాడు.

"డాడీ కారు చెడిపోయింది. నాకారు తీసుకెళ్లారు! రెండ్రోజుల్నించి బస్సుల్లో తిరగలేక చస్తున్నా! టాక్సీలో వెళ్లాలంటే భయం" అని చిన్నగా నవ్వి, "కాలేజీ దగ్గర డ్రాప్‌చెయ్యరాదూ?" అడిగింది.

భగవాన్ తలూపాడు. కొంతదూరం పోయాక అడిగాడు. "ఈ రోజు పేపరు చూశావా?"

"హత్యల సంగతేకదూ?" అడిగింది.

"అవును. నువ్వు కాస్త జాగ్రత్తగా వుండు. ఫ్రెండ్స్‌తో ఎక్కడికీ వెళ్ళకు. కాలేజీ వదలగానే ఇంటికి వెళ్ళు" హెచ్చరించాడు.

బుద్ధిగా తల ఊపింది నీరజ.

భగవాన్ టైం చూచుకున్నాడు, "తొమ్మిదిన్నర అయింది. పది గంటలకుకదూ కాలేజి!" అడిగాడు నీరజని.

"అవును. ఏం?"

"ఇంకా అర్ధగంట వుందికదూ! మా ఇంటికి వెళ్ళి వెళదాం! అమ్మ నీతో మాట్లాడాలన్నది. పది గంటలకల్లా నిన్ను కాలేజీ దగ్గర డ్రాప్‌చేస్తాను. సరేనా?" అడిగాడు.

"ఆవిడతో మాటల్లోపడితే ఈ రోజు కాలేజీకి వెళ్ళలేను. సాయంత్రం వస్తాలే!" అంది చిరాగ్గా.

"ఫర్వాలేదు. ఒక్క పది నిముషాలే! నిన్ను కాలేజీకి అందించే పూచీ నాది! సరేనా?" కారు ఇంటివైపు తిప్పాడు.

నీరజకు ఇష్టంలేకపోయినా, మాట్లాడలేదు. మౌనంగా కూర్చుంది.

"అమ్మా! నీరజ వచ్చిందే!" అన్నాడు పెద్దగా, లోపలికి అడుగుపెడుతూనే.



"ఎవరు వచ్చింది!" అంటూ లోపలినుంచి వచ్చింది భగవాన్ అమ్మ.

"నీరజ!" నొక్కి చెప్పాడు.

"నువ్వటే! చాలా రోజులయింది నిన్నుచూచి. ఈ మధ్య రావటమే మానేశావ్. మీ నాన్న బావున్నాడే?" కుశలప్రశ్నలు వేసింది.

"సరేలే! అవన్నీ సాయంత్రం తీరిగ్గా అడుగుదువు. నీరజ కాలేజికి వెళ్ళాలి. కాఫీ తీసుకురా!" అన్నాడు పురమాయిస్తూ.

"కాఫీ ఇప్పుడొద్దు మామయ్యా!" అంది కాలేజీకి టైం అయిందని కంగారుపడిపోతూ.

"భలేదానివే! ఇంతదూరం వచ్చి కాఫీకూడ త్రాగకుండా పోతావా? పద నా గదిలోకి వెళదాం! నీ కాలేజికి ఇంకా టైం వుందిలే!" అన్నాడు.

నీరజ అయిష్టంగానే గదిలోకి నడిచింది.

భగవాన్ వంటగదిలోకి వెళ్ళి, కాఫీ తీసుకొని మేడ మీద కెళ్ళాడు.

నీరజ గదిలో పచార్లు చేస్తుంది వాచి చూచుకుంటూ.

"త్వరగా కాఫీ త్రాగెయ్యి! వెళ్లిపోవాలి" అన్నాడు కప్పు అందిస్తూ.

నీరజ కప్పు అందుకొని రెండు గుటకల్లో త్రాగేసి, "పద వెళదాం!" అంటూ ముందుకు నడిచింది.

నీరజను పట్టుకొని, 'ఒక్క నిముషం కూర్చో!' అన్నాడు బలవంతంగా మంచంమీద కూర్చోబెడుతూ. నీరజ నసుగుతూనే మంచంమీద వాలిపోయింది.

తలుపులు మూసి, నీరజ బట్టలన్నీ విప్పేసి పరీక్షగా చూశాడు. అజంతా శిల్పంలా తెల్లగా మెరిసిపోతుంది నీరజ శరీరం. నీరజ తనకు కాబోయే భార్య. అయినా, నీరజ వయస్సుకాని, అందంకాని, భగవాన్‌లో కామ ప్రకోపం కల్గించలేదు. తాపీగా జుట్టు కత్తిరించి, తీసుకు వెళ్ళి ఔట్‌హౌస్‌లో పడేసి వచ్చాడు.

"నీరజ ఏదిరా?" అడిగింది భగవాన్ తల్లి అప్పుడే లోపలినుంచి వస్తూ.

"ఎక్కడిదీ ఇంకా నీరజ. కాలేజీకి టైం అయింది కదూ! వెళ్ళిపోయింది!" చర చర తన గదిలోకి వెళ్ళి మంచంమీద వాలాడు.

ఎదురుగా వున్న అద్దంలో భయంకరంగా కన్పించింది తన రూపం. కళ్ళు మూసుకొని తెరిచాడు. ఎర్రగా నిప్పు కణికల్లావున్నాయి కళ్ళు.

లేచివెళ్ళి, 'టేబిల్' సొరుగులోంచి విస్కీ బాటిల్‌తీసి గడ గడ త్రాగేశాడు.

శరీరం అంతా మత్తుగా తయారయింది. అలసటగా మంచంమీద వాలిపోయాడు.

8

నాలుగు రోజుల తర్వాత కిరీటికి ఫోన్‌చేసి, నీరజ హత్యగురించి చెప్పాడు ఇన్‌స్పెక్టర్. "ఇదికూడ ఆ రెండు హత్యల్లాగే జరిగింది!" చెప్పాడు.

"నువ్విప్పుడక్కడే వున్నావా?" అడిగాడు కిరీటి.

"అవును!"

"నీరజ శవానికి కూడ జాకెట్టులేదు కదూ!" అడిగాడు.

"అవును. నీకెలా తెల్సు?"

"ఊహించాను" అని ఆ తర్వాత చెయ్యవలసిన కార్యక్రమం గురించి ఇన్‌స్పెక్టర్‌కు చెప్పి ఫోన్ పెట్టేసాడు కిరీటి.

మరుసటిరోజు పేపర్లో నీరజ హత్యగురించి హెడ్ లైన్స్‌లో ఒక ప్రకటన వెలువడింది. అందులోనే ప్రఖ్యాత డిటెక్టివ్ కిరీటి దాన్ని పరిశోధిస్తున్నట్లు, త్వరలోనే హంతకుడిని బంధించే ప్రయత్నంలో వున్నట్లు వ్రాసారు.

ఆ రోజు సాయంత్రం బాల్కనీలో కూర్చొని పుస్తకం చదువుతున్నాడు కిరీటి.

దూరంగా ఒక వ్యక్తి రొప్పుతూ పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. ఆశ్చర్యంగా చూడసాగాడు అతన్ని. అతను కంగారుగా వెనుక ముందులు చూచుకుంటూ పరుగెత్తుకుంటూ వచ్చి కిరీటి ఇంట్లోకి ప్రవేశించాడు.

కిరీటి చక చక క్రిందకు దిగివెళ్లి తలుపు తెరిచాడు. ఆ వ్యక్తి చటుక్కున లోపలికివచ్చి తలుపులు మూసి ఆయాసంగా తలుపుకు ఆనుకొని నిలబడ్డాడు.

"ఎవరు మీరు? ఏం జరిగింది?" అడిగాడు కిరీటి.

అతను చెబుతానన్నట్లు సైగచేసి, మంచినీళ్ళడిగాడు.

కిరీటి అందించిన నీళ్ళుత్రాగి కుర్చీలో కూర్చున్నాడు.

కిరీటి అతనివైపే పరీక్షగా చూశాడు. బాగా అలసి పోవడంవల్ల ఎదుర్రొమ్ము ఎగిరెగిరి పడుతుంది. మనిషి చాల కంగారుగా వున్నట్లున్నాడు.

షుమారు ముప్ఫై ఏళ్లుంటాయి. సన్నగా ఎర్రగా వున్నాడు. నున్నగా గీచిన గడ్డం....కోరమీసాలు.... చెదిరిపోయిన జుట్టు....మనిషి ఆకర్షణీయంగా వున్నాడు.

"నా పేరు భగవాన్....నన్నెవరో చంపాలని చూస్తు న్నారు" అన్నాడు వగరుస్తూ.

కిరీటి ఆసక్తిగా ముందుకు వంగి, "వివరంగా చెప్పండి!" అన్నాడు. నాలుగు రోజుల క్రిందట కోఠీలోని బుక్ సెంటర్‌లో పుస్తకాలు చూస్తున్నాను. ఎవరో ఒక వ్యక్తి పలకరించాడు. ఇంగ్లీషు నావెల్స్ తనదగ్గర చాల వున్నాయని, కావాలంటే, తక్కువ ధరకు అమ్ముతానని చెప్పాడు. నాకు ఇంగ్లీషు నావల్స్ అంటే ప్రాణం. అందుకే అతనితో వెళ్ళాను. కాని ఆ ఇంట్లో పుస్తకాలు లేవు. మనుషులులేరు. నానోట్లో గుడ్డలుకుక్కి, ఒక స్తంభానికి కట్టేసి తలుపు బయటతాళం వేసుకొని వెళ్ళా డతను. ఈ నాలుగు రోజుల్నించి తప్పించుకోడానికి శత విధాల ప్రయత్నించాను. ఈ నాలుగురోజులు, అన్నం, నీళ్ళు లేవు. అయితే ఈ రోజు ఎలాగో కట్లు విప్పుకో గలిగాను. కాని బయటకు వచ్చేమార్గం కన్పించలేదు. అతి కష్టంమీద వెంటిలేటర్ పగలగొట్టుకొని బయటకు వచ్చాను. అంతలోనే ఆ వ్యక్తి, ఎదురుపడ్డాడు. అందుకే భయపడి నేరుగా మీ దగ్గరకు పరుగెత్తుకొచ్చాను. ఆ దుర్మార్గుడెవరో, నన్నెందుకు చంపాలనుకున్నాడో అర్థం కావడంలేదు. నన్ను మీరే కాపాడాలి" అన్నాడు ప్రాధేయ

పడుతూ.

కిరీటి చిన్నగా నవ్వి,"మీరేం భయపడకండి. మిమ్మల్ని చంపదలచుకున్న వ్యక్తే ఇప్పటికి మూడు హత్యలు చేసాడు. మీరు ఆ ఇల్లు చూపించండి చాలు" అన్నాడు.

"మళ్ళీ ఆ ఇంటికి వెళ్ళాలంటే భయంగా వుంది. అయినా తప్పదుకదా! కాని ఒక్కమాట....ముందుగా మా ఇంటికోసారి వెళ్ళిరావాలి. మా అమ్మ నాకోసం కంగారుపడుతూ వుంటుంది" అన్నాడు ఆతృతగా.

"అలాగే! మీ ఇంటికి వెళ్ళాకే అక్కడికి వెళదాం" అన్నాడు కిరీటి లేచి నిలబడుతూ.

టేబులు సొరుగులోంచి పిస్టలు తీసి కోటు జేబులో వేసుకొని, భగవాన్‌ని అనుసరించాడు కిరీటి.

కిరీటి కారులో ఇద్దరూ భగవాన్ ఇంటికి వెళ్ళారు. కిరీటిని నేరుగా తన గదిలోకి తీసుకువెళ్ళి "కూర్చోండి, అమ్మను పిలుస్తాను" అంటూ క్రిందకు వెళ్ళాడు.

కిరీటి ఆలోచిస్తూ కూర్చున్నాడు. కాస్సేపటి తర్వాత రెండు కప్పులతో కాఫీ తెచ్చి, కిరీటికి ఒకటిచ్చి, "మా అమ్మ వస్తుంది. ఆమెకు చెముడు. కొద్దిగా పెద్దగా మాట్లాడితేగాని వినపడదు" అన్నాడు కాఫీ తాగుతూ.

కిరీటి తల వూపి, కాఫీ త్రాగి కప్పు క్రింద పెట్టాడు. తల తిరుగుతున్నట్లనిపించింది. బలవంతంగా కళ్ళు తెరిచి చూచాడు భగవాన్ వైపు.

భగవాన్ నవ్వి, "నువ్వు పెద్ద డిటెక్టివ్‌వా? నన్ను పట్టుకుంటావా?" అన్నాడు కిరీటి కోటు జేబులో రివాల్వర్ దూరంగా విసురుతూ.

కిరీటి ఏదో అనబోయాడు. మాట రాలేదు. కుప్పలా కూలిపోయాడు.

భగవాన్ తలుపులు వేసొచ్చి కిరీటి బట్టలన్నీ విప్పి, జుట్టు కత్తిరించి, ఔట్ హౌస్‌లోకి తీసుకెళ్ళి పడేసి తలుపు తాళంవేసి వచ్చాడు.

9

నెమ్మదిగా కళ్ళు తెరిచాడు కిరీటి. తలంతా దిమ్ముగా, కళ్లు సూదుల్తో పొడుస్తున్నట్లు అన్పించింది. కళ్ళు గట్టిగా నులుముకొని చూచి ఆశ్చర్యపోయాడు.

చిన్న గది అది. గదికి వున్న తలుపు వుక్కుది. చూస్తేనే తెలుస్తుంది గది సౌండ్ ప్రూఫ్ చేయబడిందని. గదిలో ఒక్క వెంటిలేటర్ కూడా లేదు. అయినా ఎక్కడి నుంచో గాలి వస్తూంది. కాని అది కాదు కిరీటికి ఆశ్చర్యం కలిగించింది.

గదంతా ఎర్రగా....నెత్తురుకంటె ఎర్రగా పెయింట్ చేయబడి వుంది. ఇంక ఇతరవస్తువులేమీ లేవు గదిలో. వున్న బల్బుకూడ ఎర్రగా వుంది. గదిలో మూలగా రెండు ఎర్రటి ప్లాస్టిక్ గ్లాసుల్లో నీళ్లున్నాయి. నీళ్ళు కూడా రక్తంలా ఎర్రగా వున్నాయి. అంతే. ఇంకేమీ లేవు.

కిరీటి లేచి నిలబడబోయి తన శరీరం వైపు చూచుకున్నాడు. శరీరం మీద ఏ ఆచ్ఛాదనా లేదు. నగ్నంగా వున్నాడు. అంతలోనే ఏదో అనుమానం వచ్చి తల సవరించుకున్నాడు. కుదుళ్ళవరకు కత్తిరింపబడిన జుట్టు మొండిగా తగిలింది చేతికి.

కిరీటి ఆలోచిస్తున్నాడు "ఏమిటిది? ఇక్కడెందుకు బంధించాడు తనని? తన తల కత్తిరించటంలో అర్థం ఏమిటి! తను కూడా హత్య చెయ్యబడతాడా! ఎలా! గాయం లేకుండా భయంకరమైన మానసిక వేదన ఎలా కలుగుతుంది? ఆ మానసిక వేదనతోనే నరాలు చిట్లి తను చని

పోతాడు. ఎలా కల్గుతుంది ఆ వేదన? ఆలోచి స్తున్నాడు.

క్షణాలు సెకండ్లుగా.... సెకండ్లు.... నిముషాలుగా, నిముషాలు గంటలుగా గడు స్తున్నాయి. కిరీటికి విసుగు పుడుతోంది. గదిలో ఇంకే వస్తువు లేదు. ఎంతసేపటికి ఎర్రగా....నెత్తురులా వున్న ఆ గోడల్ని చూ స్తుంటే విసుగు పుడుతుంది. రాను రాను ఆ ఎరుపు రంగు చూ స్తుంటే విసుగుతోపాటు భయం కలుగుతుంది. గదిలో ఇక ఇతర రంగు ఏ వస్తువూ లేదు.

విసుగేసి రెండు కళ్ళు మూసుకున్నాడు. ఎంతసేపు అలా మూసుకొని వుండగలడు? నిద్రపడితే అదో తీరు. కాని నిద్రపోకుండా, వూరికే కళ్ళు మూసుకొని ఎవరైతే మాత్రం ఎన్ని గంటలని వుండగలరు?

కళ్ళు మూసుకుంటే ఏదో అసహనంగా, చీకాకుగా వుంది. అయినా కళ్ళు తెరవలేదు. కళ్లు తెరి స్తే గదిలో వున్న ఆ ఎర్రటి రంగు గోడల్ని ఎంతసేపని చూడ గలడు? కళ్లు మూసుకోవాలన్నా విసుగ్గా వుంది. కళ్లు తెర వాలన్నా విసుగ్గా వుంది.

గంటలు గడు స్తున్నాయి. కడుపులో ఆకలిగా వుంది. అది పగలో రాత్రో అర్థం కాలేదు. తన వాచికూడ లేదు. ఇప్పుడేం చెయ్యాలి? ఇలా ఎన్నిరోజులు?

కళ్లు మూసుకొని గ్లాసులో నీళ్ళు గడగడా త్రాగేసాడు. కా స్తంత కడుపులో త్రిప్పినట్లయింది. ఆలోచిస్తూ లేచి గదిలో తిరగసాగాడు. ఎంతసేపని? ఎటు వెళ్ళినా ఎర్రటి రంగు కళ్ళకు భయం గొలిపేలా కన్పి స్తుంది. తల పైకె త్తాడు విసుగుతో. పైన సీలింగ్ కూడా అదే రంగు. ఎలక్ట్రిక్ బల్బు కూడా అదే రంగు.

తల మొద్దుబారిపోతున్నట్లనిపించింది. తల విదిలిం

చాడు. కళ్లు తెరిచాడు....ఎదురుగా ఎరుపు. మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. విసుగ్గా....భయంకరంగా వుంది.

ఆలోచిస్తూ పచార్లు చేస్తున్నవాడల్లా చటుక్కున ఆగాడు. ఇప్పుడర్థమౌతుంది హత్యల్లో అంతర్యం! ఆ మూడు హత్యలు ఎలా జరిగాయో వూహించుకుంటే గుండె జలదరించింది.

అవును. ఎప్పుడో ఎక్కడో చదివాడు. ఎరుపు.... కళ్ళకే కాదు, కళ్ళతోపాటు మనసుకు కూడా బాధ కలిగిస్తుంది. కొద్దిసేపు ఎర్రటి వస్తువు చూస్తేనే పిచ్చెక్కినట్లయి చూపు మరల్చుకుంటాం. అలాంటిది ఎర్రగా పోత పోసిన గదిలో....ఒంటరిగా....కొన్ని రోజులు గడపడం అంటే....మామూలు వ్యక్తికి అసాధ్యం. ఎంతో మనోదారుఢ్యం వుంటేగాని, ఆ ఎరుపురంగు ప్రభావంనుంచి మనసు వికలం కాకుండా కాపాడుకోలేడు. అందుకే నవీన్, శారద, నీరజ భయంకరమైన మానసిక వ్యధకు గురై మరణించారు. తను....తనకంత మనోదారుఢ్యం వుందా?

భయంకరమైన సత్యం కళ్ళముందు మెదిలేసరికి నిరుత్సాహం ఆవరించింది కిరీటిలో.

రెండు రోజులు గడిచి వుంటాయనుకున్నాడు. ఈ రెండ్రోజులు విసుగయినా సాధ్యమైనంతవరకు కళ్లు మూసుకొనే గడిపాను. అయినా పిచ్చెక్కేలా వుంది. కళ్ళు తెరిస్తే ఎరుపురంగు. ఎరుపు రంగు చూచి విసుగెత్తింది. ఇంకేరంగయినా సరే....ఎరుపు తప్పించి కన్పిస్తేచాలని పిస్తుంది కళ్ళకు, మనస్సుకు.

జుట్టు కత్తిరించడంలో అంతర్యం ఇప్పుడర్థమైంది కిరీటికి. ఎవరైనా ఈ బాధ భరించలేక జుట్టు పీక్కున్నా నల్లటి శిరోజాలు కళ్ళకు కాస్తంత హాయినిస్తాయి. కాని

ఆ అవకాశం లేకుండా జుట్టుకూడ కత్తిరించాడు. ఏం చెయ్యాలి?

రానురాను పిచ్చెక్కిపోతుంది కిరీటకి. తల నేలకేసి కొట్టుకోవాలని, పిచ్చిగా కళ్లు పీక్కోవాలని అన్పిస్తుంది.

ఎన్నో కేసులు పరిశోధించాడు. ఎంతోమంది భయంకర మైన హంతకులతో తలపడ్డాడు. కాని, ఇలాంటి పరిస్థితి ఏనాడూ కలగలేదు. ఇంతగా నిరుత్సాహపడలేదు. వ్యాకుల పడలేదు. చివరికి ఈవిధంగా, ఎలాంటి ప్రత్యర్ధి లేకుండానే, నిరాయుధంగా, నిర్వీర్యంగా చనిపోవల్సివచ్చింది? కలలో కూడ అనుకోలేద.

ఒక్కసారిగా, విసుగు, కోపం, నిరుత్సాహం....భయం అన్నీ విజృంభించాయి. నిశ్చలంగా, నిస్తేజంగా గదిమధ్య నిలబడ్డాడు. ఆకారం లేని మృత్యువులా ఎర్రటి రంగు క్రమక్రమంగా ప్రాణాలు హరిస్తుంది. కాళ్లు, చేతులు మొద్దుబారిపోతున్నాయి. కాళ్ళూ, చేతులు ఝూడించాడు.

అంతే....కళ్ళల్లో ఒక్కసారిగా ఆశా కిరణం మెరిసింది. నడుమువైపు ఆప్యాయంగా చూచుకున్నాడు. నల్లటి మొలత్రాడు ప్రాణభిక్షపెట్టే దేవతలా కన్పించింది. చటుక్కున మొలత్రాడు తెంపి, గుప్పెట్లో వుంచుకొని, ఒక మూలగా కూర్చున్నాడు. రెండుచేతులు మొహం దగ్గరగా పెట్టుకొని, నల్లటి ఆ తాడువైపే చూస్తుండిపోయాడు.

మరో రెండ్రోజులు గడిచాయి. కిరీటి నేలమీద పడుకున్నాడు. కళ్లు పీక్కుపోయి, కనుగుడ్లు ఎర్రగా వచ్చాయి. ఎన్ని గంటలని ఆ నల్లటి త్రాడును చూడగలడు. ప్రాణం పోయేలా అన్పిస్తుంది. అప్పుడప్పుడు మైకం కమ్ముతుంది. కిరీటికి ఒక విషయం నిర్ధారణ అయింది. ఎప్పుడో మైకంలోనే తన ప్రాణాలు పోతాయని. అంతేకాదు, తనకు

మనోదారుఢ్యం కూడ లేదని రుజువయింది.

'తన సంగతికాదు. ఇంకెవరైనా, ఈ పరిస్థితులతో ఎంతకాలం బ్రతకగలరు? అంతటి మనోదారుఢ్యం వున్న వ్యక్తులు వున్నారా?' ఆలోచిస్తున్నాడు.

మరో రెండ్రోజులు గడిచాయి. కిరీటి కళ్ళు తెరవలేదు. పిడికిలిలో వున్న మొలత్రాడు నేలమీద జీరాడుతుంది.

నెమ్మదిగా తలుపులు తెరుచుకున్నాయి. భగవాన్ లోపలికి వచ్చాడు. అచేతనంగా వున్న కిరీటిని చూచి పెద్దగా నవ్వి, తాను తెచ్చిన కిరీటి ప్యాంట్ కిరీటికి తొడిగాడు. చేతులు మొద్దుబారినట్లున్నాయి. శవం శరీరం మొద్దుబారితే చేతులు వంగవు. అందువల్ల చొక్కా తొడగలేదు.

కిరీటిని భుజాన వేసుకొని బయటకు వచ్చాడు. బాగా చీకటిగా వుంది. నెమ్మదిగా కిరీటి శరీరాన్ని కారులో వేసి, స్టేరింగ్ ముందు కూర్చొని, కారుని ముందుకు పోనిచ్చాడు.

కారుని తాపీగా నడుపుతూ, పోలీస్‌స్టేషన్‌కు కొంచెం దూరంలో ఆపాడు. స్టేషన్ ముందు లైట్ వెలుగుతుంది. బయటగాని, వీధిలోగాని ఎవ్వరూ కన్పించలేదు. నెమ్మదిగా కిరీటి శరీరాన్ని రోడ్డుమీదకు వదలి కారును పోనిచ్చాడు.

10

వారం రోజులు గడిచాయి.

భగవాన్ ఉదయాన్నే టిఫిన్‌చేసి బట్టలు మార్చుకుంటున్నాడు.

"రేయ్! నీకోసం ఎవరో వచ్చారు!" భగవాన్ అమ్మ అరిచింది క్రిందనుంచి.

"వస్తున్నా!" అంటూ క్రిందకు దిగి నిశ్చేష్టుడై పోయాడు. ఎదురుగా పోలీసులు. అయినా ధైర్యం తెచ్చుకున్నాడు.

"రండి! ఇన్‌స్పెక్టర్! ఏమిటి విశేషం?" నవ్వుతూ అడిగాడు.

"మిస్టర్ భగవాన్! నిన్ను హత్యానేరం క్రింద అరెస్టు చేస్తున్నాం!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గంభీరంగా.

"నేను హత్యలు చేసానా? ఎవర్ని?" పగలబడి నవ్వుతూ చూచాడు ద్వారంవైపు. లీలగా ఏదో ఆకారం గోచరించింది. సన్నగా, ముళ్ళపంది జుట్టుతో....పంచ ప్రాణాల్లో నాల్గుప్రాణాలు కోల్పోయినవాడిలా నీరసంగా, కళ్ళల్లో ఎక్కడో ప్రాణం పెట్టుకున్నవాడిలా కన్పించాడు.

"ఎవరది?" అడిగాడు భగవాన్.

"నేనే!" నూతిలోంచి వచ్చినట్లుంది స్వరం.

రెండడుగులు క్రిందకు దిగిచూచాడు. అదిరిపడ్డాడు. ఇప్పుడో, ఇంకాసేపో రాలిపోయేలా వున్నాడు కిరీటి.

"నువ్వా! బ్రతికున్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు.

దవడకంటుకుపోయిన పెదాలు కదిలాయి. కిరీటి నవ్వాడని అనుకున్నాడు భగవాన్. "అవును. నీకథ చెప్పినప్పుడే నిన్ను అనుమానించాను. నాల్గురోజులు బంధింపబడి వున్నానని అన్నావ్. నేరుగా నా దగ్గరకే వచ్చానని అన్నావు. కానీ, నీ గడ్డం నున్నగా ఆ రోజే షేవ్‌చేసినట్లుంది. అప్పుడే అనుమానించాను నిన్ను. నీతో తలపడడానికే ధైర్యంగా వచ్చాను నీ ఇంటికి. కాని ఇంత భయంకరమైన ప్లాన్ వుందని ఊహించలేదు. నిజానికి నేనూ వాళ్ళలా చనిపోవలసినవాడినే. అయితే నన్ను కాపాడింది ఏమిటో తెలుసా? ఇది" అంటూ మొలత్రాడు తీసి చూపించాడు.

భగవాన్ ఆశ్చర్యపోయాడు.

"అవును ఇది లేకపోతే నేను చనిపోయి వుండేవాడినే.

అప్పటికి చాలసార్లు స్పృహతప్పాను. అలా స్పృహ తప్పిన సమయంలోనే నేను చనిపోయానని, నన్ను తీసు కెళ్ళి రోడ్డుమీద వేసావు. ఆ తర్వాత హాస్పిటల్లో వారం తర్వాత ఈ రోజే స్పృహవచ్చింది. వెంటనే బయలుదేరి వచ్చాను. లేకుంటే ఇంకో అమాయక ప్రాణి బలై పోతుంది నీ క్రూరత్వానికి!" అన్నాడు కిరీటి నీరసంగా.

పగలబడి నవ్వాడు భగవాన్. "వెల్ నీ చిత్త స్థయిర్యానికి మెచ్చుకుంటున్నాను. వారం రోజులకే ఇలా అయిపోయావ్ నువ్వు. కాని నేను....ఎస్....నేను.... వారంకాదు....రెండు వారాలు....ఆ నరకయాతన అనుభ వించి బ్రతికి బైటపడ్డాను. సో! నీకంటె నాకే చిత్త స్థయిర్యం ఎక్కువ. ఒప్పుకుంటావా?" అడిగాడు నవ్వుతూ.

కిరీటితోపాటు అందరూ ఆశ్చర్యపోయారు.

"అవును. సరిగ్గా మూణ్ణెల్లక్రితం ఒక నయవంచకితో తగాదా వచ్చింది ఆ గదిలోనే... ఎలా జరిగి వుంటుందో ఊహించుకోవచ్చు మీరు. బైట తాళంవేసి వెళ్ళిపోయింది. శరీరంమీద బట్టలులేవు. గదిలో నీళ్ళుకూడా తప్పించి ఏమీ లేవు. అయినా బ్రతికాను రెండు వారాలు" పగలబడి నవ్వాడు భగవాన్.

"ఇనస్పెక్టర్! ఇతనికి మతి చలించింది. ఆ మతి భ్రమణంతోనే ఈ హత్యలు చేసాడు. ఆ భయంకర దుస్థితి నుంచి తను బ్రతికి బైటపడగలిగాడు. ఇంకెవరైనా బ్రతక గలరా? అనే క్రిమినల్ మైండ్‌తో ఈ హత్యలు చేసాడు. తీసుకువెళ్ళండి" అన్నాడు డిటెక్టివ్ కిరీటి.

భగవాన్‌కు పిచ్చి అంటే ఎవ్వరూ నమ్మరు. అది కన్పించని మనోచాంచల్యం. అతని క్రిమినల్ మైండ్! ☐

పోటీ వ్యాపారం

ఎస్. కృష్ణవేణి



దూడకి గడ్డికోస్తున్నదన్న మాటేగానీ చంద్రి మనసు అంతా రంగడికోసం ఎదురుచూస్తూ వున్నది. రంగడిని తలవగానే ఏమి చెప్పాలో ఏలా చెప్పాలో తనలో తానే మననం చేసుకోసాగింది.

హఠాత్తుగా చంద్రిని ఎవరో గట్టిగా వాటేసుకున్నారు.

బిత్తరపోయి తలత్రిప్పి చూసింది చంద్రి. పెద్ద కామందుగారి పట్నంలో చదివే కొడుకు. ఏందో పేరు వున్నదిగానీ వూరి పడుచులందరూ "పిట్టలవేటగాడు" అని అంటారు.

చంద్రి ఒక విదిలింపు విదిలించినది. కామందుగారి కొడుకు పట్టు సడలింది.

చంద్రి లేచి నిలబడి "ఏంది చినబాబూ! మీ కన్ను నా మీద కూడా పడిందా?" భయపడుతూ అడిగింది.

"నాకు కలసి రావాలేగానీ రోజుకి పదిమంది ఆడోళ్ళ నైనా రుచిచూడాలనిపిస్తుందే చంద్రి" కుక్కలా చొంగ కార్చుకుంటూ అన్నాడు.

"ఆబుద్దే వుంటే ఎవరిజేతిలోనైనా చస్తావ్" భవిష్యత్తు చెప్పింది.

"ఛీ! నన్ను చంపే నాయాల యింకా యీ భూమ్మీద పుట్టలేదు. రావే!" చెయ్యిపట్టి లాగాడు.

కెవ్వుమంది చంద్రి.

"బాబూ! నన్ను వొదిలేయండి. మీకు దండం పెడతా! నేను అలాంటి ఆడదాన్ని కాను" ఏడుస్తూ అన్నది.

"లొంగేవరకూ అందరూ ఇలానే అంటారు. ఒసేయ్! గడ్డికోసే నీలాంటివారి దగ్గరనుండి కాలేజీ అమ్మాయివరకూ అందరూ ఇలాంటి కబుర్లు చెప్పేవారే. నీ కెంతకావాలో అంత అడిగి తీసుకో!" కళ్ళల్లో కైపు తలకెక్కగా అన్నాడు.

"బాబూ! మీ పాలేరు రంగడిని నేను మనువాడాలనుకుంటున్నాను. మేమిద్దరం ప్రేమించుకొన్నాం. మనువాడాలనుకొంటున్నాం" దీనంగా అన్నది.

"లవ్వాడండి, పెళ్ళాడండి, ఎవరొద్దన్నారు. నాకు

కావలసినది నీ పొందు. అది నేను పొంది వెళ్ళిపోతాను" అని పశువులా ఆమె వస్త్రాలని పట్టుకొని లాగసాగాడు.

"బాబూ....బాబూ .... రంగా....రంగా" అరుస్తోంది చంద్రి. భయంతో ఆమె గజగజలాడి పోతోంది.

"ధన్" మనే పిడిగుద్దు ఇద్దరినీ అదరగొట్టింది.

కామందుగారి అబ్బాయి శ్రీనివాస్ తల త్రిప్పి చూశాడు, తన వీపుమీద పడినది ఏమిటా అని.

భీకరావతారంగా నిలబడి వున్నాడు రంగడు.

"నాయాలా! నీకెంత డబ్బువుంటే మాత్రం వూరి ఆడోళ్ళు అంతా నీకు పెళ్ళాలనుకున్నావా?" అంటూ కలియపడ్డాడు.

చంద్రి గబగబా వూడిపోయిన చీర కట్టుకొని తల సవరించుకొని యిద్దరి కుస్తీని చూస్తూ నిలబడింది.

"ఒరేయ్! నేనెవరో తెలిసి నామీద చెయ్యి వేస్తావురా! నీ ప్రాణం తీయించకపోతే నేను పెద్ద కామందుగారి అబ్బాయినే కాను" రోషంగా అన్నాడు శ్రీనివాస్.

"అసలు నీవు బ్రతికి వుంటేగా నా ప్రాణం తీయడానికి" అని బలంగా తోసాడు రంగడు.

శ్రీనివాస్ అక్కడవున్న నీళ్ళ బోదిలో బొక్కబోర్లా పడ్డాడు.

రంగడు కసిగా మెడమీద కాలువేసి బురదలోకి తల కూరేలా తొక్కాడు.

"మావా మావా" గాబరాగా అరచింది చంద్రి.

"ఏం?" రంగడు అరిచాడు.

"వూపిరాడక సచ్చిపోతాడు" గాబరాగా అరచింది.

"చావనీ నాయాల! వూరికి పీడ విరగడై పోతుంది" మీసం మెలివేశాడు.

చంద్రి పరుగున వచ్చి రంగడిని యివతలకి లాగి శ్రీని వాస్ని బురదలోనుండి యివతలకిలాగి "కెవ్వు" మని అరచింది.

కొంచెం ఆవేశం తగ్గిన రంగడు వంగిచూశాడు. శ్రీనివాస్ చనిపోయి వున్నాడు. గబగబా నీళ్ళతో మొఖాన్ని కడిగి ముక్కు దగ్గిర వేలుపెట్టి చూశాడు. వూహూ ఏమీ చప్పుడు లేదు.

చంద్రి ఏడుస్తూ కూర్చుంది.

"చంద్రీ....ఇలా అవుతుందనుకోలేదే. ఆడు నీ చీర పట్టుకొని లాగుతూ వుంటే నాకు పిచ్చికోపం వచ్చేసిందే" దీనంగా అన్నాడు.

"అసలు నీ వింత ఆలశ్యంగా ఎందుకొచ్చావ్?" కోపంగా అడిగింది.

"ఇక్కడ నీవు వుంటావనే వస్తున్నానే.గుడికాడ చిలక జోశ్యంగాడు తగిలాడు. పావలా యిచ్చి చూపించుకుంటే "యింకా కొద్దిరోజుల్లో నీ జాతకమే మారిపోద్ది. నీకి కష్టాలు వుండనే వుండవ్" అనే కాగితం చిలక తీసి యిచ్చిందే. ఇంకా ఏం? నీతో మనువు ముడిపడిపోద్ది అనే సంతోషంలో ఏవేవో కలలుకంటూ రావడం ఆలశ్యం చేశానే" ఏడుస్తూ చెప్పాడు.

"మా అయ్య నన్ను నీకు బొందిలో ప్రాణం వుండగా యీయనని, మా అత్తకొడుకు ఎంకన్నకే యిచ్చి చేస్తానని మా అత్తవూరు వెళ్ళాడు" ఏడుస్తూ చెప్పింది.

ఇద్దరికీ ఏడుపు ముంచుకొచ్చేసింది. ఎదురుగా శవాన్ని పెట్టుకుని ఏడుస్తూ కూర్చున్నారు.

కొంచెంసేపు అయిన తరువాత రంగడు శ్రీనివాస్ జేబులు తడిమాడు అందులో డబ్బువున్నది. లెక్కపెట్టాడు.



మూడొందలు వరకూ వున్నది. చేతికి వాచి వుంగరం కుడి చేతికి బంగారపు గొలుసు వున్నాయి. అవి అన్నీ తీసుకున్నాడు.

"చంద్రీ! ఇక్కడవుంటే పెద్దకామందు నన్ను చంపించేస్తాడు. ఈ డబ్బుతో మద్రాసు పారిపోయి అక్కడ ఏదైనా యాపారం చేసుకొని దర్జాగా బతకొచ్చు. నాతో రావే చంద్రి" పిలిచాడు.

చంద్రి మాట్లాడలేదు.

రంగడివేపు, కొద్దిక్షణాల క్రితం తన మానం దోచడానికి పులిలా పడిన కామందుగారి అబ్బాయి శవంవేపు చూస్తూ కూర్చుంది.

"ఏమే చంద్రి, మాట్లాడవు. నా యంట రావడానికి భయంగా వుందా? నేను నిన్ను మోసం చేస్తానని అనుకుంటున్నావా?" అడిగాడు.

"అయ్యా వూరెళ్ళిన దగ్గరనుండి నాకు భయంగా వున్నది. నీతో చెప్పి ఎక్కడైనా పారిపోదామనే వస్తిని మావా" చంద్రి చెప్పింది.

"చంద్రీ! నా చంద్రి" సంతోషంగా కౌగలించుకొన్నాడు.

"మావా! కామందు వూరుకుంటాడా? ఏటకుక్కలా మనల్ని వేటాడి చంపడూ" భయంగా అన్నది.

"మద్రాసువరకూ ఆడు రాడులేవే! అయినా మనమే చంపామనేటి? ఈడి శవం విషయం ఆళ్ళకి తెలిసేసరికి రెన్నాళ్ళన్నా అవుతుంది ఆ సరికి మనం మద్రాసులో వుంటాం. ఇంకనుండి మన ఇద్దరి బ్రతుకులు రాజాబతుకే" వూహల్లో తేలిపోతూ అన్నాడు.

2

ఇద్దరూ చచ్చీచెడి విజయవాడ చేరేసరికి రాత్రి ఎనిమిది గంటలు అయింది. చాలాదూరం నడిచి రావడం వలన యిద్దరికీ ఆకళ్ళుగానే వున్నాయి.

అప్పుడప్పుడు సినిమా చూడడానికి వచ్చినప్పుడంతా బస్టాండు ఎదురుగావున్న పెద్ద హోటలు మమతలోకి ఒక సారి చంద్రితో పోయి తినాలని ఆశగా వుండేది. కానీ ఓ పదైదు రూపాయలన్నా కావాలి? ఎక్కడి నుండి వస్తుంది.

ఇక్కడికి వచ్చినప్పుడంతా హోటలుని చూస్తూ కలలు కని మాత్రం వెళ్ళేవాడు. ఈరోజు తన చంద్రి వున్నది. జేబులో డబ్బున్నది.

చంద్రిని తీసుకొని హోటల్లోకి అడుగుపెట్టాడు. చంద్రి భయంతో రంగడిని ఆనుకొని బెదిరిన లేడిలా చూస్తూ వెళ్ళింది.

ఇద్దరికీ దేవేంద్ర లోకంలో అడుగుపెట్టినట్లు అనిపించి

నది.

అందులోకి వెళ్ళగానే రంగడు తానో హత్య చేసి వచ్చిన సంగతిగానీ, తనని కామందుగారు వేటకుక్కలా వేటాడుతాడేమో ననే భీతి గానీ యేదీ లేకుండా పోయింది.

శాపవిమోచనం అయిన గంధర్వుడిలా గతాన్ని మరచి పోయాడు. ఛాతీ పది అంగుళాలు పెరిగింది. తాను శోభన బాబు, తన ప్రక్కనున్న చంద్రి జయసుధ అన్నట్లు అని పించసాగింది.

ఏదో ఆనందం ఏదో గర్వం.

అందరూ తమని వింతగా చూస్తూ వుంటే రంగడికి తమని శోభన్‌ని, జయని ఆశ్చర్యంగా చూస్తున్నట్లుగా అనుకున్నాడు.

చంద్రి రంగడి మావవేపు ఆరాధనా పూర్వకంగా చూపింది.

రంగడికి చిలకజోశ్యం మీద బాగా గురి కుదరిపోయింది. తను జీవితంలో చిలకని మరచిపోకూడదని అను కున్నాడు

అన్నం తిని రిక్షా యెక్కి స్టేషన్‌కి వచ్చారు.

మద్రాసు వెళ్ళే రైలుస్టేషన్‌లో రడీగా వుంది. టిక్కెట్టు కొనుక్కుని బండి ఎక్కేశారు.

బండి కదిలిన తరువాత ఇహ తమని పట్టుకోవడానికి బ్రహ్మతరంకాదని నిశ్చయించుకొన్నారు.

3

మద్రాసు మహానగరంలో అడుగుపెట్టగానే యిద్దరికీ దిక్కు తోచలేదు. భాష తెలియడంలేదు. దారి తెలియడం లేదు. ఇది తమ వూరిలో చిన్నవూరిలా లేదు. కనీసం

విజయవాడలా కూడా లేదు.

రెండురోజులు నగరంలో ఆనందంగా తెలిసీ తెలియక గడిపారు. ఏదో ఒక బస్సు యెక్కేయడం, ఎక్కడపడితే అక్కడ దిగిపోవడం, అక్కడి హోటల్లో దర్జాగా భోజనం చేయడం అలా గడుపుతున్నారు.

వారికి తెలియకుండానే పెరంబూర్ పటాలం దగ్గరకి వచ్చారు. అక్కడ తమవేపు తెలుగు మాట్లాడేవారిని చూసి కాస్త ధైర్యం చిక్కింది.

ఏదైనా యాపారం చేయాలి? డబ్బు అయిపోకముందే యాపారం చెయ్యాలి? ఏం చెయ్యాలి? అక్కడ పార్కులో కూర్చొని యిద్దరూ అనేక రకాలుగా ఆలోచించారు.

ఒక మొగుడు పెళ్ళాలు ఒక కుండనిండా పులుసు, యింకో కుండనిండా అన్నం పెట్టుకొని పార్కుకి పక్కగా కూర్చొని వున్నారు.

మధ్యాన్నంఅయ్యేసరికి చాలమంది అలగాజనం అక్కడ చేరి చిన్నచిప్పడు అన్నం, ఓ గరిట పులుసు తీసుకొని ఆకుల్లో తినేసి వారికి అర్ధరూపాయి చెల్లించి వెళ్ళిపోతు న్నారు. రంగడు వస్తున్నవారిని చూస్తూనే వున్నాడు. పద కొండు గంటలనుండి మూడు గంటలవరకూ వస్తూనే వున్నారు.

మూడుగంటలకి చంద్రి, రంగడు రూపాయి చెల్లించి ఆ అన్నం కొనుక్కొని తిన్నారు. చేపలపులుసు వాసనతో వున్న పులుసు అది. దానికంత విరగబాటు.

మరునాడు రంగడు వారిని అనుసరించాడు. మార్కెట్టులో చేపలు అమ్మేవారిదగ్గర పడివున్న పొలుసు శంఖులు తోకలు వీరు తెచ్చి, దానితో పలచగా చారు మాదిరి పులుసు చేసి అమ్ముతున్నారు. ఆ పులుసు చేపలపులుసు మాదిరి



వాసన రుచితో వుంటున్నది. పేదవారి పాలిట అది పెన్నిధి.

4

మరునాడు పటాలానికి అవతల పెరంబూర్ ఏరియా లోనే కొత్త లేబరు నివశించే చోట రంగడు, చంద్రి అన్నం కుండా చాపల పులుసు కుండా పెట్టుకొని కూర్చు న్నారు.

ముందు అందరినీ చంద్రి బాగా ఆకర్షించినది. కుర్రకారు లంతా చంద్రి కుండచుట్టూ చేరారు. అన్నం పులుసు కూడా చాల రుచిగా వున్నది.

నాలుగురోజు లయ్యేసరికి వీళ్ళ వ్యాపారం బాగా పెరి గింది. ప్రొద్దుటో కుండా, సాయంకాలమో కుండ పెట్టినా చెల్లుబడి అయిపోతోంది.

రంగడు ఆ ఏరియాలోనే చిన్న యిల్లు అంటే ఓ చిన్న గదిని ముప్పై రూపాయలకి అద్దెకి తీసుకున్నాడు. ఓ చాప దిండు కొనుక్కున్నారు. వారి వంటకి రెండు మూడు కుండలు చట్టెలు కొనుక్కున్నారు. రెండు సత్తుగిన్నెలు

గ్లాసులు.

రెండురోజులు పోయిన తరువాత చంద్రికి చిన్నపువ్వుల చీర కూడా కొన్నాడు రంగడు.

చిలకజోశ్యం నిజమవుతున్నందుకు సంబరపడిపోతు న్నాడు. మెద్రాసులోనే కారుల్లో తిరుగాడే రోజు దగ్గర లోనే వున్నట్లు కలలు కనసాగారు.

రంగడు చురుకైనవాడు. ఇంకా వ్యాపారంలో కొత్తది ప్రవేశపెట్టాడు.

మాంసంకొట్టులో ఎముకలు, జవ్వ తెచ్చి మసాలావేసి బిరియాని మాదిరి చంద్రితో చేయించి, చిప్ప రూపాయి లెక్కన అమ్మించాడు.

ఇంకేముంది? చాపలపులుసు కన్నా దీనికి గిరాకి పెరిగి పోయింది. చాటుమాటుగా నాటుసారా తాగేవాళ్ళు కూడా యీ రూపాయి బిరియాని అన్నంకోసం యెగబడసాగారు.

"చంద్రీ! నిన్ను బంగారంలో ముంచేస్తానే. ఒల్లంతా బంగారం దిగేస్తానే" ఎన్నోసార్లు అన్నాడు.

వారి ఆనందం అంతా యింతా కాదు. నక్కతోక తొక్కివచ్చామని, చిలక చాలా బాగా చెప్పిందని రంగడు ఓ చిలకని పంజరంతోసహా కొనివచ్చి దానికి రోజూ జామ పండ్లు వేయసాగాడు.

5

పటాలంలో అమ్మే నటేశన్ వ్యాపారం బొత్తిగా పడి పోయింది. అసలు గిట్టుబాటుకావడమే చాల కష్టంగా వున్నది.

నటేశన్ అంబుజాన్ని పదేళ్ళక్రితం సేలం నుండి మొగుడిదగ్గరనుండి లేవదీసుకొని వచ్చాడు. ఆ పదేళ్ళ నుండి వారిద్దరి జీవనం యీ పులుసు కుండమీదే ఆధారపడి

వుంటోంది. భుక్తికి లోటులేకుండా బాగానే జరుగుబాటు అవుతోంది.

అయితే కాస్తకూడా వెనకవేయలేదు. ఎందుకంటే నటేశన్ బాగా తాగుతాడు. మూడుగంటలవరకూ యాపారం చూసుకొని మూడు గంటలకి అంబుజం అడ్డు వచ్చినా తన్ని తాగడానికి వెళ్ళిపోతాడు.

ఒక్కొక్కనాడు అయితే పెట్టుబడికి లేక వెతుక్కోవలసి కూడా వస్తుంది. అటువంటి సమయాలలో నటేశన్ అప్పుకోసం నంబి దగ్గరకు వెళ్తూ వుంటాడు.

నంబి పెరంబూర్ ఏరియాకి కిరాయి రౌడి. వాడు అంబుజంమీద కన్నేసాడు. నంబి ఎన్నోసార్లు నటేశన్ వద్ద యీ విషయంగా కలేసాడుగానీ నటేశన్ ఎంత తాగుబోతు అయినా యీ విషయంలో యింతవరకూ దిగజారలేదు.

నంబి గుంటకాడ నక్కలా అవకాశంకోసం ఈ పదేళ్ళ నుండి ఎదురుచూస్తూనే వున్నాడు.

అంబుజానికి పిల్లలు లేకపోవడంవలన పిటపిటలాడుతూ వుంటుంది. అంబుజానికి నిజానికి వయస్సు ఇరవై ఐదు పైనవున్నా. ఇరవై లోపు దానిలానే వుంటుంది.

అంబుజం వొళ్ళు చూసి కూడా చాలమంది వచ్చి అక్కడ చేరేది.

ఇప్పుడు యెందుకనో వ్యాపారం సడన్‌గా దెబ్బ తినింది.

రెండురోజుల నుండి సారాకికూడా డబ్బులు దొరకడం లేదు. నటేశానికి తిక్క తిక్కగా వున్నది.

అంబుజం నటేశాన్ని తిట్టి తిట్టి పోస్తోంది. "తాగుబోతు దగ్గర యెంత డబ్బు వస్తేనేం తెల్లవారేసరికి అయ్యవారి

నట్టిల్లే. మాయవారమే గతి'' అంటూ.

అప్పటికి నాలుగుసార్లు నంబి దగ్గరకి వెళ్ళివచ్చేడు. నంబి చెప్పిన మాటలకి నటేశం వొళ్ళంతా వుడుకు తోంది.

నంబి రంగడిగూర్చి, చంద్రిగూర్చి, వాళ్ళ బిరియానీ అన్నం గూర్చి చెప్పాడు. నటేశన్ వెళ్ళి చూసాడు. యాపారం మా జోరుగా సాగుతోంది. అందరూ కళ్ళతో చంద్రిని, నోటితో బిరియానీని, అవురావురున తింటు న్నారు....

ఈ అలగాజనం ఆ చంద్రినీ ఆ బిరియానీ అన్నాన్ని వదలి రావడం మాత్రం కల్ల అని తెలుసుకున్నాడు.

రాత్రంతా బాగా ఆలోచించి నంబి దగ్గరకి బయలు దేరాడు.

''ఇదో నటేశన్ అన్నా యన్ కిట్టా పణం యిల్లే!'' నంబి నటేశన్ని చూడగానే అన్నాడు.

''నేను పణంకోసం రాలా! నీతో వ్యవహారం మాట్లాడే దానికి వచ్చా'' నన్నాడు.

''వా! వుకార్!'' నంబి కూర్చోడానికి స్థలం చూపిం చాడు.

''విషయం ఏంది?''

''నా యాపారం దెబ్బతినింది కదా! ఆళ్ళిద్దరినీ తప్పించే సేయ్'' నటేశన్ అన్నాడు.

''నేను యింతవరకూ మనుష్యులని చంపలేదు. చచ్చే టట్లు తన్నడమే నా వృత్తి'' అని అన్నాడు.

''అలా కాదు. యీళ్ళు యీ వూరివాళ్ళు కాదు. మన భాషకూడా తెలియదు. అందుకని మనల్ని అడిగేవారు లేరు. తప్పించేస్తే పర్మినెంటుగా ఇంక మన వ్యాపారానికి దెబ్బ

రాదు' నటేశన్ అన్నాడు.

"ఇద్దరి మనుష్యులని చంపేదానికి కావలసిన కిరాయి నీ విచ్చుకోగలవా?" నంబి ఆశ్చర్యంగా అన్నాడు.

నటేశన్ కొన్ని క్షణాలు మౌనంగా వుండి నంబివేపు చూసి—"తంబీ! నీవు అంబుజంమీద మనస్సు పడ్డావు కదా! ఒక్కరోజుకైనా కావాలంటున్నావుకదా! ఒక్క-రోజేం ఖర్మ—ఓ మూడునాళ్ళు వాడుకో! ఆ మూడు రోజులు నాకు ఫుల్‌గా సారాయి మాత్రం పోసేయి" అని అన్నాడు.

నంబి గుటకలు మింగాడు. అంబుజాన్ని కలసి అడిగాడు.

అంబుజం చాల రోజులనుండే నటేశాన్ని వదిలించు కోవాలని చూస్తోంది. తాగుబోతు మొగుడుతో సుఖం అన్నది ఏ కోశానా లేదు. ఇంతకాడికి యీ మొగుడెందుకు? సరైన ఆధారంకోసం చూస్తోంది.

నంబి వచ్చి అడగ్గానే అంబుజం తెలివిగా అన్నది. "మూడు రోజులతో నామీద నీకు మోజు తీరిపోతుందా?" అని అడిగింది.

"నీ యమ్మ! అంతకాడికి యిన్నాళ్లు గుంటకాడ నక్కలా యెందుకని కాచుకూర్చుంటానే" నంబి అన్నాడు.

"మరి?" వయ్యారాలు పోయింది.

"ఏం చెయ్యనే: అల్లరైపోనూ" నసిగాడు.

"నీవేం కిరాయి రౌడివయ్యా! ఇంతదానికి నీళ్ళుకారి పోతున్నావ్? నీలాంటివాడిని చూసి ఏ ఆడది నమ్ముకొని

వస్తాది" పౌరుషం యెక్కించి దగ్గరకి పిలచి వుపాయం చెప్పింది అంబుజం.

6

నటేశన్ మాయమాటలు చెప్పి రంగడిని చంద్రిని బీచి వద్దకి పిలుచుకొని వెళ్ళాడు. నంబి అక్కడున్నాడు.

చీకటి పడేవరకూ వ్యాపారం కలసి చేద్దామని నమ్మకపు కబుర్లు చెప్పి చీకటిపడిన తరువాత నంబి యిద్దరినీ కొట్టి చంపేశాడు.

ఇద్దరూ చేరి రెండు శవాలని సముద్రంలోకి విసిరి వేశారు.

"తంబీ...." సంతోషంగా వెనక్కి తిరిగిన నటేశన్ నంబిని చూసి ఉలిక్కిపడ్డాడు.

"తం....బీ" భీతితో అరిచాడు.

నంబి వికటంగా నవ్వి నటేశన్ తలమీద బలంగా దెబ్బ వేశాడు.

* * *

తెల్లవారేసరికి ఒడ్డున మూడు శవాలు పడి వున్నాయి. పోలీసులు, ప్రజలు అక్కడే గుమిగూడి వున్నారు.

కొంచెం పొద్దు యెక్కిన తరువాత అటుగా వచ్చిన నంబి నటేశన్ శవాన్ని చూసి—"అన్నా...." అంటూ శవంమీదపడి భోరున ఏడిచాడు.

నంబి పోలీసోళ్ళ చుట్టమే కాబట్టి వారు నంబిని అడిగారు.

"ఏంది చెప్పేది? మా అన్న పదేళ్ళనుండి పెరంబూర్ పటాలంలో అన్నం పులుసు యాపారం చేసుకుంటున్నాడు. ఎక్కడనుండి వచ్చిపడ్డారో యీ యిద్దరూ వచ్చి అదే

యాపారం అక్కడ పెట్టారు. మా అన్న యాపారం దెబ్బ తింది. ఈళ్ళతో తగూ ఏసుకున్నాడు. అంతే-రాత్రి నుండి ఆపడటంలేదు. మా వదిన ఏడుస్తుంటే ఎతికేదానికి వచ్చినా" ఏడుస్తూ చెప్పాడు.

కేసు తేలిపోయింది.

నంబి శవాన్ని వద్దన్నాడు.

పోలీసులు తమ వేన్‌లో మూడు శవాల్ని వేసుకొని వెళ్ళిపోయారు.

చిలక తమ యజమానులకోసం గూటిలో కొట్టుకుంటు న్నది.

అంబుజం ప్రక్కన అన్నం చిప్ప బోర్లిస్తూ ఇప్పుడు నంబి వున్నాడు. ఇప్పుడు అంబుజం అందం పెరిగింది. వ్యాపారం అంతకన్నా ఎక్కువగా పెరిగింది. □

బ్యాంక్ - డబ్బు

ఒక అప్పులాప్‌ని బజార్లో నిలదీశాడు రామారావ్.

"బ్యాంక్‌లోంచి డబ్బు తియ్యాలి. రేపు నీ అప్పు తీర్చేస్తాన్లే" అన్నాడు అప్పులాప్.

"ఎప్పుడు నా బాకీ అడిగినా బ్యాంక్‌నుండి తియ్యాలి, తియ్యాలి అనే అంటున్నావ్. త్వరగా తీసి ఇచ్చేయ కూడదూ?" అంటూ చిరాకుపడ్డాడు రామారావు.

"నాకూ త్వరగా తీసి యిచ్చేయాలనే వుంది. కాని తీసే టప్పుడు పట్టుకుంటారేమోనని భయపడుతున్నాను" అనాడు అప్పులాప్.

—కె. సీతాదేవి, శ్రీకాకుళం.

ప్రతాప రవిశంకర్

కన్నా ఇచ్చిన ఉత్తరం

కళ్ళు తెరిచాను. గుడ్డిగా వెలుగుతున్న లైటు గది మధ్యగా వ్రేలాడుతూ కనిపించింది.

"గుడ్! మెలకువ వచ్చిందన్నమాట" బొంగురు గొంతు వినిపించింది.

చటుక్కున మంచం మీదనుంచి లేచి కూర్చున్నాను. నా ఎదురుగా ఇనుప కుర్చీలో కూర్చున్నాడతను. ఫుల్ సూటులో వున్నాడు. మొహంమీదకు వచ్చిన ఫెల్ట్ హేట్, గుబురుగా పెరిగిన మీసాలు అతని చేతిలో చుట్ట ఎర్రగా వెలుగుతోంది.

"ఎవరు మీరు? నన్ను యిక్కడికి ఎందుకు తీసుకు వచ్చారు?" అడిగాను.

నవ్వాడతను. డబ్బాలో రాళ్ళువేసి మోగించినట్లని పించింది.

"నేనెవరో నీకు చెప్పినా తెలీదు సుందర్రావ్....నిన్ను ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చింది చెప్పం" అన్నాడతను చుట్ట నోట్లో పెట్టుకుంటూ.

"మీరెవరో తెలీకపోయినా మిమ్మల్ని పిలవాలంటే మీ పేరు తెలియాలి గదా చెప్పండి" అన్నాను.

"ఆల్ రైట్....ఎక్స్ అనుకో" అన్నాడతను గుప్పున పొగ బయటకు వదులుతూ.

"ఇక్కడ నన్ను ఎన్ని రోజులు వుంచుతారు'" అడిగాను. దానికూడా మిస్టర్ ఎక్స్ సరయిన జవాబు చెప్ప డని నాకు తెలుసు.

"చెప్పలేం....మా బాస్ ఎన్నిరోజులు వుంచమంటే అన్ని రోజులు వుంచుతాం" అన్నాడు.

"మీ బాస్ ఎవరు?"

"ఇలాంటి ప్రశ్నలకు రిప్లయ్ ఇవ్వనని కూడా తెలిసి అడుగుతున్నావ్. అయినా చెబుతాను. మా బాస్ మిస్టర్ జీరో" అన్నాడతను చుట్టపొడి రాల్చుతూ.

తర్వాత నేనేమీ మాట్లాడలేదు. గదిని పరిశీలించాను. చిన్న గది. గోడకు ఎత్తుగా ఓ చిన్న కిటికీ. కిటికీలోనించి

సన్నగా వెలుతురు లోపలకు పడుతోంది.

గదిలో ఓ మూలగా ఓ చెక్కబల్ల వుంది. దానిమీద ఏదో న్యూస్ పేపరు, ఓ కూజా, దానిమీద ప్లాస్టిక్ గ్లాసూ వున్నాయి. నా మంచానికి ఎదురుగానే మూసివున్న తలుపులు కనిపించాయి. తలుపులు దగ్గరకు వేసివున్నాయి.

నేను ఏదో అడగబోయాను అతన్ని.

ఇంతలోనే ఎక్కడో ఫోన్ మోగిన చప్పుడు వినిపించింది.

అతను గబుక్కున తలుపులను తెరచుకొని బయటకు వెళ్లాడు. బయట గొళ్ళెం పెట్టిన చప్పుడు వినిపించింది.

నాకు అంతా అయోమయంగా తోచింది. ఈ మనుషులు ఎవరో నన్ను ఎందుకు తీసుకొచ్చి ఈ గదిలో బంధించారో ఎంత తల బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు.

రాత్రి పన్నెండు గంటలప్పుడు ఏదో చప్పుడు వినిపించి కళ్ళు తెరిచాను. నా బెడ్ పక్కనే యమదూతల్లాగా వున్న ఇద్దరు మనుషులు కనిపించారు. భయమేసింది. అరవబోయాను.

ఇంతలో ఒకడు నా నోరు నొక్కేశాడు. ఇంకొకడు జేబులోంచి కర్చీఫ్‌ను బయటకుతీసి నా ముక్కు దగ్గర నొక్కిపట్టి వుంచాడు. అంతే. నాకు తల తిరిగినట్టనిపించింది. స్పృహ పోయింది. మళ్ళీ మెలకువ వచ్చేసరికి ఇక్కడ వున్నాను.

తలుపులను తెరుచుకుని అతను లోపలకు వచ్చాడు. ఈసారి అతని చేతిలో చుట్టలేదు. పెన్నూ ఓ తెల్లకాగితం వున్నాయి.

"ఫోన్ మోగిన చప్పుడు నీకు వినిపించే వుంటుందనుకుంటాను. బాస్ ఫోన్ చేశాడు. నీచేత నువ్వు వూరికి

వెళుతున్న కారణంగా పదిరోజులు ఆఫీసుకు లీవ్ పెడుతున్నట్టు లెటర్ రాయించమన్నాడు" అన్నాడతను బల్లను నా దగ్గరగా లాగి.

"ఎందుకు" అడిగాను.

"తెలీదు....బాస్ చెప్పినట్టు చెయ్యటమే మా పని. నీ పని కూడా అంతే. నేను చెప్పినట్టు లెటర్ రాసివ్వు" అన్నాడతను కలాన్ని నా చేతికి ఇస్తూ.

"నేను రాసివ్వకపోతే ఏం చేస్తారు?"

"ఏమయినా చేస్తాం. మేము చెప్పినట్టు చేయించుకోటానికి ఎన్నో మార్గాలు వున్నాయి."

"ఏమిటా మార్గాలు?" అడిగాను.

"నీతో నాకు మాటలు అనవసరం. నేను చూపులకు కనిపించినంత మంచివాడిని కాను. నాకు ఓర్పు కూడా చాలా తక్కువ. ముందు నేను చెప్పినట్టు లెటర్ రాయి" అన్నాడు.

"నేను రాయను" అన్నాను మొండిగా.

"నువ్వు ఇలాంటి ఫూల్ వనుకోలేదు" అన్నాడతను ప్యాంటు జేబులోని చిన్న కత్తిని బయటకు తీసి.

కత్తి చూడగానే నాకు భయమేసింది.

వెంటనే అతని చేతిలోనుంచి పెన్ తీసుకొని అతను కోరినట్టుగా లెటర్ రాసి ఇచ్చాను.

"గుడ్ ఫెలో" అన్నాడతను నవ్వుతూ! నవ్వినప్పుడు అతని పళ్ళన్నీ బయటకు వచ్చాయి.

"ఇప్పుడయినా యిదంతా ఎందుకు చేస్తున్నారో చెబుతారా!" అడిగాను.

"సారీ!" అన్నాడతను బయటకు వెళ్ళబోతూ.

"నాకు సిగరెట్లు కావాలి" అన్నాను. మెలకువ వచ్చిన

దగ్గర్నుంచీ సిగరెట్టు కాల్చకపోవడంవల్ల పిచ్చెక్కినట్టుగా వుంది.

"వస్తాయి" అని వెళ్ళిపోయాడు మిస్టర్ ఎక్స్ ఆ గది లోనించి.

ఐదు నిమిషాల తర్వాత తలుపులను విసురుగా నెట్టుకొని నన్ను ఎత్తుకొచ్చిన యమదూతల్లో ఒకడు లోపలకు వచ్చాడు. వాడి చేతిలో రెండు గోల్డుఫ్లేక్ సిగరెట్టు పెట్టెలున్నాయి. ఓ అగ్గిపెట్టె కూడా వుంది.

వాడు వాటిని బల్లమీద వుంచి వెనక్కు తిరిగాడు.

"వన్ మినిట్" అన్నాను సిగరెట్టుపెట్టె సీలు విప్పుతూ.

"ఏమిటి!" అన్నాడు వాడు తలుపుల దగ్గరకు వెళ్ళి.

"ఇది రాత్రా? పగలా?" అడిగాను.

"చీకటి గదిలో వున్నవాడికి రాత్రయితేనేం పగలయితేనేం?" అని వెళ్ళిపోయాడు యమదూత. మళ్ళీ బయట గొళ్ళెం పెట్టిన చప్పుడయింది.

వీడికీ తెలివితేటలున్నాయే అనుకుంటూ సిగరెట్టు ముట్టించుకొని ఆత్రంగా గుండెలనిండా పొగ పీల్చాను.

2

ఈసారి రెండో యమదూత లోపలకు వచ్చాడు. వాడు వూరికే రాలేదు. భోజనం తీసుకు వచ్చాడు.

బల్లమీద వుంచి బయటకు వెళ్ళిపోయేడు ఏమీ మాట్లాడకుండా.

నాకు కడుపులో కుందేళ్లు పరుగెత్తుతున్నాయి.. ఆకలి మండిపోతోంది. మొత్తానికి నన్ను ఎందుకు బంధించినా వీళ్ళ మర్యాదలు బాగానే వున్నాయనుకుని భోజనం మీదకు ఎగబడ్డాను.

బాగా రుచిగా వున్నాయి పదార్థాలు. గబగబా తినేశాను



ఆకలికొద్దీ. పది నిముషాల్లో మొత్తం ఖాళీ చేశాను. చెయ్యి కడుక్కుని సిగరెట్టు ముట్టించాను.

రెండు దమ్ములు లాగేసరికి భోజనం తీసుకువచ్చిన వాడు లోపలకు వచ్చాడు. నేను అప్పటికే తినడంముగించి హుషారుగా సిగరెట్టు కాలుస్తూండటం చూసి "అప్పుడే అయిపోయిందా? బాగా ఆకలిమీద వున్నట్టున్నావే" అన్నాడు.

"అవునోయ్" అన్నాను చనువుగా.

వోయ్ అన్నందుకు నా వయిపు గుర్రుగా చూసి కారియర్ బయటకు తీసుకువెళ్లాడు వాడు.

వాడు వెళ్లిన ఐదు నిమిషాలకు మిస్టర్ ఎక్స్ వచ్చాడు.

"భోజనం బావుందా?" నవ్వుతూ అడిగాడు.

"వండ్రఫుల్....చాలా బావుంది....థాంక్స్" అన్నాను నేనూ నవ్వుతూ.

"నో మెన్షన్....నువ్వు మా అతిథి. నువ్వు బుద్ధిగా చెప్పినట్టు విన్నంతవరకూ ఇక్కడ నువ్వు ఏది కోరితే

అది వస్తుంది. వినకపోతేనే ఎటొచ్చీ చిక్కులో పడతావ్. బై ది బై మరో విషయం. నువ్వు మీ మామగారి ఎడ్రసు చెప్పాలి" అన్నాడు ప్యాంటు జేబులోనుంచి చిన్న డైరీ బయటకు తీసి. దానికే పెన్సిల్ కూడా వుంది.

నాకు చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది. నా మామగారి ఎడ్రసు వీళ్ళకెందుకూ?

"ఆయన్ను కూడా బంధిస్తారా తీసుకొచ్చి?" అడిగాను.

"నువ్వు జోకులు కూడా కట్ చేస్తున్నావ్. మేమంటే నీకు భయం పోయిందన్నమాట" అన్నాడు మిస్టర్ ఎక్స్ చుట్ట వెలిగించుకుంటూ.

"మీరు చాలా మంచివారని గ్రహించాను. మంచి వాళ్ళను చూసి భయపడవలసిన అవసరం లేదు. చెప్పండి మా మామగారి ఎడ్రసు యెందుకు?" అడిగాను.

లైటర్ని ఆర్పి జేబులో పడేసుకొంటూ "ఈ ప్రశ్నకు మాత్రం నేను జవాబు చెప్పగలను. నీ భార్య నువ్వు ఇంట్లోనే వున్నావనుకొని ఇంతదూరం శ్రమపడి పుట్టింటి నించి రాకుండా నువ్వు ఆఫీసు పనిమీద శ్రీహరికోట వెళుతున్నట్టూ పది రోజులదాకా తిరిగిరావటానికి కుదర నట్టూ ఓ టెలిగ్రామ్ కొడతాము నీ పేర్న" చెప్పాడు మిస్టర్ ఎక్స్.

ఇదన్న మాట ఎక్స్ ఐడియా అనుకున్నాను. ఎలా అనుకున్నా ఎక్స్‌కి మామగారి ఎడ్రసు ఇవ్వక తప్పలేదు. ఎడ్రసు ఇవ్వకపోతే నేను ఎక్కడ వున్నదీ తెలియక బేజారయిపోతుంది నా భార్య.

"థాంక్స్" అని వెళ్లిపోయాడు ఎక్స్.

ఇరవై నిమిషాల తర్వాత లోపలకు వచ్చాడు. అతని చేతిలో టేప్‌రికార్డర్ వుంది.

"నీకు ఈ గదిలో బోర్ కొడుతుందేమో....అందుకే ఈ టేప్‌రికార్డర్ తీసుకు వచ్చాను. ఎంతకీ నిద్ర పట్టక పోతే ఈ గార్డినాల్ టాబ్లెట్స్ వేసుకో" అంటూ వాటిని బల్లమీద వుంచి గుడ్‌నైట్ చెప్పి టకటకా బూట్లు చప్పుడు చేసుకుంటూ వెళ్ళిపోయాడు మిస్టర్ ఎక్స్.

3

ఉదయమే మొదటి యమదూత టిఫిన్, కాఫీ తీసుకు వచ్చాడు. ఐస్‌క్రీమ్‌లా వున్న వేడివేడి ఇడ్లీలు, పెసరట్టూ.

టిఫిన్ కూడా బాగా రుచిగా వుంది. వీళ్ళు ఎక్కడ తీసుకు వస్తున్నారో యీ వంటకాలు కనుక్కొని నన్ను వదిలేసిన తర్వాత రోజూ అక్కడికే వచ్చి టిఫిన్ చేద్దామని పించింది.

కాఫీ కూడా తాగిన తర్వాత రెండో యమదూత మరో నాలుగు సిగరెట్టు ప్యాకెట్లూ, ఓ వక్కపొడి పొట్లాం, న్యూస్‌పేపరు తీసుకువచ్చి ఇచ్చి పోయాడు.

సిగరెట్టు కూడా వెలిగించుకోకుండా గబగబా పేపర్ చదివాను.

నాగుండె ఆగినంత పనయింది-మొదటి పేజీలో తాటి కాయలంత అక్షరాలతో వున్న ఆ వార్త చదవగానే.

'ప్రముఖ సైంటిస్టు బెనర్జీ అంతర్ధానం' అనివుంది.

వేగంగా చదివాను.

బెనర్జీ క్రితంరోజు రాత్రినించి కనిపించకుండా పోయా డని, ఎవరో ఆయనను ఎత్తుకుపోయివుంటారనీ, పోలీ సులు దర్యాప్తు చేస్తున్నారనీ అందులో రాసివుంది.

ఇక నా మనసు నిలవలేదు. బెనర్జీ మా దాంట్లోనే అంటే డిఫెన్స్ లాబొరేటరీస్‌లో పనిచేస్తున్నాడు సైంటిస్టుగా.

ఆయన వున్నట్టుండి ఎలా మాయమయ్యాడు?

ఎవరు మాయంచేసి వుంటారు?

వెంటనే నా అనుమానం మిస్టర్ జీరో మీదికి మళ్లింది. మిస్టర్ జీరో ఏక్స్‌కి బాస్. వాళ్ళే నన్ను మాయం చేసినట్టుగానే బెనర్జీని కూడా మాయంచేసి ఎక్కడో బంధించి వుంటారనుకున్నాను.

బెనర్జీ ఈమధ్య అతి తక్కువ ఖర్చుతో ఎంతో శక్తివంతమయిన అణుబాంబులను తయారుచేసే విధానాన్ని కనుగొన్నాడు. అయితే ఆయన తన పరిశోధనా ఫలితాన్ని పూర్తయిన తర్వాతగానీ ఎవ్వరికీ చెప్పలేదు. అప్పటికే ఆయన ఆ పరిశోధన తాలూకు ఫార్ములాని తగలబెట్టేశాడు. వాటిని తయారుచెయ్యడం ఆయన ఒక్కడికే తెలుసు. అందుకోసమే ఆయన్ను మాయం చేసివుంటారనుకున్నాను.

నేను ఇలా అనుకుంటున్నప్పుడే తలుపు తెరుచుకుని మిస్టర్ ఎక్స్ లోపలకు వచ్చాడు.

"సైంటిస్ట్ బెనర్జీని మాయంచేసింది మీరేకదూ?" కోపంగా అడిగాను.

ఆశ్చర్యంగా నాకేసి చూశాడు ఎక్స్.

"మాట్లాడరేం?" అన్నాను.

"నీకు చెప్పం" అన్నాడు ఎక్స్ నవ్వుతూ.

అతని నవ్వు నాకు పుండుమీద కారం చల్లినట్టు అనిపించింది.

"పేపర్లో అనేకం రాస్తారు. వాటిని చదివి మతిపోగొట్టుకో వద్దు" అని బయటకు వెళ్లిపోయాడతను.

అప్పటివరకూ ఎట్లాగో ఆ గదిలో వాళ్ళ బందీగా వుండగలిగాను గానీ బెనర్జీ మాయమయినాడన్న వార్త

చదివిన తర్వాత ఇక క్షణంకూడా నాకు అక్కడ వుండ బుద్ధికాలేదు. ఎట్లాగయినా ఏదో ఒక సాహసం చేసైనా అక్కడినించి తప్పించుకుని వెళ్లిపోదామనుకున్నాను.

అలా అనుకున్నదే తడవుగా మంచంమీదినించి లేచి వెళ్ళి తలుపులమీద దబదబా బాదాను. రెండునిమిషాల తర్వాత గొళ్ళెం తీస్తున్న చప్పుడయింది.

వెంటనే తలుపుచాటుకు నక్కాను.

తలుపులు తెరుచుకున్నాయి. రెండో యమదూత లోపలకు వచ్చాడు.

ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా రెండు చేతులతో వాడి వెన్నుమీద కొట్టాను. వాడు ముందుకు బోర్లా పడి పోయాడు. వెంటనే బయటకువచ్చి తలుపులకు గొళ్ళెం పెట్టి ముందుకు పరుగుదీశాను వరండాలోనించి.

ముందు విశాలమైన ఖాళీ ప్రదేశమంతా గడ్డితో నిండి వుంది. కొంచెం దూరంలో ఇనుపగేటు. చుట్టూ ఎత్తయిన గోడలు. గేట్లోనించి పొలాలు కనిపిస్తున్నాయి. అది ఏ ప్రాంతమో వూరికి ఎటువైపున వున్నదో తెలీలేదు.

ఏమాత్రం ఆలోచించకుండా రివ్వున పరుగెత్తి గేటు దగ్గరకు వెళ్ళి పైకెక్కబోయేను.

ఇంతలో నా వెనుకనించి "హేండ్సప్" అని అరుపు వినిపించింది. తల తిప్పి చూసాను. వరండాలో నిలబడి వున్నాడు మిస్టర్ ఎక్స్. అతని చేతిలో పిస్తోలు సరిగ్గా నా వయిపుకే గురిపెట్టబడివుంది.

"నువ్వు పారిపోలేవు. పిచ్చివేషాలు మాని నీ గదికి నువ్వుపో" అన్నాడు ఎక్స్. అవివేకంతో ప్రాణాలు పోగొట్టుకోవడం ఇష్టంలేక అవకాశం దొరికినట్టే దొరికి చేజారి పోయినందుకు బాధపడుతూ నా గదివయిపు

నడిచాను.

తలుపులను లాగుతున్నాడు లోపలనున్న యమదూత గాడు. గొళ్ళెంతీపి లోపలకు అడుగుపెట్టాను. అంతే. నా దవడ పేలిపోయింది. నామీద విరుచుకుపడ్డాడు వాడు.

"మస్తాన్....గెటప్ .... బయటకురా" ఆజ్ఞాపించాడు ఎక్స్. యమదూతగాడు ఎక్స్ అలా అనగానే అయిష్టం గానే నన్నువొదిలి బయటకు వెళ్ళాడు. తర్వాత తలుపులు బంధించారు.

వాడు కొట్టిన దెబ్బకు నా ప్రాణం పోయినట్లనిపించింది. ఏడుపు వచ్చినంత పనయింది. పళ్ళుకూడా కదిలిపోయాయి.

బాధతో మంచంమీద వాలిపోయాను. ఆరాత్రి నాకు భోజనం తీసుకువచ్చినా తినలేదు. అలాగే మంచంమీద పడివున్నాను. ఎప్పుడు నిద్రపట్టిందో నాకు తెలీదు.

ఒక రాత్రివేళ పిస్తోలు పేలిన చప్పుడుతో మెలకువ వచ్చింది.

మంచంమీద లేచి కూర్చున్నాను. ఎవరో పరుగులు దీస్తున్నట్టు బూట్ల చప్పుడు వినిపించింది.

తర్వాత మళ్ళీ పిస్తోలు పేలింది. నాకేమీ అంతుబట్టలేదు ....ఎవరు పిస్తోలు పేలుస్తోంది? పరుగులు తీ స్తున్నది ఎవరు?

లేచి నిలబడ్డాను. నిలబడగానే గది తలుపులు తెరుచుకున్నాయి. పోలీస్ ఇన్‌స్పెక్టర్ లోపలకు వచ్చాడు. "రండి సుందర్రావుగారూ" అన్నాడు సంతోషంగా.

నాకు చెప్పలేనంత సంతోషం కలిగింది. మొత్తానికి ఈ స్థావరాన్ని పోలీసులు తెలుసుకున్నారనమాట.

బయటకు వచ్చాను ఇన్‌స్పెక్టర్‌కు కృతజ్ఞత చెప్పుకొని. ఇద్దరు యమదూతలూ నలుగురు పోలీసుల మధ్యవున్నారు. వాళ్ళ చేతులకు బేడీలు వున్నాయి.

పసివాడి ప్రాణాలు

అజీజ్

“కూర్చోండి! ఖైదీని పిల్చుకొస్తాం!” అన్నాడు జైలు వార్డెన్ నన్ను విజిటర్స్ రూంలో కూర్చోబెడుతూ.

బెంచీమీద చతికిలబడి, సిగరెట్ అంటించేను. సెషన్ కోర్టులో జయదీప్ మీద విచారణ ప్రారంభం కావడానికి మూడు రోజుల వ్యవధే వుంది. తన కేసు వాదించడానికి

వాడు నన్ను యెన్నుకున్నాడని తెలియగానే రవంత ఆశ్చర్యం వేసింది నాకు!

కారణం, వాడి చేతిలో ఇప్పుడు చిల్లి కానీలేదు. నా ఫీజు యెలా చెల్లిస్తాడు. అలాగని వాడు పూర్తిగా జోలె జోగులనుకోడానికి వీల్లేదు. ఇప్పుడు వాడి ఆధీనంలో నాలుగు లక్షల రొక్కం వుంది. ఐతే, అందులోంచి వాడు అర్ధణాకూడా అందుకునే అదృష్టంగానీ, అవకాశంగానీ ఇప్పుడప్పుడే లేవు.

ఆ నాలుగు లక్షలూ వాడెక్కడో దాచేసి వుంటాడు. అరెస్టయ్యాక పోలీసులు యెన్ని చిత్రహింసలు పెట్టినా, పెదవి కదిపి ఆ డబ్బు ఊసెత్తలేదు. హింసించిన పోలీసులే విసిగిపోయారుగానీ, వాడికి చీమకుట్టినట్టు కూడా లేదుట! మరిన్ని హింసలుపెట్టి ఆ రహస్యం కనుక్కుందామని పోలీసులకు పట్టుదలగా వున్నా, ఆ దెబ్బలకు వాడు పుటుక్కున యెక్కడ గుటుక్కుమంటాడోనని చేతులేత్తేశారు. ఈమధ్య పోలీసు కస్టడీల్లో చచ్చిన వాళ్ళగురించి దేశవ్యాప్తంగా అనేక తీవ్ర సంఘటనలు జరగనే జరిగాయి మరి!

అందుకే వాళ్ళు విసిగ్గివేసారి ఆ డబ్బుగురించి వాణ్ని అడగడం మానేశారు. ఐతే, అనుమానం వున్న ప్రదేశాన్నల్లా పెళ్ళగించడం మాత్రం ఇంకా మానలేదు. ఆ ప్రయత్నాలన్నీ విఫలమైనా, వాళ్ళకు మరో చివరి ఆశా కిరణం కూడా లేకపోలేదు.

శిక్ష అనుభవించి జయదీప్ జైల్లోంచి విడుదలవగానే నీడలా వాణ్ని వెంబడించి, ఆ డబ్బు దాచిన స్థలానికి జేరుకోవచ్చు. ఈ ఆశమీదే ధనం స్వాధీనం కాకున్నా వాడిమీద కిడ్నాపింగ్, బ్లాక్మైలింగ్ నేరాలు మోపుతూ

ఛార్జిషీట్ దాఖలు జేశారు.

పదిహేను రోజుల క్రితం మద్రాసు చుట్టుపక్కల వాడి పేరు ప్రచురించని పత్రికలేదు. వాడుచేసిన నేరం అటు వంటిది మరి! మద్రాసులో బాగా పేరుపడ్డ ప్రముఖ పారిశ్రామిక వేత్త అయిన పాంచజన్యగారి కనిష్ఠ పుత్రుడు పన్నెండేళ్ళ గోపీని కిడ్నాప్‌జేసి, నాలుగు లక్షలు డిమాండ్ జేశాడు ఏకంగా! ఆ డబ్బు చెల్లించని పక్షంలో కుర్రాడి శవాన్ని కానుకగా పంపుతానని బెదిరించాడు.

ఎంగిలిచేత్తో కాకిని కూడా తరమడాని కిష్టపడని పరమ లోభిగా పాంచజన్యకు మంచిపేరు ప్రఖ్యాతులున్నాయి ఆ చుట్టుపక్కల. అటువంటి పసినిగొట్టు నాలుగు లక్షలకు నీళ్ళొదులుతాడా? ససేమిరా వల్లకాదని చెప్పేశాడు.

దాంతో, జయదీప్ అతనికి ఫోన్‌జేసి, ఫలానా రోజు వరకూ గడువిస్తున్నాననీ, ఆలోగా తన నిర్ణయం మార్చుకోకుంటే కుర్రాణ్ని సజీవంగా కాక, శవరూపంలో చూట్టం ఖాయమనీ తెలీజేశాడు.

దాంతో, పిల్లాడి తల్లి గుండెలు బాదుకుంటూ కన్నీరు మున్నీరుగా రోదించడం ప్రారంభించింది. పోలీసులు కూడా ఆయనకు శతవిధాలా నచ్చజెప్పడానికి ప్రయత్నించేరు. డబ్బు చెల్లించ దలచుకున్నట్టు జయదీప్‌కు తెలిజెయ్యమనీ, ఆ తరవాతి తతంగం తాము చూసుకుంటామనీ, చిల్లి కానీతో సహా ఆ డబ్బు తిరిగి స్వాధీనం జేసుకుని అతని కప్పగిస్తామనీ నూరిపోశారు.

వాళ్ళంతా గట్టిగా డబ్బుకు గ్యారంటీ ఇస్తున్నప్పుడు గత్యంతరంలేక ఒప్పుకున్నాడు పాంచజన్య! జయదీప్ అతని నిర్ణయం కనుక్కోడానికి ఫోన్ జెయ్యగానే అడిగాడు డబ్బు యెక్కడ ముట్టజెప్పాలని.

నోట్లన్నీ పాత వందరూపాయల రూపంలో వుండాలనీ, సూట్ కేస్‌లో నింపి, రాత్రి సరిగ్గా పన్నెండు గంటలకు పానగల్ పార్కులోని వేపచెట్టు మొదట్లోవుంచి వెళ్లాలనీ, ఈ వ్యవహారంలో పోలీసుల జోక్యంలేదని రూఢి అయ్యేక ఆ సూట్ కేస్ అక్కణ్నించి తరలించ బడుతుం దనీ, ఆ తరవాత అందులోని నోట్లు సరిగ్గా వున్నాయో లేవో చెక్ జెయ్యబడతాయనీ, ఏమాత్రం మోసం జరిగినా, నాలుగు లక్షలకు రూపాయి తక్కువున్నా, ఆ సూట్ కేస్ లోనే కుర్రాడి అవయవాలు సర్ది తిప్పి పంపుతాననీ చెప్పేడు జయదీప్.

దాంతో పోలీసులు ప్రత్యక్ష చర్యతీసుకోడానికి వెనకంజ వేసేరు. వాడు కోరినట్టు డబ్బు ఖచ్చితంగా, ఆ ప్రదేశంలో పెట్టేసి రమ్మని, కుర్రాడు విడుదలయ్యాక వాడిద్వారా వివరాలు సేకరించి నేరస్థుణ్ని పట్టుకోవాలనీ నిర్ణయించేరు. ఆ నిర్ణయం పాంచజన్యకు రుచించకపోయినా, చేసేదిలేక దేవుడిపై భారంవేసి, అక్షరాలా నాలుగు లక్షలూ సూట్ కేస్‌లో సర్ది, చెట్టుకింద పెట్టొచ్చాడు.

అక్కణ్నించి ఆ సూట్ కేస్ మాయంకావడం, మర్నాడే కుర్రాడు నిక్షేపంగా తిరిగిరావడం ఏకబిగిన జరిగిపోయాయి. తనని కిడ్నాప్‌జేసిన వ్యక్తిని కుర్రాడు వర్ణించబట్టే వాడు జయదీప్ అయుంటాడని అంచనా వేసుకున్నారు పోలీసులు. వాడిదివరకే రకరకాల నేరాలుజేసి, అనేకసార్లు జైలు కెళ్ళిన బాపతుట! ఐతే, కిడ్నాప్ నేరానికి పాల్పడి, ఇంత పెద్ద మొత్తం కాజేయబూనడం మాత్రం ఇదే ప్రథమమట!

బహుశా, వాడీ నేరంతో నేరజీవితానికి గుడ్ బై కొట్టి బుద్ధిగా బ్రతకాలని నిశ్చయించుకునుంటాడు. ఎటొచ్చీ వ్యవహారం బెడిసికొట్టింది. కుర్రాడిచ్చిన ఆనవాళ్ళ



ప్రకారం, పోలీసులు తీవ్రంగా గాలించి, ఎట్టకేలకు జయదీప్‌ను అరెస్టుజేశారు.

నేరవృత్తిలో ఆరితేరిన జయదీప్, అంతపెద్ద మొత్తం చేజిక్కాక కూడా తనని ప్రత్యక్షంగా చూసిన, తనని స్పష్టంగా గుర్తుపట్టగల ఆ కుర్రాణ్ని సజీవంగా యెందుకు వదిలేశాడో నాకిప్పటికీ అర్థంగాకుండా వుంది.

గదిలోకి ఎవ్వరో వస్తున్న అడుగుల శబ్దంవిని, ఆలోచనలు కట్టిపెట్టి అటు చూశాను. ఇద్దరు జైలు వార్డెన్ల మధ్య లోనికి వచ్చేడు జయదీప్, అంతక్రితం వాడి ఫోటో పేపర్లో చూశాను గనక వెంటనే పోల్చుకోగలిగేను. యెటొచ్చీ వాడి గెడ్డం ఇప్పుడు కాస్త పెరిగివుంది.

నన్ను చూడగానే, "నమస్కారం సార్!" అన్నాడు చేతులు జోడిస్తూ.

తలూపి "కూర్చో" అన్నాను.

నా కెదురుగావున్న చెక్క బెంచీమీద చతికిలబడ్డాడు.

మమ్మల్ని మామానాన వదిలేసి బైటికి నడిచారు వార్డెన్లు. తలుపులు దగ్గరగావేసి వాడికెదురుగా కూర్చున్నాను.

"నీ డిఫెన్స్ లాయర్‌గా నన్ను యెన్నుకున్నావంటే, బహుశా, నాగురించి నీకు క్షుణ్ణంగా తెలిసే వుంటుందనుకుంటాను. ఇలాటి మైనర్ కేసులకే నేను ఐదువేలకి తక్కువ తీసుకోనన్న సంగతి కూడా తెలిసే వుంటుందనుకుంటాను. ఇప్పుడు నీదగ్గర చిల్లి కానీ కూడా లేదన్నది నిర్వివాదాంశం. నా ఫీజు యెలా చెల్లిస్తావ్?" అడిగేను వాణ్ని పరీక్షగా చూస్తూ.

"లాయర్‌గారూ! ప్రస్తుతం నాదగ్గర దమ్మిడీ లేదన్న మాట నిజమే. కానీ, నాలుగు లక్షల రొక్కం ఇప్పుడు నా అధీనంలో వుందన్న సంగతి అందరికీ తెలిసిందే! ఆ లెక్కన నేనిప్పుడు లక్షాధికారినన్న విషయం మీరు విస్మరిస్తున్నారు" ఇదీ వాడి జవాబు.

పక పక నవ్వకుండా వుండలేకపోయాను. "మిస్టర్ జయదీప్! నీమీద కోర్టులో ఫైనల్ ఛార్జిషీట్ దాఖలు కాబోతుంది. అందులో నీనించి ఆ డబ్బు స్వాధీనం చేసుకోలేకపోయామన్న విషయం స్పష్టంగా పొందుపర్చి వుంటారు పోలీసులు. నీవు కుర్రాణ్ని కిడ్నాప్‌జేసిన నేరం ఋజువుకావడం మాత్రం ఖాయం! ఎందుకంటే, కోర్టులో నిన్నాకుర్రాడు ఖచ్చితంగా గుర్తుపడతాడు గనక!

పోతే రెండవనేరం, ఆ కుర్రాడి తండ్రిని బ్లాక్ మెయిల్ జేసి నాలుగు లక్షల నగదు కాజేసి, పట్టుబడ్డాక ఆ డబ్బు పోలీసులకు స్వాధీనం జెయ్యలేదన్న విషయం ఋజువైతే

మాత్రం నీకు పదేళ్ళకు తక్కువ శిక్షపడదు!

ఆ శిక్ష పూర్తయ్యేసరికి నీకు నలభై ఏళ్ళు దాటతాయి. అప్పటికీ ఆ ధనాన్ని నువ్వు అనుభవిస్తావన్న గ్యారంటీ లేదు. నీమీద పోలీసులు నీడలా నిఘావేసి, నువ్వా డబ్బు దాచినచోటికి జేరగానే రంగు చేతులతో పట్టుకుంటారు."

జయదీప్ నవ్వి—"అంతపెద్ద శిక్ష పడకుండా చూట్టానికే కదా మీవంటి కొమ్ములు తిరిగిన లాయర్ని నియమించుకున్నాను. కేవలం కిడ్నాప్ కేసుమీదే నాకు శిక్ష పడేట్టూ, బ్లాక్‌మైలింగ్ కేసు కొట్టివేయబడేట్టూ మీరు ప్రయత్నించాలి. అసలా కుర్రాడి తండ్రి నాకు డబ్బు చెల్లించనేలేదనీ, నా బెదిరింపుల్ని లెక్కజెయ్యకుండా పోలీసుల సహాయం కోరి నన్ను పట్టించాడనీ వాదించాలి. వాళ్ళు నాకు డబ్బు చెల్లించినట్టు ఏమిటి ఋజువు?

ఆవిధంగా నామీద బ్లాక్‌మెయిలింగ్ కేసు కొట్టివేయబడితే, కిడ్నాప్ నేరంకింద మా అంటే మూడేళ్లు శిక్ష పడవచ్చు. కాలచక్రంలో మూడేళ్ళు దొర్లడం యెంత సేపు? విడుదలయ్యాక, నామీద నిఘావేసిన పోలీసుల్ని యెలా పల్టీకొట్టించి, ఆ ధనాన్ని యెలా కైవలం జేసుకోవాలో నాకు తెలుసు. మీ ఫీజు ఐదువేలన్నారు కదూ? యాభై వేలిస్తాను. చాలా?" అన్నాడు కంఠం తగ్గిస్తూ.

"ఆలోచన బాగానేవుంది గానీ, ఖర్మగాలి నీ అంచనా తారుమారై, కోర్టులో నా వాదన పేలవమై నీమీద రెండు నేరాలూ ఋజువైతే, నీకు పదేళ్ళు శిక్షపడితే? అన్నేళ్లూ నీకోసం ముక్కు మూసుకు జపంజేస్తూ యెదురు చూడమంటావా?"

ఏదో రహస్యం చెప్పబోతున్నట్టు కాస్త ముందుకు వంగేడు జయదీప్.

"అదే నిజమైతే నేనేం జేస్తానో తెలుసా లాయర్ గారూ?"

"ఏంజేస్తావ్?"

"నెల తిరక్కముందే జైల్లోంచి పారిపోతాను. అలాటివి వుగ్గుపాలతోనే నాకు వంటబట్టిన విద్యలు. ఇదివరకు రెండుసార్లు విశాఖపట్నం, రాజమండ్రి జైళ్ళలోంచి పారిపోయాను.... అప్పుడా డబ్బును చాలా సులభంగా స్వంతం జేసుకోవచ్చు. ఎందుకంటే, ఫలానా రోజున నేను పారిపోబోతున్నానని పోలీసులకు తెలీదుకదా, నామీద నిఘా వేసి వుంచడానికి? అప్పుడు అణాపైసలతో సహా మీ ఫీజు చెల్లించుకుంటాను."

నాకు నవ్వాగలేదు. "జైల్లోంచి పారిపోయాక, నువ్వే నన్ను కలుసుకుని ఫీజు చెల్లిస్తావా? ఇదేదో విట్టులావుంది. నీలాటివాడికో తికాణా, బిఛాణా వుంటేకదా నా బాకి రాబట్టుకోడానికి?"

"అలాగైతే నా ఇల్లు మీపేర రాసుకోండి. అప్పుడైనా మీకు తృప్తి వుంటుంది."

"నీకో యిల్లు కూడా వుందా?"

"ఔను. నుంగంబాకంలో వుంది. అమ్మితే యెంత లేదన్నా పదివేలకి తక్కువరావు. ప్రస్తుతం ఆ ఇంట్లో నా భార్యా, పదేళ్ళ కొడుకూ నివసిస్తున్నారు."

"నీకు భార్యా, పిల్లాడు కూడానా?"

"ఏం? ఉండకూడదా? నేను వాళ్ళతోకలిపి కాలం గడిపిన రోజులు బహుస్వల్పం. కొడుకంటే నాకు పంచప్రాణాలు. అడపాదడపా వాణ్ని చూడందే, నాలో ఊపిరాడదు. నా పోలికలు వాడిలో పొడసూపకుండా శాయశక్తులా జాగ్రత్త పడుతున్నాను. కాన్వెంట్‌లో చదివిస్తు

న్నాను. బాగా చదివి ఒకరోజు వాడో పెద్ద జడ్జీ కావాలని కలలు గంటున్నాను."

"నీ కలలూ గట్రా బాగానే వున్నాయిగానీ, కోరి కొరివితో తలగోక్కున్నట్టయింది నీ పరిస్థితి. డబ్బు చేజిక్కాక నువ్వా పాంచజన్య కొడుకు గోపీని విడుదల జెయ్యడం వల్లేకదా పోలీసులు నిన్ను పట్టుకోగలిగింది?"

"విడుదల జెయ్యకుండా, డబ్బుకాజేసి, కుర్రాడి పీక నొక్కి చంపేస్తే బావుండే దంటారా? భలేవారండీ! హృదయమున్నవాడెవ్వడైనా చెయ్యగలడా ఆ పని? నాకు పసివాళ్ళంటే పంచప్రాణాలు. ఊరికే అలా బెదిరించాను గానీ, ఆ పాంచజన్య నేను కోరినడబ్బు చెల్లించకున్నా, ఆ పిల్లాడికి లవలేశమైనా హాని తలపెట్టకుండా నిక్షేపంగా వదిలేసేవాణ్ణి, తెలుసా?"

"మొత్తానికి హృదయమున్న వాడివేనన్నమాట! ఇక వెళతాను. ఈ రోజు నీకేసు స్టడీజేసి, రేపు మళ్ళీవచ్చి కలుసుకుంటాను. అప్పుడు చర్చించుకుందాం అన్ని విషయాలూ!" అంటూ లేచాను.

జయదీప్ తలూపి, చేతులు జోడించాడు.

2

రాస్తున్న పైలుమూసి, రిస్టువాచీ చూసుకున్నాను.

మధ్యాహ్నం రెండు గంటలు.

భోజనం చేద్దామని లేవబోతుండగా, నౌఖరువచ్చి, "ఎవరో పాంచజన్యగారుట! మిమ్మల్ని అర్జంటుగా కలుసుకోవాలంటున్నారు బాబూ!" అన్నాడు.

నన్ను కలుసుకోడానికి పాంచజన్య వచ్చాడా? ఎందుకు? ఆకలి యెగిరిపోయింది. "పంపించు!" అన్నాను.

నౌఖరు వెళ్ళిన రెండు నిమిషాలకి, స్ప్రింగ్‌డోర్స్ తోసుకుంటూ ప్రవేశించాడు పాంచజన్య.

నలభై ఏళ్ళుంటాయతనికి. పొడుగు పొడుక్కి తగ్గ లావు. అక్కడక్కడా నెరసిన జుత్తు. కళ్ళకి రిమ్‌లెస్ కళ్ళద్దాలు.

"కూర్చోండి!" అన్నాను ఛేర్ చూపుతూ.

"మీరు జయదీప్ తరపున వాదించబోతున్నారని తెలియగానే మిమ్మల్ని కలుసుకోవాలనిపించింది. ఈ రోజు మీరు జైల్లో వాణ్ని కలుసుకున్నారటగా?" అంటూ కూర్చున్నాడు పాంచజన్య.

తలూపి, "చెప్పండి!" అన్నాను.

"ఎక్కడో దాచేసిన డబ్బును వాడీ జన్మలో అనుభవించే యోగం ఎలాగూ లేదుకదా? అలాంటప్పుడది చెదలు పాలుకాకుండా తిరిగి నాకు లభిస్తే అటు వాడికీ, ఇటు నాకూ కొంతలో కొంత మేలు జరుగుతుంది కదా!

ఆ నాలుగు లక్షల్లో నేను వాడికి లక్షరూపాయలు ఉదారంగా యివ్వదలచుకున్నాను. అంతేకాదు. రేపు కోర్టులో, వాడు నా డబ్బు నాకు అణాపైసలతోసహా తిరిగి యిచ్చేశాడని లిఖితపూర్వకంగా రాపిస్తాను. దాంతో వాడికి పడబోయే శిక్ష చాలావరకు తగ్గే అవకాశముంది.

మా అంటే మూడేళ్ళు పడవచ్చు. ఆ లక్షరూపాయలు వాడెక్కడైనా మదుపుపెడితే జైల్లోంచి విడుదలయ్యేసరికి అది రెండింతలై కూర్చుంటుంది. ఏమంటారు?"

"ఆల్‌రైట్! మీ ప్రస్తావన వాడిముందుంచుతాను. ఐనా, దీనికి వాడొప్పుకుంటాడా అన్న అనుమానం నా కుండనే ఉంది. ఆ డబ్బుకోసం వాడు పోలీసులు పెట్టిన అనేక చిత్రహింసలు సహించికూడా నోరు మెదపలేదన్న విషయం

మీరు గమనించాలి!"

"నిజమే! అయినా ప్రయత్నించండి. ఒప్పించడానికి ప్రయత్నించండి. నేను రాత్రింబవళ్ళు కష్టపడి సంపాదించిన డబ్బు అది. మనసు కలకలలాడటం సహజమే కదా? మీ కష్టానికి తగ్గ ప్రతిఫలం ముట్టజెప్పే బాధ్యత నాది!"

నవ్వుకున్నాను, లోలోపల. పాంచజన్య ఇక్కడకూడా తన పిసినిగొట్టు పాలసీ వదల్లేదన్నమాట!

"ఆల్ రైట్! మీ మాట కాదనడం దేనికి? ప్రయత్నిస్తాను" అన్నాను.

పాంచజన్య లేచి, సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

మర్నాడు ఉదయం పదిగంటల ప్రాంతంలో జైలుకెళ్ళి, జయదీప్‌ని కలుసుకున్నాను. పాంచజన్య ప్రస్తావన వివరించాను వాడికి.

అంతా విన్నవాడి మొహం జేవురించింది. "లక్షరూపాయలు కాదుకదా, రెండులక్షలిచ్చినా నేనందుకొప్పుకోను. ఆ డబ్బు నా భవిష్యత్తుకు సోపానం వంటిది. ఈ నేరంతోనే నా క్రిమినల్ లైఫ్‌కు స్వస్తి చెప్పదలచుకున్నాను. నా బొందిలో ప్రాణం ఉండగా ఆ డబ్బెక్కడదాచానో చెప్పేది లేదు" అంటూ నా వైపు అదోలా చూశాడు.

ఆ చూపుల్నిబట్టి, వాడు మరో లాయర్ని సంప్రదించడానికి ఆలోచిస్తున్నాడేమో అన్న అనుమానం వేసింది నాకు. యిలాటి యింట్రస్టింగ్ కేస్ వదులుకోవడం నా కిష్టం లేదు.

"ఆదినించీ నువ్వీ మాటమీదే నిలబడ్డావ్! దట్స్ గుడ్! పాంచజన్యతో చెప్పేస్తాను, ఇహ ఆ డబ్బుమీద ఆశ వదులుకోమని. ఈ రాత్రే నీ కేసుగురించి ప్రిపేర్ అవబోతున్నాను. అవసరమైతే మళ్ళీ వచ్చి కలుస్తాను" అంటూ

అక్కణ్ణించి బైలుదేరి, తిన్నగా పాంచజన్య యింటి కెళ్ళాను.

జయదీప్ నిర్ణయం చెప్పేశానతనికి.

అంతా విన్న ఆయనగారి కళ్ళు యెఱ్ఱబడ్డాయి ఆగ్రహంతో.

3

ఆ రాత్రి చాలా పొద్దుపోయేవరకూ ఆఫీసులో కూర్చుని జయదీప్ డిఫెన్సుకు సంబంధించిన కార్నర్ పాయింట్స్ని నోట్ జేసుకోవటంలో నిమగ్నమయ్యాను.

గోడగడియారం ఒంటిగంట కొట్టేసరికి నిదర ముంచుకు రాసాగింది. పెందరాళే లేచి పని చూసుకుందామని మేడ మీది బెడ్ రూమ్‌లోకి జేరుకున్నాను.

లైటార్పి, బెడ్ లాంప్ వెలిగించి పక్కమీద వాలానో లేదో, బాల్కనీలోకి ఎవరో దూకినట్టు "ధప్" మన్న శబ్దం వినిపించి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను.

నా గుండె ఝుల్లుమంది.

బాల్కనీగుండా గదిలో అడుగు పెట్టిందో నల్లని ఆకారం!

పొడుగు. పొడుక్కి తగ్గలావు. మొహం కనిపించకుండా తలమీదుగా నోటి చుట్టూ నల్లని గుడ్డ చుట్టుకున్నాడు.

అప్పుడు పడింది నా దృష్టి అతని చేతిమీద.

పిస్తోలు!

నల్లగా నిగ నిగ మెరుస్తున్న పిస్తోలు?!

"అరవక! కిమ్మనకుండా అక్కడే కూర్చో. నేను దొంగని కాను. నిన్ను చంపడానికంతకన్నా రాలేదు. కొన్ని ముఖ్యమైన విషయాలు నీకు చెప్పిపోదామని

వచ్చాను" అంటూ సోఫాలో కూర్చున్నాడతను.

అప్పుడు గమనించాను అతని కుడి కంటికింద వున్న కత్తిగాటుని. దట్టమైన కనుబొమలు.

జేబులోంచి నింపాదిగా సిగరెట్ పాకెట్టు తీసి, ఓ సిగరెట్ వెలిగించి "జయదీప్ తన డిఫెన్స్ లాయర్‌గా నిన్నే ఎన్నుకున్నాడుకదూ?" అడిగాడు.

తలూపాను అయోమయంగా.

"వాడ్ని నువ్వు ఎప్పుడుపడితే అప్పుడు కలుసుకో వచ్చు కదూ?"

"ఔను!"

"లక్షాధికారి పాంచజన్య దగ్గర కాజేసిన నాలుగు లక్షల రూపాయలు వాడింకా పోలీసుల కప్పగించలేదుకదూ?"

"ఔను. ఇంతకీ నువ్వు చెప్పదలచుకున్న దేమిటి?"

"ఆ నాలుగు లక్షలు నాక్కావాలి!"

"ఏమిటీ? నానా హింసలు భరించి కూడా ఆ డబ్బు వదులుకోని జయదీప్ అడగ్గానే అమ్మ అన్నం పెట్టినట్టు నీ చేతిలో గుమ్మరిస్తాడనుకున్నావా?"

"గుమ్మరించక తప్పదు కదా! కారణం లేకపోలేదు. వాడి ముద్దుల కొడుకిప్పుడు నా ఆధీనంలో వున్నాడు. కాన్వెంటునించి తిరిగి వస్తున్నవాడ్ని దార్లో బలవంతంగా ఎత్తుకెళ్ళి ఓ చోట బంధించాను.

పాంచజన్య కొడుకుని వాడు అపహరించి నాలుగు లక్షలు డిమాండ్ చెయ్యగలిగినప్పుడు, వాడి కొడుకును మరొక రపహరించి డబ్బు గుంజలేడా? వారంరోజుల్లోగా ఆ డబ్బు ఎక్కడ దాచాడో నీద్వారా నాకు తెల్పకుంటే వాడి కొడుకు చావు చాలా నికృష్టంగా, దయనీయంగా వుంటుందని హెచ్చరించు.

జాగ్రత్త! ఈ వ్యవహారం మన మగ్గురి గిరిదాటి పోలీసులవరకూ వెళ్ళిందో కుర్రాడి మీద ఆశలు వదులుకోవలసిందే! అర్థమైందా?" అన్నాడతను కర్కశంగా.

"మేమూరుకున్నా, కుర్రాడి తల్లి ఊరుకుంటుందా? పోలీసుల సహాయం కోరదూ?"

"ఆ ఏర్పాట్లేవో ముందే జేసుకుని రెడీగా వుంచాను. పోలీసుల సహాయం కోరావంటే, నీకొడుకు అవయవాలు రోజుకొకటి చొప్పున పార్సిల్ జేస్తాననీ, ముందు అరచేతులతో ప్రారంభించ బడతాయనీ హెచ్చరించాను. డబ్బు గనక నాకు దక్కకుంటే, నిజంగా జరిగేది కూడా అదే.

నేను చెప్పదలచుకున్నదేదో నీకు చెప్పేశాను. ఇహ నీ క్లైంట్‌కు ఏం చెబుతావో చెప్పుకో. వాడి నిర్ణయం కనుక్కోడానికి నేనే నీకు ఫోన్ జేస్తాను. వారం రోజులు గడువు. తరవాత పార్శిళ్ళు ప్రారంభం! వస్తా!" అంటూ

లేచాడతను.

ఎలా వచ్చాడో తిరిగి అలాగే అదృశ్యమయ్యాడక్కణ్ణించి.

అప్పుడు పడ్డాయి నా చూపులు సోఫామీద.

అగ్గిపెట్టి!

సిగరెట్ అంటించాక వాడు మర్చిపోయిన అగ్గిపెట్టి!!

వెంటనే ఓ కవరందుకుని, దాన్ని జాగ్రత్తగా అందులో పడేసి, సొరుగులో దాచేశాను.

4

ఉదయం లేవగానే హుటా హుటిన క్రైంబ్రాంచి హెడ్‌క్వార్టర్స్ జేరుకున్నాను. రాత్రి సంపాదించిన ఆ అగ్గిపెట్టిని ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి కందించి, సాధ్యమైనంత త్వరగా, దానిమీది ఫింగర్ ప్రింట్స్ తీయించి, పాత రికార్డ్సు పరిశీలించి, ఆ వేలిముద్రలు పాత నేరస్థుడికి సంబంధించినవేమో కనుక్కోమని కోరాను.

ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డికీ, నాకూ చాలా పాత పరిచయం వుంది. అవసరమైనప్పుడల్లా ఒకరికొకరం సహాయ పడుతుంటాం.

అక్కణ్ణించి తిన్నగా జైలుకెళ్ళి, జయదీప్‌కు పరిస్థితి వివరించేను.

ఆ వార్త వినగానే దిగ్భ్రాంతితో స్థాణువైపోయాడు కాసేపు.

తరవాత తేరుకుని, నుదురు కొట్టుకున్నాడు. "మైగాడ్ కలలోకూడా ఊహించని పరిణామం ఇది! నా బాబుకు ఏమైనా అయితే, ఆ దుఃఖం జీవితాంతం నన్ను చిత్ర హింసలు పెడుతూ బ్రతుకు దుర్భరంజేసి వెయ్యగలదు.

పాపిష్ఠిడబ్బు సంపాదించడానికి సవాలక్ష మార్గ

బున్నాయి. ఈ రోజు కాకుంటే, రేపు సంపాదింకోవచ్చు. పోయిన పసివాడి ప్రాణాన్ని తిరిగి రప్పించడం యెవరి తరం?

అందుకే ఓ నిర్ణయానికి వచ్చేను. ఆ డబ్బు యెక్కడ దాచానో మీకు చెప్పేస్తాను. ఆ వెధవ ఫోన్ జెయ్యగానే ఆ విషయం వాడికిచెప్పి నా బాబును రక్షించండి. నా బాబుకేదైనా జరిగితే, జైల్లోంచి పారిపోయివచ్చి, దానికి కారణమైనవారిని నిలుపునా నరుకుతాను" అంటూ ఆ డబ్బు యెక్కడ దాచాడో చాలా రహస్యంగా వివరించాడు జయదీప్.

అతనికి ధైర్యంచెప్పి ఇంటికి తిరిగొచ్చాను.

టేబిల్ మీద టెలిఫోన్ మోగింది.

రిసీవరందుకుని, "ఎస్, లాయర్ నరోత్తమరావ్ స్పీకింగ్!" అన్నాను.

"నేను, ఇన్స్పెక్టర్ రాజారెడ్డిని మాట్లాడుతున్నాను. మీరిచ్చిన అగ్గిపెట్టెమీది వేలిముద్రలు తీయించి చెకప్ జేశాను. మీ అనుమానం సరైనదే! ఆ వేలిముద్రలు పీతాంబరం అనే పాత నేరస్థుడివి. వివిధ నేరాలకుగాను యిదివరకే అనేకసార్లు శిక్షలనుభవించాడు.

దాదాపు ముప్పై యేళ్ళుంటాయి. పొడుగు. బరువు సుమారు రెండువందల పౌండ్లు. కుడి కన్ను కింద కత్తి గాటు. ఈమధ్య యిక్కడే నుంగంబాకంలో నివసిస్తున్నట్టు సమాచారం అందింది. అడ్రస్ కావాలా?"

నా కళ్ళు మెరిశాయి. "థాంక్యూ యిన్స్పెక్టర్! చెప్పండి, అడ్రస్ ఏమిటో?" అన్నాను ఉత్సాహంగా.

ఇన్స్పెక్టర్ జెప్పిన అడ్రస్ నోట్ జేసుకుని, రిసీవర్ దించాను.

కారెక్కి క్షణం వృధాజెయ్యకుండా నుంగంబాకం జేరుకున్నాను.

వీధి చివరే కారాపి దిగాను. ఇన్‌స్పెక్టర్ చెప్పిన ఇల్లు కనుక్కోవడం ఏమంత కష్టం కాలేదు. అక్కడక్కడా పెచ్చులూడిన పాత పెంకుటిల్లు అది. తలుపుమూసుంది. దానిపక్కనే కిటికీ.

లోపలినించి స్త్రీ పురుషల నవ్వులూ, పిల్లాడి కేరింతలూ వినిపిస్తున్నాయి.

అటూ యిటూ చూసి అరుగు యెక్కి కిటికీదగ్గర నిలబడ్డాను. లోపల లాంతరు వెలుగుతున్నట్టు కాంతి కనిపిస్తోంది. కిటికీ రెక్క సందుమధ్య కన్నుపెట్టి లోనికి చూశాను.

లోపల ఓ వ్యక్తి ఓ పదేళ్ళ కుర్రాడితో ఆడుకుంటున్నాడు బంతి ఎగరేస్తూ. వాళ్ళ నడుమ గోడ నానుకుని నిల్చుని నవ్వుతోంది ఓ స్త్రీ! ఆ వ్యక్తిని చూడగానే పోల్చుకున్నాను, రాత్రి ముసుగువేసుకు వచ్చి నన్ను బెదిరించింది వాడేనని!

ఆ కుర్రాడికీ, ఆ స్త్రీకీ చాలా పోలికలు కనిపిస్తున్నాయి. బంతి పట్టు తప్పి కింద దొర్లినప్పుడల్లా ఆ కుర్రాడు దాని వెంట పరిగెత్తి అందుకుంటున్నప్పుడు గమనించేను కుర్రాడి కుడికాలు కుంటి అని! పాదం కాస్త వంకర తిరిగి ఉంది.

అంటే, వీడు పీతాంబరం కొడుకన్నమాట!

ఇప్పటికే యిద్దరు కుర్రాళ్ళు అపహరించబడ్డారు. వాళ్ళ విడుదలకు నాలుగు లక్షలు డిమాండ్ జెయ్యబడింది. ఈ మూడో కుర్రాణ్ణి నేను దేనికి మాయం జెయ్యకూడదు? ఆ నాలుగు లక్షలకు తిరిగి వీడిని డిమాండ్ చేయవచ్చు. నవ్వు

కున్నాను.

5

మర్నాడు పదిగంటలకు జైలుకెళ్ళి జయదీప్‌ను కలుసుకున్నాను.

"ఆ ముసుగుమనిషి ఇవ్వాళో రేపో ఫోన్ జెయ్యవచ్చు. నీ కొడుకు విషయంలో నువ్వింక నిశ్చింతగా వుండు. వాడికే అపాయం జరక్కుండా కాపాడే పూచీ నాది" అన్నాను ధైర్యం చెబుతూ.

జయదీప్ నిట్టూర్చాడు, "ఆ వెధవ నా చిట్టితండ్రిని ఎన్ని కష్టాలు పెడుతున్నాడో ఏమో! వాడు అందరిలా మామూలు పిల్లాడయితే నాకింత వ్యధ వుండేది కాదు లాయర్‌గారూ! నా కొడుకు కుంటివాడు...."

షాక్ తగిలినట్టు ఉలిక్కిపడ్డాను. "ఏమిటీ, నీ కొడుకు కుంటివాడా? అంటే, ఒక కాలు తీసివెయ్యబడిందా?"

"కాదు. కాదు. వాడు పుట్టు కుంటి! కుడికాలి పాదం కాస్త వంకర తిరిగి వుంటుంది. ఐనా, వాడికి బంతి ఆటంటే ప్రాణం! తన అవిటితనాన్ని లెఖ్ఖచెయ్యకుండా బంతితో ఆడుకోడానికి నానా గొడవా జేస్తుంటాడు. రోజూ సాయంత్రం ఇంట్లోనే తల్లితో ఆడుకోకుండా వుండలేడు. వాడు అచ్చు తల్లిపోలికే!"

నా బుర్ర గిరగిర తిరగసాగింది!

రాత్రి నేను చూసిన కుర్రాడు జయదీప్ కొడుకేనా? వాడితోనేనా ఆ పీతాంబరంగాడు అంత ఆహ్లాదంగా బంతి ఆడింది? వాళ్ళ ఆటచూసి ఆనందిస్తూ విరగబడి నవ్వుతున్న స్త్రీ ఆ కుర్రాడి తల్లేనా?

"నీ ఇల్లు సుంగంబాకంలో వుందన్నావుకదూ? ఎక్కడుంది? ఎలా వుంటుంది?" అడిగేను సందేహ నివృత్తి

కోసం.

జయదీప్ చెప్పిన వివరాలతో నా సందేహాలన్నీ పటా పంచలై పోయాయి.

రాత్రి నేను వెళ్ళిన ఇల్లు వాడిది:

"మరొక్క ప్రశ్న! ఈ పోలికలుగల వ్యక్తి ఎవ్వరైనా తెలుసా నీకు? ఆరడుగుల పొడుగు. పొడుక్కి తగ్గ లావు. కుడి కంటికింద కత్తిగాటు...."

"మీరు పీతాంబరం గురించి అడుగుతున్నారను కుంటాను. నాకు తెలిసిన వాళ్ళలో వాడికే వుంది కుడికంటి కింద కత్తిగాటు.వాడూ నా బాపతే! రాజమండ్రి జైల్లో కాబోలు వాడితో పరిచయం కలిగింది. అక్కడే స్నేహితు లయ్యాం! ఒకటి రెండుసార్లు నా ఇంటిక్కూడా తీసికెళ్లాను వాణ్ని. ఐతే, వాడు నా భార్యవైపు చూసే చూపులు నచ్చక, వాడికీ, వాడి స్నేహానికీ ఓ నమస్కారం పెట్టేశాను...."

నా కళ్ళల్లో అంతవరకూ కమ్మివున్న మబ్బు తెరలు తొలగిపోసాగాయి క్రమక్రమంగా!

అసలు జయదీప్ కొడుకుని ఎవ్వరూ అపహరించలేదు. జయదీప్ భార్యకీ, పీతాంబరానికీ అక్రమ సంబంధం యేర్పడుంటుంది. వాళ్ళిద్దరూ కలిసి, ఆ నాలుగులక్షలు కాజేద్దామనే ఉద్దేశంతో ఈ నాటకం ఆడుంటారు. అందుకు జయదీప్‌కు తన కొడుకుమీదున్న అపారప్రేమను వజ్రాయు ధంగా వాడుకొనుంటారు.

ఇప్పుడు పిల్లవాడికి ప్రమాదం యేమీలేదు కాబట్టి, నేరుగా వెళ్ళి ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డిని కలిశాను. విషయ మంతా వివరించి, డబ్బు దాచిన రహస్యస్థలం కూడా చెప్పేసి, ఆయదగ్గర సెలవు తీసుకున్నాను. □

సీరియల్

రమణిలో అతీంద్రియ శక్తులు

(గత సంచిక తరువాయి)

దాదాపు ఓ పాతిక గుడిసలు దాటిన తర్వాత కొంచం మతల ప్రదేశంలో రెండు నిట్టాళ్ళతో వేసిన ఓ యింటి ముందు ఆగాడు ఆ కుర్రవాడు.

జీప్ శబ్దానికి గబ గబ ఆ యింటిలోనుండి ఒక వ్యక్తి బయటకు వచ్చాడు.

మెలితిరిగిన మీసాలు, తలకు చుట్టిన పట్టు తలపాగా చేతిలో గంజాయి కూర్చిన 'చిలుం' గొట్టం అతన్ని దొరగా పరిచయం చేస్తున్నాయి.

"దండాలు బాబయ్యా" అంటూ జీప్ దగ్గరకు వచ్చి వినయంగా దండం పెట్టాడు దొర.

అప్పుడప్పుడు పట్నం బాంబులు కావాలనో, దారితప్పో గూడానికిరావడం పరిపాటే! వచ్చినవాళ్ళకు చక్కటి ఆతిధ్యం యిచ్చి వారినుండి బక్షీసులు పొందడం వారికి అలవాటే!

"బాగున్నావా దొరా?" పాత పరిచయం వున్నట్లుగా పలకరించాడు రంజిత్.

తెల్లబోయి నెమ్మదిగా తలగోక్కున్నాడు దొర. ఏమీ గుర్తుకు రాలేదు. అయినా గుర్తుకురానట్లు బయటపడ కుండా "మీ దయవల్ల బాగానే వున్నాం బాబయ్యా. చాలా కాలానికి వచ్చారు" అన్నాడు.

ఫారెస్టు ఆఫీసర్ ప్రొఫెసర్‌కు ముందే చెప్పివున్నాడు. ఆ ప్రకారంగా జీప్‌లోనుండి దిగగానే రెండు సీసాల ఫారిన్ లిక్కర్, ఓ పాతిక సిగెట్లపాకెట్లుతీసి "దొరా, ఇదిగో నీకు మా కానుక" అంటూ అందచేశాడు బెనర్జీ.

ఒక్కసారిగా పాతిక సిగరెట్లపాకెట్లు చూడగానే ఆనందంతో నోటమాట రాలేదు దొరకు.

"రండి బాబయ్యా, రండి" అంటూ వరుసగా అందర్నీ తీసుకువెళ్ళి పెద్దచెట్టుకు కట్టిన ఉయ్యాలబల్లమీద కూర్చోబెట్టాడు.

వెంటనే ఎవర్నో పిలిచి ఏదో పురమాయించాడు.

మరుక్షణంలో పెద్ద పెద్ద దోనెలనిండా తేనె ప్రత్యక్ష మయింది.

"తీసుకోండి బాబయ్యా" అంటూ అందరికీ అందిం చాడు.

"మీ ప్రయాణం సుఖంగా జరిగిందా బాబయ్యా?" తేనె సిప్‌చేస్తూ అడిగాడు ధండోప్ తెగ దొర.

"ఆఁ. క్షేమంగానే జరిగింది దొరా" అంటూ దారిలో జరిగిన సంఘటనను వివరించి చెప్పాడు రంజిత్.

అది వినగానే దొర ముఖంలో రంగులు మారాయి.

"బాప్‌రే, పులి గాయపడిందన్నమాట!" అన్నాడు భయంగా.

అతని కళ్ళలో మెదులుతున్న భావాలను చూస్తూ "ఏమిటి దొరా, అంత భయపడుతున్నావు?" అన్నాడు రంజిత్.

"భయంగాక ఏముంది దొరా? ఆ పులి మనిషి మాంసా నికి అలవాటు పడింది. ఇప్పటికి నెలరోజులుగా మా గూడెంలో అల్లకల్లోలాన్ని రేపుతోంది. ఇప్పటివరకు దాదాపు పదిమంది పిల్లకాయల్ని ఎగరేసుకుపోయింది. దాన్ని చంపడానికి చేస్తున్న ప్రయత్నాలు ఎప్పటికప్పుడు వమ్ము అయిపోతున్నాయి. ఇప్పుడు మీద్వారా గాయపడిం దన్నమాట! గాయపడిన పులి ఏమి అఘాయిత్యానికి పాల్పడుతుందో ఏమో?" నిట్టూరుస్తూ అన్నాడు దొర.

"మైగాడ్! మానీటర్ అన్నమాట!" అన్నాడు బెనర్జీ. ఆ పులి గాయపడిన దగ్గరనుండి అతని గుండెలోనూ దడగానే వుంది.

"దొరా, మీరేమీ భయపడకండి. ఆ పులిని మట్టుబెట్టే పూచీ మాది. నువ్వింక నిశ్చింతగా వుండు." ధైర్యం

చెప్పసాగాడు రంజిత్.

దొర ఒక్క_క్షణం ఏదో ఆలోచించి గబగబ లోపలకు వెళ్ళి 'కొమ్ముబూరా' తీసుకువచ్చి గట్టిగా పూరించి వూదాడు.

అంతే క్షణాలమీద గూడెంలోని జనం గుంపులుగా రావడం ప్రారంభించారు.

అంతా వచ్చిన తరువాత ఎలుగెత్తి చెప్పాడు దొర.

"అంతా అప్రమత్తంగా వుండండి. పట్నంబాబుల చేతిలో పులి గాయపడిందట! గాయపడిన పులి ప్రమాద కరమైంది" హెచ్చరించాడు దొర.

ఆ హెచ్చరిక వింటూనే ఎవరికివారు భయకంపితులై యిళ్ళకు నడిచారు.

వాళ్లందరి కళ్ళలో మెదులుతున్న భయాన్నిచూసి 'ఆ మానీటర్' వారినెంత కంగారు పెట్టిందో అర్థం చేసుకున్నారు ప్రొఫెసర్ బృందం.

"బాబయ్యా! ప్రయాణంలో అలసిపోయుంటారు. విశ్రాంతి తీసుకోండి. తెల్లవారిన తర్వాత మాట్లాడు కుందాం" అంటూ మరో మాటకోసం కూడా ఎదురు చూడకుండా ముందుకు నడిచాడు దొర.

"బహుశా, కాపలాను పర్యవేక్షించడానికి వెళ్ళి వుంటాడు!" అన్నాడు బెనర్జీ.

కమ్మని తేనె కడుపులో పడగానే కళ్ళు మూతలు పడ సాగాయి అందరికీ.

ప్రయాణంలో అలిసివున్నారేమో, అంతా విశ్రాంతిగా అ బల్లమీదనే నడుం వాల్చారు.

చటుక్కున మెలుకువ వచ్చింది రంజిత్‌కు.

మెల్లగా కళ్ళువిప్పి వాచీ చూసుకున్నాడు. హెగ్డేగోలే ఎలక్ట్రానిక్ వాచ్ ఒంటిగంటన్నర టైమ్‌ను చూపిస్తోంది.

అంతా ఎవరికివారే ఆదమరిచి బల్లమీదనే పడుకొని నిద్రబోతున్నారు.

చుట్టూ చూశాడు. గాఢాంధకారం! అక్కడక్కడ వెలుగుతున్న కొవ్వు దివిటీలు చిరువెలుగును చిమ్ము తున్నాయి. గూడెంవాళ్ళు 'మానిటర్' రాకుండా కాపలా కాస్తున్నారన్నమాట! నవీన్ గురి కొద్దిలో తప్పింది. లేకుంటే యీ గూడెమునకు పట్టిన పీడ విరగడై వుండేది అనుకుంటూ మెల్లగా కళ్ళు మూసుకున్నాడు రంజిత్.

నిద్రాదేవి ఒడిలోకి జారిపోబోతుండగా కెవ్వున విన బడిన కేక, ఆ వెంటనే మనుషుల హడావుడికి ఉలిక్కిపడి లేచాడు రంజిత్.

మానీటర్ వచ్చి యెవరినో పట్టేసింది. అదే ఆ కేక! గుండెలవిసిపోయాయి రంజిత్‌కు. గాబరాగా అందర్నీ నిద్ర లోంచి లేపాడు.

గూడెంచుట్టూరా వెలుగుతున్న దివిటీలు గబగబా చేరు వయ్యాయి. అన్నీ నాయకుడి యింటివైపు రాసాగాయి.

దొర కూడా ఆ హడావిడికి నిద్రలేచి బయటకువచ్చాడు. అతనికళ్లు కోపంతో యెరుపెక్కాయి. ముఖం కందగడ్డలా వుంది.

"ఘోరం జరిగిపోయింది దొరా! మళ్ళీ ఒకడిని వేసుకు పోయింది" చెప్పాడు ఒకతను విచారంగా.

"ఎవరు?" గర్జించాడు దొర.

చెప్పారు అనుచరులు. వాళ్లు చెప్పిన దానినిపట్టి తమకు

దారి చూపించిన కుర్రవాడని అర్థంచేసుకున్నారు ప్రొఫెసర్ బృందం.

"మీరంతా ఏంచేస్తున్నారు? అసలు ఆ కుర్రాడిని యెందుకు రానిచ్చారు?" కోపంగా అరిచాడు దొర.

"వాడికి ఆయువు మూడింది దొరా. వద్దని చెబుతున్నా విన్పించుకోకుండా నాతో కాపలాకు వచ్చాడు. 'అవసరం' కోసం పొదచాటుకు వెళ్ళాడు. అంతే మా ఉసు కుర్కార్చుందేమో, అందుకుని వెళ్ళిపోయింది" విలపిస్తూ చెప్పాడొకడు. అతడు ఆ కుర్రవాడి తండ్రి అని గ్రహించారు ప్రొఫెసర్ బృందం. అతని ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోయింది రంజిత్‌కు.

"దొరా, మీరు యింతమంది వుండి ఒక పులిని ఇన్నాళ్ళుగా చంపలేక పోవడమేమిటి?" అడిగాడు రంజిత్.

దొర కోపంగా రంజిత్ వైపు చూశాడు. ఆ చూపులలో కసి, నిస్సహాయత కలసి రంజిత్‌ను కదిలించివేసింది.

"ఏం చేయమంటావ్ బాబయ్యా! మా దగ్గర తుపాకులు లేవు. బల్లాలకు, విల్లంబులకు లొంగకుండా తప్పించుకు తిరుగుతోందా మాయపులి. అప్పటికీ ఆఫీసరు బాబుకు కబురంపించాను. కానీ ఆ బాబుకు దయకలగలేదు. మా ఖర్మ యిలా రాసివుంది కాబోలు" అన్నాడు దొర.

అంతలోనే ఏదో గుర్తుకు వచ్చినట్లు రంజిత్ వైపు చూస్తూ "క్షమించండి నాబయ్యా, మిమ్మల్ని ఆఫీసరు బాబుగారే పంపించారనుకుంటున్నాను. త్వరగా ఆ పులిని చంపేయండి బాబూ!" అన్నాడు అర్థింపుగా.

అతని భావనకు రంజిత్ ఆశ్చర్యపోయాడు. ఏం మాట్లాడాలో అతనికి తోచలేదు.

చిన్నగా గొంతు పెగల్చుకొని "దొరా, మీరు పొరబడు తున్నారు. మమ్మల్ని ఆఫీసర్ పంపలేదు అసలు ఇక్కడో పులి అల్లరి చేస్తున్నదని మేము యిక్కడకు వచ్చేవరకు తెలియదు. మా స్వంత పనిమీద వచ్చాము" చెప్పాడు రంజిత్.

ఆ మాటవినగానే జావగారిపోయాడు దొర. అంత లోనే క్రోధంతో అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"హుం, ఒకళ్ళ మీద ఆధారపడటం ఎంత బుద్ధి తక్కువో యిప్పుడర్థమయింది. అయినా యీ ఖండేల్‌కు బుద్ధిలేదు. ఎన్నో క్రూరమృగాలను మట్టి కరిపించిన యీ చేతులు ఒక పులికి సమాధానం చెప్పలేక పోవడమా! ఇక ఆలస్యం చేయకూడదు. ఆ పులి బ్రతికుంటమో, నేను బ్రతికుంటమో తేలిపోవాలి." అంటూ విసురుగా బల్లాన్ని అందుకొని వేగంగా ముందుకు నడిచాడు దొర.

ఈ హఠాత్సంఘటనకు ప్రొఫెసర్ బృందంతో బాటు అంతా ఆదిరిపోయారు.

"దొరా నా మాట విను! నేను ఆ పులిని చంపుతాను. ఒక్కడే వెళ్ళకు" అంటూ అరిచాడు రంజిత్.

కానీ అతని పిలుపు గాలిలోనే కలసిపోయింది. చూస్తుం డగానే చీకటిలో కలిసి మాయమై పోయాడు దొర.

అడని తెగింపుకు ఆశ్చర్యపోయాడు రంజిత్. ఒక్క క్షణం ఏదో ఆలోచించి "సర్, అతనికి సహాయంగా వెళ తాను" అన్నాడు.

ప్రొఫెసర్ బెనర్జీ, రంజిత్‌వైపు ప్రేమగా చూశాడు.

"వెరీగుడ్ మై బాయ్! చాలా జాగ్రత్తగా వెళ్ళిరా," అన్నాడు పొరబోయిన కంఠంతో.

గబగబా జీప్ దగ్గరకు నడిచి అందులోనుండి ఫోర్

సెల్స్ టార్చ్, గన్ తీసుకొని "మిత్రులారా! మీరేమీ కంగారు పడకండి. మీ నాయకుడి రక్షణకోసం నేను వెళుతున్నాను. దయచేసి మీ రెవరూ మమ్మల్ని అనుసరించ వద్దు" అని చెప్పి దొర నడిచిన దిక్కువైపు నడక సాగించాడు రంజిత్.

దాదాపు ఓ ఫర్లాంగుదూరం నడిచినతర్వాత గానీ టార్చి రేంజ్‌లోకి రాలేదు దొర.

వెంటనే "దొరా, ఆగు!" అంటూ అరిచాడు రంజిత్.

ఆ పిలుపు వినగానే చటుక్కున ఆగిపోయాడు దొర.

గబగబ దొరను చేరుకున్నాడు రంజిత్.

"బాబయ్యా! మీరా?" ఆశ్చర్యంగా అన్నాడు దొర.

"అవును దొరా! నేనే! ఏం, మాకామాత్రం మానవత్వం లేదనుకున్నావా? పిలుస్తున్నా విన్పించుకోకుండా వచ్చేశావు. చూస్తూ చూస్తూ నిన్ను అపాయంలోకి యెలా వదలను? అందుకే నీ వెంట వచ్చాను" అన్నాడు రంజిత్

దొర కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఏం చేయను బాబయ్యా? నా కళ్ళముందే నిండు ప్రాణాలు బలయిపోతూవుంటే, నాయకుడిగా చూస్తూ వూరుకోనా? అందుకే యీ రోజు దీని అంతు తేలిపోవాలి అనుకొని బయలుదేరాను" అన్నాడు దొర.

"పద. ఆ పులి అంతు చూసే గూడానికి వెళదాం" అంటూ ముందుకు నడిచాడు రంజిత్.

ఫోర్ సెల్స్ టార్చ్ వెలుగు నేలమీద ప్రకాశవంతంగా పడుతోంది. ఆ వెలుగులో పులి అడుగుజాడలు కోసం అన్వేషణ ప్రారంభించారు యిరువురూ.

దాదాపు అరగంటసేపు అన్వేషణ సాగిన్నతర్వాత అడుగు జాడలు కనిపెట్టారు.

కళేబరాన్ని పొదలగుండా యీడ్చుకుపోవడం వలన అక్కడక్కడ పొదలపై రక్తపు చారికలు కన్పించాయి. ముళ్ళకు చర్మపు పోగులుగూడా చిక్కుకొని వుండటం కనిబెట్టాడు రంజిత్.

మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ ఆ గుర్తులను అనుసరించి వెళ్ళసాగా రిద్దరూ.

దాదాపు మూడు ఫర్లాంగులదూరం నడిచిన తరువాత హఠాత్తుగా గుర్తులు అదృశ్యమయ్యాయి.

అంటే అక్కడ సమీపంలోనే ఎక్కడో పులివేటను దాచిందన్నమాట! పులిగూడా ఎక్కడో పొంచే ఉంటుంది.

"దొరా, ఇక్కడే సమీపంలో ఎక్కడో పులి వుండి వుంటుంది. జాగ్రత్తగా చూసి అడుగులువేయండి" హెచ్చరించాడు రంజిత్.

చేతిలో బల్లెం రెడీగా పట్టుకొని అడుగులు తూచి తూచి వేస్తున్నాడు దొర.

అతని వెనుకనే టార్చి పట్టుకొని అడుగులు వేస్తున్నాడు రంజిత్. మరోచేతిలో ఏక్షణంలోనైనా సరే ప్రేలడానికి సిద్ధంగావున్న తుపాకీ ఎలర్ట్‌గా కదులుతోంది.

ఆకు కదలినా సవ్వడి విన్పించే నిశ్శబ్దం రాజ్యమేలుతోంది అక్కడ.

నడుస్తున్న దొర, ఆ వెనుకనే వస్తున్న రంజిత్ చటుక్కున ఆగిపోయారు.

టార్చి వెలుగులో ఎదురుగా కన్పిస్తున్న దృశ్యం చూడగానే ఒళ్ళు గగుర్పొడిచింది యిరువురకూ.

ఓ పొద ప్రక్కనే పులి ఎత్తుకొచ్చిన బాలుని మృత దేహం చింపివేసిన విస్తరిలా వికృతంగా అస్తవ్యస్థంగా పడి వుంది. చుట్టూ రక్తం మడుగులా కట్టింది.

చెప్పండి వింటాం!

సప్లిమెంట్‌లోని 'నీడలోని ఆడది' వసుంధరగారి నవల చాలా బాగుంది. ఈనాటి ఆడవారికి నీతిదాయకం. 'అంగారక' ముగింపు సంతృప్తికరంగా లేదు. మొత్తంమీద పత్రికలన్నిటిలో అపన ఆణిముత్యం.

—నీలకంటి రామకృష్ణ, ఎల్లారెడ్డి.

ఒకసారి కాలుజారిన ఆడది చివరకు ఎలా పతనమవుతుందో 'నీడలోని ఆడది' నవలలో సున్నితమైన హెచ్చరికా వుంది. చాలా కాలం తర్వాత 'అభిమాన రచయిత' మల్లాది వెంకటకృష్ణ మూర్తి రచన ఆసక్తిగా ఉండి ఉత్కంఠతో చదివించింది.

—యన్. సత్యానంద్, బెల్లంపల్లి.

ఈ నెల నవలల్లో ముద్దా సురేష్‌గారి 'మదరిండియా' ఎక్స్‌లెంట్. 'అంగారక' చివరిభాగం ఆశించినంతగాలేదు. అసలు దానిని వేయకుండా వుంటేనే బాగుండేదేమో అనిపించేంతగా నిరుత్సాహ పరిచింది. రక్త తర్పణం, ప్రియా ఓ ప్రియా కథలు చాలా బాగున్నాయి. కార్టూన్స్ కడుపుబ్బ నవ్వించాయి.

—ఎస్. ఎన్. రావు, గన్నవరం.

గత సంచికలో కంచర్ల రమణగారి సమాధానం, క్రింద మీ సూచన చదివాను. మీ సూచనతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. నా రచనలు తిరిగి వచ్చినప్పుడు నేనూ బాధపడినవాడినే గనుక మీ సూచన చేదు నిజంగా తోచిన వాస్తవమని ఎవరైనా అంగీకరించక తప్పదు.

—సుజనశ్రీ, నెల్లూరు.

ఈ నెల కథలన్నీ వెరైటీగా వున్నాయి. సప్లిమెంట్‌లో 'మదరిండియా' నవల చాలా బాగుంది. కొత్త శీర్షికలు ప్రవేశ పెట్టినందుకు మా ధన్యవాదాలు.

—యం. ఏ. సలీమత్తర్, మంచిర్యాల.

అజీజ్‌గారి 'రక్తతర్పణం' కథ అపనకే హైలైట్. వసుంధర గారి 'అడుగు ముందుకువేస్తే చస్తావ్' చాలా అంటే చాలా చాలా బాగుంది. —కె. సాయిక్రిష్ణ, పెద్దాపురం.

ఆ దృశ్యానికి భయకంపితులయిన యిరువురూ క్షణంలో వులిక్కిపడి తేరుకున్నారు.

'తాము యెంత అజాగ్రత్తగా తమని తాము మర్చిపోయారు! మానిటర్ సన్నిధిలో మైమరచివుండటమా?'

నెమ్మదిగా పరిసరాలను పరికించి చూశారు.

అంతటా నిశ్శబ్దం. ఎక్కడా పులివున్న జాడలు కన్పించలేదు.

ఏమయిపోయింది పులి? వేటను అలా వదిలేసి ఎక్కడకు వెళ్ళివుంటుంది!

నిశ్శబ్దనిశీధిలో అయిదు నిమషాలు కరిగిపోయాయి. అప్పటివరకు తాము నిల్చున్న చోటునుండి అంగుళం కదలలేదు రంజిత్, దొర. పులి కూడా వేట దగ్గరకు చేరుకోలేదు.

ఎంతసేపు యీ నిరీక్షణ?

కమెండో శిక్షణపొందిన రంజిత్ మాత్రం కదలకుండా అలాగే నిలబడి చీకటిలోకి కళ్ళు చించుకుని చూస్తున్నాడు. దొరలో సహనం నశించింది. చిటికినవ్రేలు చూపించి కొంచం ప్రక్కకు నడిచాడు దొర.

రెండు నిమిషాలు గడిచాయో లేదో, 'కెవ్వు' మంటూ దొర పెట్టిన పొలికేక రంజిత్ హృదయాన్ని జలదరింపచేసింది.

ఒక్కక్షణం ఉలిక్కిపడి వెంటనే సర్దుకొని కేక వచ్చిన దిక్కుకు పరుగు తీశాడు.

టార్చిఫోకస్‌లో కనబడిన దృశ్యానికి చకితుడయ్యాడు రంజిత్.

పులి!

తాము యెంతో సహనంగా నిరీక్షిస్తున్న పులి!

చెప్పుకోండి చూద్దాం?

1. ఒక సామాన్య వ్యక్తి సంతకం కన్న, ఒక పెద్ద హోదా గల వ్యక్తి సంతకాన్ని 'ఫోర్జరీ' చేస్తే శిక్ష కఠినంగా వుంటుందా?

2. పోలీసులకు గుర్తు తెలియని శవం ఒకటి దొరికింది. ఎంత ప్రయత్నించినా ఆ శవం సొంతదారులెవరో తెలియలేదు. అయితే ఆ శవాన్ని పోలీసులు ఏంచేస్తారు?

3. అతి ప్రమాదమైన నేరస్తులను జైలులో ప్రత్యేక 'సెల్'లో నిర్బంధిస్తారా?

4. హత్యచేయబడ్డ ఒక శవంయొక్క బంధుమిత్రులు కాని, పరిచయస్తులుకాని ఎవరూ తెలియరాలేదు. మరి ఆ హత్య విషయం పరిశోధిస్తారా వదిలేస్తారా?

5. రివాల్వర్‌ను ఏ లోహంతో తయారుచేస్తారు?

నిర్వహణ: కె. చందర్‌రావు.

—(౦)—

జవాబులు :

1. శిక్ష సమానంగానే వుంటుంది.

2. ఆ శవం యొక్క ఫోటో, ఐడెంటిఫికేషన్స్ తీసుకొని, శవాన్ని మున్సిపాలిటీ వారికి అప్పగిస్తారు.

3. అవును.

4. సొంతదారులున్నా, లేకున్నా హత్య విషయం దర్యాప్తు జరుగుతుంది.

5. పంచలోహాలతో.

అల్పాచమనానికి వెళ్ళిన దొరపై అదను చూసుకొని దూకింది.

ఆ హఠాత్సంఘటనకు అదిరిపోయి కెవ్వుమని కేక పెట్టినా వెంటనే తమాయించుకున్నాడు దొర. బల్లెంతో తిరగబడి పులిని ఎదుర్కొన్నాడు.

రంజిత్ అక్కడకు చేరుకునేసమయానికి కన్పించిన దృశ్యం అదే!

పులి, దొర ఒకరి నొకరు హతమార్చాలని కసిగా పోరాడుతున్నారు. పోరు తీవ్రంగా సాగుతోంది. పంజాతో దెబ్బ తీయాలని ఎగిరెగిరి దూకుతోంది పులి. మీదకు వస్తున్న పంజా దెబ్బను చాకచక్యంగా తప్పించుకుంటూ బల్లెంతో యెదురుదెబ్బ తీయాలని చూస్తున్నాడు దొర.

రంజిత్ కేమి చేయాలో పాలుబోవడంలేదు. చేతిలో తుపాకీ వుంది. కాని కాల్చడాని కవకాశం లేదు. తీరా ట్రిగ్గర్ నొక్కిన తరువాత వెలువడే గుండు దొరకే తగులు తుందో, పులికే తగులుతుందో వూహించడానికి కూడా అవకాశం లేని విధంగా పోరాటం జరుగుతుంది.

బల్లెం కస్‌మంటూ పులి యెడమ భుజంలో దిగింది. రక్తం చివ్వున బయటకు చిమ్మింది.

పులిలో క్రోధం పెరిగిపోయింది. ఎగిరి ముఖంపై పంజా విసిరింది. చటుక్కున తల పైకెత్తాడు దొర. కొద్దిలో గురితప్పిన పంజా ఛాతీని తాకింది.

అంతే, మరోసారి కెవ్వున అరిచాడు దొర. ఛాతీపై చర్మం లేచిపోయింది. పళ్ళబిగువున బాధను అణచు కుంటూ తిరిగి బల్లాన్ని పైకెత్తాడు.

అయినా పులి ముందూ వెనకా చూడకుండా రెట్టించిన క్రోధావేశంతో తిరిగి పంజా విసిరింది.

ఫారము-4

1. ప్రచురణ స్థలము	: హైదరాబాదు-29.
2. ప్రచురణ కాలము	: మాసపత్రిక.
3. ముద్రాపకుని పేరు	: శ్యామ దామోదరరెడ్డి.
జాతీయత	: భారతీయుడు.
చిరునామా	: హైద్రాబాదు-29.
4. ప్రచురణకర్త పేరు	: -డిటో-
జాతీయత	:
చిరునామా	:
5. సంపాదకుని పేరు	: -డిటో-
జాతీయత	:
చిరునామా	:
6. వార్తాపత్రికపై	శ్యామ దామోదరరెడ్డి
యాజమాన్యముగల	3-4-554 నారాయణగూడ
వ్యక్తులు, భాగస్థులు	హైద్రాబాదు-29.
పేర్లు, చిరునామాలు	: (సోల్ ప్రొప్రయిటరు.)

శ్యామ దామోదరరెడ్డి అయిన నేను, పైన తెలిపిన వివరములు నాకు తెలిసినంతవరకు, నేను విశ్వసించినంత మేరకు సత్యమైనవని, ఇందు మూలముగా ప్రకటించుచున్నాను.

శ్యామ దామోదరరెడ్డి

తేది: 2-2-79 ప్రచురణకర్త సంతకం

ఆ దెబ్బకు వెల్లకిలా పడిపోయాడు దొర. చటుక్కున అతని పైకి దుమికింది పులి.

ఏ క్షణంలోనయినా దొర మెడను కొరకడానికి సిద్ధంగా వుంది పులి. జరగనున్న ప్రమాదాన్ని గుర్తించి దైవంమీద భారంవేసి తుపాకీ గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కాడు రంజిత్.

'ధన్' మంటూ తుపాకీ ప్రేలింది. అంతే, దొర మెడ కొరకబోతున్న పులి అడుగు యెత్తు గాలిలోకి యెగిరి యెడంగా పడింది. అది లేచేలోగానే మరోసారి కాల్చాడు రంజిత్. తూటా సూటిగా వెళ్ళి పులి నుదురును తాకింది.

బాధగా అరిచి రెండు క్షణాలు అటూ యిటూ తన్నుకొని తల వాల్చేసింది పులి.

గబగబా దొరను చేరుకున్నాడు రంజిత్.

దొర శరీరంపై చాలాచోట్ల గాయాలు తగిలాయి. ఛాతీపై నుండి, చెక్కిళ్ళనుండి, భుజాలపై నుండి రక్తం ధారలుగా కడుతోంది.

గబగబ తన షర్టు విప్పి ముక్కలుచేసి రక్తం స్రవించకుండా కట్లు కట్టాడు రంజిత్.

మెల్లగా నీరసంగా పైకి లేచాడు దొర. అధిక రక్త స్రావంవల్ల కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి.

తడిగా మెరుస్తున్న కళ్ళతో రంజిత్‌ను ఆలింగనం చేసుకున్నాడు దొర.

"బాబయ్యా! యీ రోజు నా ప్రాణం కాపాడావు. నా చర్మం వొలిచి నీకు చెప్పులు కుట్టిచ్చినా యీ ఋణం తీరదు" అన్నాడు దొర.

"చాలా దారుణంగా మాట్లాడుతున్నావు దొరా. ఆ సమయంలో మానవత్వం వున్న ఏ మనిషయినా ఆ

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 6: ప్రఖ్యాత క్రికెట్ క్రీడాకారుడు కిరణ్, అందాల తార స్వర్ణ ఫోటోలు ఒక న్యూస్ పేపర్‌లో ప్రక్క ప్రక్క ప్రచురించారు. వారి ఫోటోల క్రింద వీరి వివాహం నిశ్చయమైంది అని ప్రచురించబడింది.

అసలు పడవలసిన సమాచారం స్వర్ణ ఫోటో క్రింద ఆమె వివాహం నిశ్చయమైందని. కాని పొరపాటు దొర్లింది. కిరణ్‌కు మునుపే వివాహమైంది. కిరణ్ భార్య న్యూస్‌పేపరుపై దావా వేసింది.

న్యూస్‌పేపరు పొరపాటు జరిగిందని అంగీకరించింది. కాని అలాటి పొరపాట్లు ప్రింటింగ్‌లో అప్పుడప్పుడు దొర్లుతుంటాయనీ, అసలు కిరణ్ భార్యకు దావా వేసే అధికారం లేదనీ వాదించారు.

మరి, మీ తీర్పు ఏమిటి?

నిబంధనలు: మీ తీర్పు ఒక పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, 15వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హో. డె. సభ్యులు కానివారు తమ జవాబుతో 50 పైసలు పోస్టు స్టాంపులు జతపరచాలి. మాకు వచ్చిన జవాబులలో అత్యుత్తమమైన తీర్పుకు రు. 25/-లు బహుమతిగా పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి.

గత నెల పోటీ ఫలితాలు

తీర్పు: సంజయ్ దావా నెగ్గదు.

ఈ కేసులో రాజీవ్ అప్పటికప్పుడు పొడుస్తాననలేదు. భవిష్యత్తులో మరోసారి తిడితే పొడుస్తానన్నాడు. సంజయ్‌ను మర్యాదకరంగా ప్రవర్తించేటట్లు చేయటంకోసం అలా చేశాడు. అది నేరంకాదు.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీమతి కురుమద్దాలి విజయలక్ష్మి, రచయిత్రి, 23-22-10, హనుమాన్ వీధి, సత్యనారాయణపురం, విజయవాడ-11.

మాత్రం పని చేస్తాడు. ఇందులో నా ఘనత ఏమీలేదు. ఏది ఏమయినా నిన్ను కాపాడుకోగలిగాను. అదే నాకు సంతోషంగా వుంది" అన్నాడు రంజిత్ ప్రేమగా అతన్ని అక్కున చేర్చుకుంటూ.

ఆ తరువాత ఇద్దరూ కలసి చెట్టు 'వూళ్ళ'ను కోసి పులి ముందు రెండు కాళ్ళను, వెనుక రెండు కాళ్ళను కలిపి కట్టారు.

దొర కూడా ఒక వూళ్ళను అందుకోబోతుంటే 'నీర సంగా వున్నావు, వద్దని' వారించాడు రంజిత్.

దొర టార్చిలైట్, తుపాకీ అందుకొని ముందు నడు స్తూండగా రంజిత్ రెండు వూళ్ళను భుజాన వేసుకొని మానీటర్‌ను భారంగా లాక్కొని రాసాగాడు.

బాలభానుని ప్రభాతకిరణాలు పుడమిని తాకుతుండగా రంజిత్, దొర గూడెమునకు చేరారు.

అప్పటివరకు భయాందోళనలతో నిండివున్న గూడెం ప్రజలు, ప్రొఫెసర్ బృందం రంజిత్‌ను, దొరను చూడ గానే ఆనందంతో కేరింతలు కొట్టారు.

మూడు నెలలుగా గూడెమును భయభ్రాంతంచేసిన పులి కళేబరంగా మారటం చూసి కేరింతలు కొట్టారు గూడెం జనం.

గబ గబ అక్కడి నాటువైద్యుడు ఆకుపసర్లు తీసుకొచ్చి దొర గాయాలనిండా పట్టించాడు.

కుతూహలంగా నిలబడివున్న గూడెం ప్రజలకు, ప్రొఫెసర్ బృందానికి జరిగిన సంఘటనలు వివరించి చెప్పారిద్దరూ.

"వెల్ డన్ మై బోయ్!" మనసారా అభినందించారు ప్రొఫెసర్, మిగిలిన సహచరులు.

అపరాధ పరిశోధన పోటీ-127 [ఫలితాలు]

ఫిబ్రవరి '79 నెల "అపరాధ పరిశోధన పోటీ-127" కి సరియైన సమాధానాలు :

1. పాకిస్థాన్‌తో.
2. చిలక జోస్యాలు.
3. పగటి వేషం.
4. లోక్ పరలోక్.
5. టెలివిజన్.

పై జవాబుల ప్రకారం ముగ్గురు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి ఏప్రెల్ '79 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ ఎ. రంగారావు,
1. సి. 175, ఎల్బమంజిల్ కాలనీ,
హైద్రాబాదు.
(500 004)

(2) M/s ఎస్. కె. టేలర్,
పిన్నవారి స్ట్రీట్,
వరంగల్.
(506 002)

(3) శ్రీ కె. రాజేశం,
నియర్ బ్రాందీ షాప్,
హనుమాన్ మందిర్ రోడ్,
బెల్లంపల్లి. (504 251)

పులివాత పడిన కుర్రాడి తండ్రి ఆనందం పట్టలేక అమాంతం రంజిత్‌ను యెత్తి భుజాలమీద వుంచుకొని గంతులువేశాడు.

గూడెం మొత్తం ఆనందంతో ఆరోజు పండుగ చేసుకుంది. ప్రొఫెసర్ బృందం కూడా ఆ ఆనందంలో వుత్సాహంగా పాలు పంచుకుంది.

42

దొరకు గాయాలు పూర్తిగా మానడానికి మూడురోజులు పట్టింది. ఆ రోజే కట్లు వూడతీశారు. ప్రొఫెసర్ బృందంతో కలసి పిచ్చాపాటీ మాట్లాడుతూ కూర్చున్నారు.

"ఖండేల్‌దొరా! మేమొక ముఖ్యమైన పనిమీద మీ అడవికి వచ్చాము. ఆ పని నీవల్లనే సానుకూలమవ్వాలి" చెప్పాడు ప్రొఫెసర్ బెనర్జీ.

విచిత్రంగా చూశాడు దొర.

"ఏంపని బాబయ్యా! నాకు నాకు చేతనయితే నా ప్రాణాలు ధారబోసి అయినా మీ పని సానుకూల పరుస్తాను. చెప్పండి" అన్నాడు దొర.

"నేను పురాతత్వ శాస్త్రవేత్తను ఖండేల్‌దొరా! అంటే ప్రాచీన అవశేషాల్ని అన్వేషిస్తూ వుంటాను. నాకు యీ అడవిలో ఒక చాతుర్లింగాలయం వున్నదన్న సమాచారం తెలిపింది. ఆ ఆలయం ఎక్కడుందో ఖచ్చితమైన సమాచారం కావాలి" చెప్పాడు బెనర్జీ.

"అలాంటి గుడి పేరు నేనెక్కడా వినలేదు బాబయ్యా! మా గూడెంలో మాత్రం అమ్మోరి గుడి వుంది. ఇక్కడ చుట్టుప్రక్కల చాలా గూడెములలోగూడా అమ్మోరి ఆలయాలే వుంటాయి" అన్నాడు దొర.

రెండు పొరపాట్లు?

(పాఠకుల పరిశోధన పోటీ-81 ఫలితాలు)

1. నాలుగేళ్ళ జైలు శిక్ష అనుభవించిన ఖైదీ చేతులు సున్నితంగా వుండవు. పైగా విక్రమ్ అందంగా ఆరోగ్యంగా ఉన్నాడు.

2. మరో నెల రోజుల్లో విడుదలయ్యే ఖైదీ అంత శ్రమపడి పర్మిషన్ తీసుకొని రానవసరంలేదు. అసలు రోహిణీదేవి అంగీకారం లేనిదే అధికారులు అనుమతించరుకూడా.

—ఈ కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింది ఇరువురు పాఠకులకు చెరొక రు. 25/లు బహుమతి పంపుతున్నాము.

(1) శ్రీ బి. నాగభూషణరావు, ట్రాసర్, ఐ అండ్ పి. డి., స్పెషల్ ఇన్వెస్టిగేషన్, అనంతపూర్-515 001.

(2) శ్రీమతి డి. కళ్యాణిదేవి, 137, ట్రంక్ రోడ్, సింగరాయకొండ-523 101 (ప్రకాశం జిల్లా)

సరియైన సమాధాలు వ్రాసిన పాఠకులు:

1. నందూరి శైలజ, మద్రాసు. 2. కురుమద్దాలి విజయలక్ష్మి, విజయవాడ. 3. బి. రాజేశ్వరమూర్తి, మచిలీపట్టణం. 4. ఎస్. నాగేశ్వరమ్మ, అద్దంకి. 5. గుంటూరి సూర్యకాంతం, సునాబేడా. 6. జి. బాలనర్సింహారావు, నోముల. 7. డి. అనూరాధ, నెల్లూరు. 8. మిస్. 'కిన్నెర', మల్కాజిగిరి. 9. పి.వి. శేషసాయి, సీతారాంపురం. 10. టి. ఆర్. ప్రియదర్శిని, హన్మకొండ.

11. ఆర్. సత్యక్రిష్ణవాణి, కాకినాడ. 12. శికాకొల్లు నందకిశోర్, సింగరాయకొండ. 13. కె. అమ్ములు, మలక్ పేట. 14. పి. జ్యోతిప్రియ, రాజమండ్రి.—తదితరులు.

ఆ మాటతో ప్రొఫెసర్ బెనర్జీ నరనరాలలో నీరసం ప్రాకిపోయింది. ఏమీ మాట్లాడలేకపోయాడు.

"చూడు మిత్రమా, సాధారణంగా మీ గూడెములలో అమ్మవారి ఆలయాలే వుంటాయి. అయితే మాకు కావలసినది చాతుర్లింగాలయం. అంటే, శివలింగాలు నాలుగు ప్రతిష్టించబడి వుండే ఆలయమన్నమాట! ఒక్కసారి గుర్తుకు తెచ్చుకో, ఈ అడవిలో ఆ ఆలయం ఎక్కడన్నా చూశావేమో!" విపులీకరించి చెప్పి అడిగాడు రంజిత్.

రెండు నిమిషాలసేపు కళ్ళు మూసుకొని తీవ్రంగా ఆలోచించాడు ఖండేల్‌దొర. చటుక్కున అతని మెదడులో ఏదో మెరుపు మెరిసింది.

"ఆఁ. గుర్తుకు వచ్చింది బాబయ్యా! నువ్వు విపులీకరించి చెప్పాక గుర్తుకు వచ్చింది. అలాంటి ఆలయాన్ని నేను చూశాను. ఆఁ. ఇక్కడకు దాదాపు పదిక్రోసుల దూరం వుంటుంది బాబయ్యా! ఒకసారి కాబోలు ఆ గుడిలోకి వెళ్ళాను" అంటూ ఏదో గుర్తుకు వచ్చి హఠాత్తుగా కంగారుపడిపోయాడు దొర.

"వద్దు బాబయ్యా, వద్దు. మీరు ఆ గుడిలోకి వెళ్ళడానికి నేను అంగీకరించను" అన్నాడు. ఆ మాట అంటున్నప్పుడు అతని కంఠం భయంతో వణికింది.

అతని ప్రవర్తన ప్రొఫెసర్ బృందానికేమీ అర్థం కాలేదు. 'ఆచూకీ తెలిసిందని ఆనందపడుతూంటే వెళ్లొద్దని హెచ్చరిస్తాడేమిటి?' అంతా అయోమయంగా వుంది.

"ఖండేల్‌దొరా, నీ మాటలు అర్థం కావడంలేదు. మేమెంతో ఆశతో ఆ ఆలయాన్ని దర్శించాలని వస్తే అక్కడకు వెళ్ళవద్దంటావేమిటి?" అడిగాడు బెనర్జీ కుతూహలంగా.

అపరాధ పరిశోధన పోటీ-128

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో౦. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 15-వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపాలి ఫలితాలు వచ్చే నెల సంచికలో ప్రకటిస్తాము.*

1. అలనాటి రాక్షసులను సైతం మరపింపజేసే వార్తలను యీనాడు వింటున్నాం—? (మనిషిరక్తం త్రాగే ఘనులు, పసిపిల్లలను చంపి తినే సన్యాసులు.)

2. కొందరు ఇదంటే చెవి కోసుకుంటామంటారు—? (సంగీతం, డిటెక్టివ్ సాహిత్యం.)

3. ఇది వస్తుందంటే అందరికీ భయమే—? (కేంద్ర బడ్జెట్, ఎండాకాలం.)

4. ఈ మహానాయకుని మరణం గురించి ఇప్పటికీ సందేహాలున్నాయి—? (నేతాజీసుభాష్‌చంద్రబోస్, లాల్ బహదూర్ శాస్త్రి)

5. ఇది లేనివాడికి సంఘంలో గౌరవం లేదు—? (విద్య, డబ్బు).

"అవును బాబయ్యా. మీరు ఇంతదూరం వచ్చింది ప్రాణాలు పోగొట్టుకోవడానికి కాదు. నా ఆతిధ్యం స్వీకరించిన మిమ్మల్ని చూస్తూ చూస్తూ యమలోకానికి అతిధులుగా పంపలేను" గద్గద కంఠంతో అన్నాడు దొర.

"ఏమిటి ఖండేల్‌దొరా, వివరంగా చెప్పు. అంతటి అపాయాన్ని మేము మాత్రం కోరి ఆహ్వానిస్తామా?" అనునయంగా పల్కాడు రంజిత్.

"ఆ ఆలయం పాడుబడిపోయింది బాబయ్యా. అక్కడ దయ్యాలు నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. అందుకే ఇప్పుడు అక్కడికెవరూ వెళ్ళడంలేదు. ఒకవేళ ఎవరైనా మూర్ఖించి వెళితే ప్రాణాలతో బయటకు రావడం లేదు. పాపం, అమాయక భక్తులు చాలామంది అక్కడ అసువులు కోల్పోయారు. అందుకే మిమ్మల్ని వెళ్ళవద్దంటున్నాను బాబయ్యా!" అన్నాడు దొర.

ఆ మాటలు విని డాక్టర్ మొహిత్ ఫకాలున నవ్వాడు.

"వండర్! అయితే తప్పకుండా వెడ్తాలి. నాకు దెయ్యాలను చూడాలని ఎప్పటినుండో కోరికగా వుంది" అన్నాడు డాక్టర్ మొహిత్.

"నీ మాటలకు అర్థం లేదు దొరా. దయ్యం అనేది కల్పితం. అలాంటి కల్పిత పాత్ర ఘాతుకాలు చేయడమా? అయితే తప్పకుండా వెళ్ళితీరవలసినదే!" అన్నాడు ప్రొఫెసర్ బెనర్జీ.

తన మాటలు నమ్మనందుకు కొద్దిగా ముఖం చిన్నబుచ్చుకున్నాడు దొర.

"నేను చెప్పేది విన్నమాటలు కాదు బాబయ్యా. స్వయంగా అనుభవంపొంది చెప్పిన మాటలు. ఆ దయ్యాలను చూసిన ప్రత్యక్ష సాక్షిని నేను" అన్నాడు.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి అసలు ధరకే రు. 7-00 లకు మా ఏజెంట్ ద్వారాగాని, వి. పి. ద్వారాగాని మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇందుకు అవసరమయ్యే ఖర్చు లన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 3/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంప వచ్చును. సొమ్ముచేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ, పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీ లలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి. పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 7/-లు వెంటనే **M.O.** చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము ఆంత టితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూల నున్నా కాపీలు ఖచ్చి తంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాత కాపీలు కావలసినవారు వాటి పైకం ముందుగా **M.O.** చేయాలి. ఎక్కువ కాపీలు కావలసినవారు సెట్టుకు రు. 5/-లు చొప్పున పంపితే చాలు.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 80/-లు ముందుగా పంపితే వారికి కాపీలు 'రికార్డెడ్ డెలివరీ'లో పంపగలము. దీనివల్ల మీకు ఖర్చులు కూడా కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ'లో చేరండి!

ఈసారి ఆశ్చర్యపోవడం బెనర్జీ బృందం వంతు అయింది.

"శ్రమ అనుకోకుండా అసలు ఏం జరిగింతో కొంచం వివరించు ఖండేల్" అడిగాడు రంజిత్.

"ఆ రోజు నేను ప్రొద్దుబోయి అడవిలో వస్తున్నాను. అమావాస్య చీకటి. ఇంకా మొండిగా ప్రయాణించడం మంచిది కాదనుకొని అనువైన ప్రాంతంకోసం చూస్తుం డగా ఆ 'గుడి' కన్పించింది. సంతోషంగా వూపిరి పీల్చు కొని గుడిలోకి ప్రవేశించాను. గుడి పాడుబడిపోయివున్నా, ఆ రాత్రికి తలదాచుకోవడానికి మంచి ప్రదేశమే దొరికిందని సంతోషించాను. ప్రయాణంలో అలసివున్నానేమో, గోడకు చేరగిలబడి అలాగే నిద్రబోయాను.

హఠాత్తుగా ఉలిక్కిపడి కళ్లు తెరిచాను. అంతే, నా గుండె ఆగిపోయినట్లనిపించింది. ఓ నల్లని ఆకారం నా మెడ నొక్కేస్తోంది. అంతటితో నా ప్రాణాలు సరి అను కొని చచ్చినట్లు మెడ వాల్చేశాను. ఆశ్చర్యం! ఆ ఆకారం నేను చచ్చిపోయా ననుకొని నన్ను వదలి మాయమై పోయింది. ఆ తరువాత చావు తప్పి కన్ను లొట్టపోయి నట్టుగా ఎలా యింటికి చేరానో నాకే తెలియదు. ఆ తరువాత విచారించగా తెలిసింది, అది దయ్యాల నిలయమని, ఆ దయ్యాలను ప్రత్యక్షంగా చూసి ప్రాణాలతో బ్రతికి బయట పడిందికూడా నేనేనని!" చెప్పాడు దొర.

ఆ సంఘటన వివరిస్తున్నప్పుడు దొర శరీరమంతా స్వేదజలం కమ్మేసింది.

"క్షమించాలి దొరా! నువ్వు యెదుర్కొన్నది దారుణ మైన సంఘటన అని నాకు తెలుసు. అయినా మా ప్రయాణం ఆగదు. అవి దయ్యాలు కానీ, భూతాలు కానీ, మా పని

పాఠకుల ప్రశ్నలు?

యస్. సత్యానంద్, బెల్లంపల్లి.

ఇటీవల అపనలో ప్రింటింగ్ తప్పులు చాల కనబడుతున్నాయి. ఉదాహరణకు 'పాఠకుల పరిశోధన పోటీ' 79, 80 ల ఫలితాలు కూడా ప్రచురించటం జరిగింది. తిరిగి పోటీలో 80 అని ఉంది. ఏమంటారు?

నిజమే. మా ప్రూఫ్ రీడర్లు కథలలోని హంతకులను పట్టుకోవటంలో మునిగి అసలు తప్పును వదిలేసినట్లున్నారు.

ఎస్. క్రిష్ణారావు, అశ్వారావుపేట.

'పాఠకుల పరిశోధన పోటీ-78'కి మీరు ప్రచురించిన సమాధానమే నేను వ్రాశాను. నాకు బహుమతి ప్రకటించలేదేం మరి?

ప్రకటించే సమాధానాలు బహుమతి పొందినవారివి కావు. రచయిత వివరణ మాత్రమే. అందరికంటె అత్యుత్తమంగా వివరించిన పాఠకులకే బహుమతి ప్రకటిస్తున్నాము.

బుడుమూరు గుర్నాధం, పార్వతీపురం.

శ్యామ్‌గారూ! మా 'హోమ్ డెలివరీ' సభ్యత్వము విరమించుకుంటే, మేము కట్టిన రు. 5/-లు తిరిగి పంపుతారా?

హోం.డె. సభ్యత్వము రుసుము తిరిగి చెల్లించేది కాదు. గమనించాలి.

స్వర్గం రంగయ్య, కొత్తపల్లి.

శ్యామ్‌జీ! నాకు డిటెక్టివ్ కావాలని కోరిక వుంది. ఎలా?

వెంటనే డిటెక్టివ్ లాల్ అండ్ జాన్‌లకు అసిస్టెంట్‌గా చేరండి.

నండూరి శైలజ, మద్రాసు.

అన్నయ్యా! మీరు స్వయంగా ఓ హత్యకేసు పరిశోధిస్తే చూడాలనుంది—?

నాకూ పరిశోధించాలనే ఉంది. కాని ఒకవేళ దుండగులు నన్ను బంధిస్తే, అప్పుడు మీకు పత్రికను అందజేసే దెవరా అని ఆలోచిస్తున్నా.

మాకు పూర్తికావాలి." దృఢంగా చెప్పాడు బెనర్జీ.

ఏమీ మాట్లాడలేదు దొర.

"దొరా, నువ్వు మాతో వచ్చి కష్టాలలో యిరుక్కో-నవసరంలేదు. ఆ ఆలయానికి వెళ్ళే దారి చూపించు.చాలు" అన్నాడు రంజిత్.

చివ్వున తల పైకెత్తాడు దొర. అతని కనుకొనుకుల్లో నీళ్ళు నిలిచాయి.

"మీ మంచికోరి నేను చెప్పానుగానీ, నా సుఖంకోసం కాదు బాబయ్యా! కానివ్వండి, మీతో నేనూ పాలు పంచుకుంటాను. మీ పని సానుకూలమయితే అంతకన్నా నాకు కావలసినదేముంది" అన్నాడు దొర.

అపారమైన అతని అభిమానానికి బెనర్జీ మనసు ఆర్ద్రమయింది. మాయా మర్మం, నయవంచన తెలియని జాతి అది!

"కృతజ్ఞతలు దొరా! నీ సహకారాన్ని యీ జన్మలో మర్చిపోలేను" అన్నాడు బెనర్జీ.

"బాబయ్యా, సరిగ్గా తెల్లవారుఝామున బయలుదేరుదాం. బారెడు ప్రొద్దెక్కేటప్పటికి ఆలయం చేరవచ్చు. పగలయితే దయ్యాలకు బలం తక్కువని మా నాయన చెప్పాడు" అన్నాడు దొర.

"అలాగే! ఇక యీ రోజుకు రెస్ట్ తీసుకుందాం" అంటూ లేచాడు బెనర్జీ.

43

"అదిగో. అదే మీ క్కావలసిన ఆలయం" వ్రేలుబెట్టి దూరంగా చూపిస్తూ చెప్పాడు దొర.

చిక్కగా అలుముకున్న వృక్షసమూహం మధ్య కనిపి

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ
(బహుమతి రు. 50/-లు నగదు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి ఈ నెల 15వ తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదేవిధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాంపై వ్రాసి పంపాలి. హో.డె. సభ్యులు తమ నెంబర్లను స్పష్టంగా వ్రాయాలి. ఇతరులు తమ వ్యాఖ్యలతో 30 పైసల స్టాంపులు జతపర్చి పంపాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి. *

గతనెల పోటీ ఫలితాలు

(1) ఫిబ్రవరి '79 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

అనుకోని ఆపద ఎదురైనవేళ!

అతివమోమున మాయమైన జీవకళ!!

పంపినవారు: శ్రీ ఎన్. ప్రభుదానం, ఎల్. పి., గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రింటింగ్ టెక్నాలజీ, మారేడ్‌పల్లి, సికింద్రాబాదు.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

వెళ్ళేది ఎవరి కోసం! మిగిలేది ఎవరి ప్రాణం!!

పంపినవారు: శ్రీ సి. హెచ్. సుమిత్రారావు, S/o బంగారు రావు, మెయిన్‌రోడ్, నర్సాపూర్-534 275. (ప.గో. జిల్లా.)

పై విజేతలకు ఒక్కొక్కరికి రు. 25/-లు చొప్పున బహుమతి పంపబడుతుంది.

స్తున్న పాడుబడిన గోడలను చూపిస్తూ చెప్పాడు దొర.

ఆ గోడలను చూస్తూనే ఆనందంతో వళ్లు పులకరించింది ప్రొఫెసర్ బెనర్జీకి.

అయిదు నిమిషాలలో ఆలయాన్ని చేరుకున్నారు అంతా. లోపలకు ప్రవేశించాలంటే దొరకు కాళ్ళు వణుకుతున్నాయి. అది గమనించాడు ప్రొఫెసర్. అతని పెదాలపై చిన్న నవ్వు మెరిసి మాయమయింది.

"దొరా, యిప్పటికే మాకోసం యెంతో శ్రమించావు. మేము లోపలకు వెళతాం. ఇక నువ్వు సెలవు తీసుకో" అన్నాడు బెనర్జీ.

"ఫర్వాలేదు బాబయ్యా, నేనూ మీతో వస్తాను." అన్నాడు ధైర్యంగా దొర.

"ఆల్‌రైట్, పదండి" అంటూ ముందుకు నడిచాడు రంజిత్.

వెనుకనే దొర, ప్రొఫెసర్, తదితరులు అనుసరించారు.

ఆలయ ద్వారం దాటి లోపలకు ప్రవేశించబోతూండగా ఎదురుగా కన్పించిన దృశ్యానికి ఆశ్చర్యచకితుడై నిల్చుండిపోయాడు రంజిత్.

లోపల వికృతంగా నవ్వుతూ నాలుగు ముసుగు ఆకారాలు నిలబడి వున్నాయి.

వాటిని చూడగానే దొరకు పైప్రాణాలు పైనే పోయినట్లయింది.

"దె .... దె .... దెయ్యాలు! ...." అన్నాడు కలవరింతగా.

అదే క్షణంలో ఓ ఆకారం చేతిలోకి రివాల్వర్ రావడం రంజిత్ సునిశిత దృష్టిని ఆకర్షించింది. అవి దయ్యాలు

రచయితలతో ముఖాముఖి

జయదేవ్ గారికి,

మీ కార్టూన్లు నీతిదాయకంగా వుంటున్నాయి. కనుకనే మీ కార్టూన్లంటే నాకు చాలా యిష్టం. నాకూ కార్టూన్లు గీయాలని, పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని వుంది. నాకు ఆర్టు వచ్చును. మిమ్మలను గురువుగా భావింపవచ్చునా? మీ సలహా ఏమిటి?

—కె. అజిత్ కుమార్, బి. సావరం.

రేఖాచిత్రాలు గీయడం వచ్చిన నీకు కార్టూనులు గీయడం ఏమంత అసాధ్యమైన పనికాదు. నీకు నచ్చిన కార్టూనిస్టుల బొమ్మలను 'స్టడీ'చెయ్. 'ఎక్స్‌ప్రెషన్స్' చేతులూ కాళ్ళూ వేయ డానికి అవి ఉపయోగపడతాయి. కార్టూన్‌లోని బొమ్మలు వీలై నంతవరకు అందంగా వస్తే చూడ ముచ్చటగా వుంటుంది. కాప్షను క్లుప్తంగానూ స్పష్టంగానూ రాయాలి. అన్ని కార్టూన్లూ చూడగానే పేలాలి అన్న నియమంలేదు. కొంచెం ఆలోచింప జేసే కార్టూనులంటే నా కిష్టం. మంచి కార్టూనులు గీస్తే పేరు ప్రఖ్యాతులు తనంతట వస్తాయి. మంచి కార్టూనులు గీయాలంటే మంచి లోకజ్ఞానం అలవరచుకోవాలి. పుస్తకాలు విరివిగా చద వాలి. పదిమందితో కలిసి తిరగాలి. పరిశీలనాత్మకమైన దృష్టితో పరిసరాలను చూడాలి. వీటన్నిటితోపాటు వయసూ కొంచెం ఎదగాలి. నీ అభినందనలకు కృతజ్ఞతలు.

—జయదేవ్.

గీతారాణిగారూ,

మీరు వ్రాసిన క్రైమ్ కథలలో ఏమాత్రం వాస్తవిక సంఘ టనలు కనబడవు. ఈ మధ్య కథలు వ్రాయటంలేదు. ఎందుకని?

—యం. వాసుదెవ్, నిజామాబాదు.

గడ్డిమేటులో సూదిని వెదకుట, క్రైమ్ సాహిత్యంలో వాస్త వికత గురించి ఆలోచించుట ఒక్కటేనని నా అభిప్రాయం. రాసిన సంఘటన సందర్భోచితంగా వుందో లేదో చూడాలి. నా కథలు ప్రింటవుతూనే వున్నాయి కదా! చదవట్లేదా?

—గీతారాణి.

తావని ఏదో అపాయం రాబోతున్నదని క్షణంలో గ్రహించాడు.

"అంతా బోర్లాపడిపోండి. నవీన్ ఎటాక్ దెమ్"
గట్టిగా అరుస్తూ క్రింద బోర్లాపడిపోయాడు రంజిత్.

అదే క్షణంలో ముసుగువ్యక్తి రివాల్వర్‌నుండి దూసుకు వచ్చిన బుల్లెట్ రంజిత్ వెనుక తెల్లబోయి నిల్చుండిపోయిన దొర గుండెలను తాకింది.

'కెవ్వు'మని ఆర్తనాదం చేస్తూ నేలకూలిపోయాడు దొర. అప్పటికే రంజిత్, నవీన్ చేతులలోకి ఆయుధాలు వచ్చేశాయి.

టప టప మంటూ మెరుపులా కాల్పులు సాగించారిద్దరూ.

అంతే, వూహించని ఆ దాడికి తట్టుకోలేని నలుగురు ముసుగు వ్యక్తులు హాహాకారాలు చేస్తూ నేలకూలారు.

గబగబా వారి దగ్గరకు పరుగుదీశాడు రంజిత్.

అప్పటికే అందులో ముగ్గురి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. నాలుగవ వ్యక్తి నరకబాధ అనుభవిస్తున్నాడు.

ముఖంపై ముసుగులు తొలగించివేశాడు రంజిత్.

'దయ్యం కాదు. అతనూ మామూలు మనిషే!

"ఎవరు మీరు? ఇక్కడెందుకు వున్నారు? ఈ నాటకమెందుకు ఆడుతున్నారు?" గర్జించాడు రంజిత్.

చెప్పనన్నట్లుగా తల అడ్డంగా వూపాడా వ్యక్తి.

"చెప్పు. అకారణంగా మామీద దాడిచేసి దెబ్బతిన్నావు. మేము పోలీస్ మనుషులం కాదు. కేవలం గుడిని చూడడానికి వచ్చిన బాటసారులం" చెప్పాడు రంజిత్.